RNI NO. TELTEL/2022/83470 ●manasakshi.in

# మనసాక్షి మీకోసం

తెలుగు దినపత్రిక ఎడిటర్: మల్లె నాగిరెడ్డి



గరిష్ఠానికి బంగారం.. రూ.98,000 మించిన ధర



స్టేజి పైనే... మంత్రి ఎమ్మెల్యే వాగ్వాదం

నల్గొండ | హైదరాబాద్ | సంపుటి : 3. సంచిక :217 | గురువారం 17 ఏప్రిల్ 2025 | పేజీలు 8 | వెల: రూ. 1.00 | epaper.manasakshi.in

# 'కంచ'లోనే లోపలేస్తాం!

కంచ గచ్చిబౌలిలో పర్యావరణానికి జరిగిన నష్టాన్ని సరిదిద్దడం గురించి తప్పితే ఇతర విషయాల గురించి మేం ఆలోచించడంలేదు. 1996 డిసెంబరు 12న సుప్రీంకోర్టు జారీచేసిన ఉత్తర్వులను ఎవరు ఉల్లంఘించినా చూస్తూ ఊరుకోం. చండీగఢ్‌లోని సుక్నా సరస్సును ప్రభావితం చేస్తోందని భావించి టాటాలు నిర్మించతలపెట్టిన భారీ గృహనిర్మాణ ప్రాజెక్టును గతంలో ఆపేశాం. అందువల్ల కంచ గచ్చిబౌలిలో ఐటీ పార్కు ఏర్పాటు చేస్తున్నారా? ఇంకోటి చేస్తున్నారా? అన్నది చూడటంలేదు. డజన్లకొద్దీ బుల్డోజర్లు పెట్టి 100 ఎకరాల్లో అడవిని తుడిచిపెట్టడం గురించే చూస్తున్నాం.

- వర్సిటీ భూములపై సర్కార్‌కు చెంపదెబ్బ
- కంచగచ్చిబౌలి భూములపై సుప్రీం సీరియస్
- సుప్రీం మార్గదర్శకాలు విస్మరించి చెట్ల నరికివేతపై ఆగ్రహం
- ఆ భూముల్లోనే తాత్కాలిక జైలు నిర్మించి అధికారులను వేస్తాం
- నాలుగు వారాల్లో పునరుద్ధరణ నివేదిక సమర్పించాలని ఆదేశం
- స్టేటస్‌కో కొనసాగుతుందని వెల్లడి...విచారణ మే 15కు వాయిదా





## ఎవరు ఉల్లంఘించినా చూస్తూ ఊరుకోం

న్యూఢిల్లీ: ,**మనసాక్షి:**కంచ గచ్చిబౌలి భూముల అంశంపై సుప్రీంకోర్టులో కాంగ్రెస్ ప్రభుత్వానికి ఎదురుదెబ్బ తగిలింది. చెట్ల నరికివేతపై రేవంత్ సర్కార్‌పై సర్వోన్నత న్యాయస్థానం ఆగ్రహం వ్యక్తం చేసింది. చెట్లు కొట్టేసే ముందు అనుమతులు తీసుకున్నారో లేదో స్పష్టంగా చెప్పాలని జస్టిస్ బీఆర్ గవాయి నిలదీశారు. సీఎస్‌ను కాపాడాలని అనుకుంటే.. వంద ఎకరాలను ఎలా పునరుద్ధిస్తారో చెప్పాలని అన్నారు. దీనిపై నాలుగు వారాల్లో ప్రణాళిక సిద్ధం చేయాలని మధ్యంతర ఉత్తర్వులు జారీ చేశారు. తదుపరి విచారణను మే 15వ తేదీకి వాయిదా వేశారు. అప్పటి వరకు స్టేటస్ కో కొనసాగుతుందని అన్నారు. కంచ గచ్చిబౌలి భూముల అంశంపై జస్టిస్ బీఆర్ గవాయి నేతృత్వంలోని ద్విసభ్య ధర్మాసనం బుధవారం విచారణ చేపట్టింది. ఈ సందర్భంగా చెట్లు కొట్టివేసే ముందు అనుమతులు తీసుకున్నారో లేదో స్పష్టంగా చెప్పాలని జస్టిస్ బీఆర్ గవాయి ప్రశ్నించారు. దీనికి ప్రభుత్వ తరఫున లాయర్ స్పందిస్తూ జామాయిల్ తరహా చెట్లు-, పొదలను అనుమతి తీసుకునే తొలగించామని తెలిపారు. అందుకు చెట్ల నరికివేతపై సమర్థించుకోవద్దని జస్టిస్ బీఆర్ గవాయి ఆగ్రహం వ్యక్తం చేశారు. 1996లో సుప్రీంకోర్టు ఇచ్చిన మార్గదర్శకాల ప్రకారం అనుమతులు తీసుకున్నారో లేదో చెప్పాలన్నారు. వారంతపు సెలవుల్లో మూడు రోజుల్లో చెట్లు కొట్టాల్సిన తొందర ఎందుకొచ్చిందని ప్రశ్నించారు. మీరు చెట్లు కొట్టడం వల్ల అక్కడ జంతువుల మీద కుక్కలు దాడి చేస్తున్నాయని.. ఆ వీడియోలను చూసి ఆందోళనకు గురయ్యామని తెలిపారు. పర్యావరణ పరిరక్షణలో రాజీపడే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. అవసరమైతే 2400 ఎకరాల్లో ఒక్క చెట్టు కూడా కొట్టకుండా ఆదేశాలివ్వాల్సి వస్తుందని తెలిపారు. సుప్రీంకోర్టు మార్గదర్శకాలకు విరుద్ధంగా వ్యవహరిస్తే ఊరుకోమని జస్టిస్ గవాయి హెచ్చరించారు. భూముల మార్టిగేజ్‌తో తమకు సంబంధం లేదని.. చెట్ల నరికివేత గురించే తాము మాట్లాడుతున్నామని చెప్పారు. కంచ గచ్చిబౌలిలో అడవులు లేవని వాదిస్తే.. అదే ప్రాంతంలో జైలు కట్టి అందులోనే అధికారులను పెట్టాల్సి ఉంటుందని జస్టిస్ బీఆర్ గవాయి హెచ్చరించారు. చెట్లు కొట్టేసే ముందు అనుమతి ఉందా లేదా అన్నదే ముఖ్యమని తెలిపారు. అనుమతులు లేకుండా చెట్లు-కొట్టేసినందుకు సీఎస్ సహా అధికారులు జైలుకు వెళ్లాల్సి ఉంటుందని హెచ్చరించారు. సీఎస్‌ను కాపాడాలనుకుంటే.. వంద ఎకరాలను ఎలా పునరుద్ధిస్తారో చెప్పాలన్నారు. పునరుద్ధరణ ఎలా చేస్తారు? ఎంతకాలంలో చేస్తారు? జంతు జాలాన్ని ఎలా సంరక్షిస్తారో

స్పష్టంగా చెప్పాలని ఆదేశించారు. దీనిపై నాలుగు వారాల్లో ప్రణాళిక ఫైల్ చేయాలని మధ్యంతర ఉత్తర్వులు జారీ చేశారు. తెలంగాణలో వాల్టా చట్టం అమలులో ఉందని, దాని ప్రకారం స్వయం అనుమతులుగా ప్రభుత్వం వ్యవహరించిందని అమికస్ క్యూరీ సుప్రీంకు వివరించారు. పర్యావరణాన్ని కాపాడటానికి మేము ఇక్కడ ఉన్నాం. అధికారుల అనుమతి లేకుండా ఎన్ని చెట్లను నరికివేశారో అనే ఆందోళన మాత్రమే ఉంది. చెట్లను ఎలా పునరుద్ధరిస్తారో చెప్పాలి. మేము బుల్డోజర్ ఉనికి, 100 ఎకరాల అడవిని తొలగించడం గురించి మాత్రమే ఆందోళన చెందుతున్నాం. మీరు నిర్మించాలనుకుంటే, మీరు అనుమతులు తీసుకొని ఉండాలి అని జస్టిస్ అన్నారు.

# అనుమతులన్నీ తీసుకున్నాకే పనులు చేపట్టాం


కంచ గచ్చిబౌలిలోని 400 ఎకరాలు అటవీ భూములు కావని, ప్రభుత్వ పోరంబోకు/బంజరు భూములని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి(సీఎస్) శాంతికుమారి



- ఆ 400 ఎకరాలు ప్రభుత్వ బంజరు భూములు
- 2004లోనే నాటి ప్రభుత్వం అభివృద్ధి పనులకు కేటాయించింది
- సుప్రీంకోర్టులో దాఖలు చేసిన అఫిడవిట్‌లో సీఎస్ వెల్లడి

# 15మందితో గద్దర్ అవార్డుల జ్యూరీ కమిటీ

### చైర్‌పర్సన్‌గా జయసుధ నియామకం



హైదరాబాద్:,**మనసాక్షి:** తెలుగు సినిమా రంగాన్ని ప్రోత్సహించేందుకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రకటించిన గద్దర్ తెలంగాణ ఫిల్మ్ అవార్డుల జ్యూరీ కమిటీకి చైర్‌పర్సన్‌గా నటి జయసుధను ఎంపిక చేశారు. నంది అవార్డుల స్థానంలో గద్దర్ అవార్డులు ఇవ్వాలని తెలంగాణ ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు నిర్ణయం కూడా తీసుకుంది. ఈ క్రమంలో 15 మంది సభ్యులతో జ్యూరీ ఏర్పాటైంది. అవార్డుల కోసం దరఖాస్తు చేసిన నామినేషన్లను ఈ నెల 21 నుంచి జ్యూరీ పరిశీలించనుంది. జయసుధ, ఎఫ్‌డీసీ ఎండీ హరీశ్‌లతో సమావేశమైన ఎఫ్‌డీసీ ఛైర్మన్, నిర్మాత దిల్ రాజు నామినేషన్లను నిష్పక్షపాతంగా పరిశీలించాలని సూచించారు. ఎంపిక పక్రియను సజావుగా పూర్తి చేయాలని కోరారు. 14 ఏళ్ల తర్వాత ప్రభుత్వం చలన చిత్ర అవార్డులను ఇస్తున్నట్టు గుర్తుచేసిన దిల్ రాజు.. ఉమ్మడి రాష్ట్రంలో కూడా చలన చిత్ర అవార్డులకు ఇంతటి స్పందన రాలేదన్నారు. గద్దర్ తెలంగాణ ఫిల్మ్ అవార్డుల కోసం అన్ని విభాగాల్లో 1248 నామినేషన్లురాగా వ్యక్తిగత కేటగిరీలో 1172, ఫీచర్ ఫిల్మ్, చిల్డ్రన్ ఫిల్మ్స్, డాక్యుమెంటరీ, ఫిల్మ్ క్రిటిక్స్, పుస్తకాలు తదితర కేటగిరిల్లో 76 దరఖాస్తులు అందినట్టు వెల్లడించారు.

# ఏపి కృష్ణాజలాల దోపిడీ



సూర్యాపేట:,**మనసాక్షి:** తెలంగాణ మాజీ మంత్రి జగదీశ్ రెడ్డి కృష్ణా నదీ జలాల వ్యవహారంపై కీలక వ్యాఖ్యలు చేశారు. నేడు ఆయన మీడియాతో మాట్లాడుతూ.. తెలంగాణ ప్రభుత్వ నిర్లక్ష్యం, చేతకానితనాన్ని తీవ్రంగా విమర్శించారు. గత రెండు నెలలుగా తమ పార్టీ చెబుతోన్న వాదనల్ని ఇప్పుడు కృష్ణా బోర్డు కూడా సమర్థించిందని తెలిపారు. అంతేకాకుండా, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఇప్పటి వరకు అక్రమంగా 65 టీ-ఎంసీల నీటిని తీసుకెళ్లిందని ఆరోపించారు. ఏపీ ప్రభుత్వం నీళ్లను అక్రమంగా తరలిస్తుందన్న విషయం మేము ఎప్పటి నుంచో చెబుతున్నాం. కానీ, ఇప్పుడే కృష్ణా బోర్డు చెప్పడంతో మా మాటకు న్యాయం జరిగినట్లయ్యిందని అన్నారు. అలాగే తెలంగాణ ప్రభుత్వం ఏదో చంద్రబాబుతో లోపాయికీ ఒప్పందం చేసుకున్నట్లుగా అనుమానం వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఇప్పటివరకు ఎలాంటి పైరవీలు నమోదు చేయకుండా మౌనంగా ఉండటం వెనుక కారణం ఇదే కావచ్చని మండిపడ్డారు. ఈ పరిస్థితుల వల్ల రాష్ట్రంలోని ఐదు జిల్లాల్లో తీవ్ర నీటి ఎద్దడి తలెత్తే ప్రమాదముందని హెచ్చరించారు. తాగునీటికి కూడా ఇబ్బందులు వస్తాయని స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి, మంత్రులు ఈ అంశంపై ఒక్క రివ్యూకూడా చేయకపోవడాన్ని తీవ్రంగా తప్పుపట్టారు. ప్రజలు మళ్లీ పాత రోజులకు, దరిద్రాలకు వస్తున్నాయని మండిపడ్డారు. ప్రజలు మరో ఉద్యమానికి సిద్ధంగా ఉండాలని.. ఆయన ప్రజలను ఉద్యమానికి పిలుపునిచ్చారు. ఈ అంశంపై త్వరలోనే మాజీ సీఎం కేసీఆర్ కార్యచరణ ప్రకటిస్తారని, రాష్ట్ర ప్రభుత్వం జలవనరుల పరిరక్షణలో పూర్తిగా విఫలమైందని పేర్కొన్నారు.



## దేశాన్ని లూటీ చేసిన నెహ్రూ కుటుంబం

- దేశాన్ని అవినీతమయంగా చేశారు
- కాంగ్రెస్ హయాంలోనే నేషనల్ హెరాల్డ్ కేసు
- కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి మండిపాటు

# నేటినుంచి భూభారతి అవగాహన సదస్సులు

- నాలుగు మండలాల్లో పైలెట్ ప్రాజెక్టుగా అమలు
- ఉమ్మడి పాలమూరు జిల్లాలో ప్రారంభించనున్న పొంగులేటి





# జపాన్ చేరుకున్న సిఎం రేవంత్

హైదరాబాద్: ,**మనసాక్షి:**వారం రోజుల పర్యటన నిమిత్తం తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి బృందం జపాన్ చేరుకుంది. అక్కడి భారత రాయబారి శింబు జార్జ్.. సీఎం, అధికారులకు ఆతిథ్య విందు ఇచ్చారు. టోక్యోలోని వందేళ్ల నాటి ఇండియా హౌజ్‌లో ఇచ్చిన విందులో సీఎం రేవంత్ బృందంతో పాటు- పలువురు తమిళనాడుకు చెందిన ఎంపీలు పాల్గొన్నారు. వివిధ అంశాలపై రాయబారి, తమిళ ఎంపీలతో సీఎం రేవంత్ చర్చించారు. సీఎం రేవంత్‌రెడ్డి.. గురువారం టోక్యోలోని సోనీ గ్రూప్, జపాన్ ఇంటర్నేషనల్ కో-ఆపరేషన్ ఏజెన్సీ.. జెట్రో, జపాన్ బయో ఇండస్ట్రీ అసోసియేషన్, వివిధ సంస్థలతో సమావేశం కానున్నారు. సాయంత్రం తొషిబా ఫ్యాక్టరీని రాష్ట్ర బృందం సందర్శించనుంది. ఐటీ-, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు బుధవారం రాత్రి హైదరాబాద్ నుంచి బయలుదేరి గురువారం జపాన్ చేరుకోనున్నారు.




## భారీ లాభాలతో ముగిసిన స్టాక్ మార్కెట్లు




## గ్రూప్-1 పరీక్షలో భారీ స్కామ్

సిబిఐ విచారణ జరిపించాలి: పాడి డిమాండ్



## తెలంగాణలో రాగల మూడ్రోజులు వర్షాలు

ఈదురుగాలులతో వానలు పడే అవకాశం



## సుప్రీం తీర్పు ప్రభుత్వానికి చెంపపెట్టు

కాంగ్రెస్ పర్యావరణ విధ్వంసాన్ని గుర్తించిన ధర్మాసనం మాజీమంత్రి హరీష్ రావు వెల్లడి

# దేశాన్ని లూటీ చేసిన నెహ్రూ కుటుంబం

న్యూఢిల్లీ: నెహ్రూ కుటుంబం దేశాన్ని లూటీ చేసిందని.. అంతేకాని.. దేశానికి ఆ కుటుంబం ఏం చేయలేదని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి మండిపడ్డారు. ఆ క్రమంలో దేశాన్ని అవినీతిమయంగా మార్చిన విషయం మనం చూస్తున్నామన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడే నేషనల్ హెరాల్డ్ కేసు వచ్చిందని గుర్తు చేశారు. కాంగ్రెస్ పార్టీతోపాటు- ఆ పార్టీ అగ్రనేతలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీలపై మంత్రి జి.కిషన్ రెడ్డి మరోసారి నిప్పులు చెరిగారు. బుధవారం న్యూఢిల్లీలో కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ హయాంలో బొగ్గు, హెలికాప్టర్, బోఫోర్స్ కుంభకోణాలు లాంటివి ఎన్నో జరిగాయన్నారు. ఆ క్రమంలో జరిగిన మరో పెద్ద కుంభకోణమే నేషనల్ హెరాల్డ్ అని ఆయన పేర్కొన్నారు. స్వాతంత్ర్య సమరయోధులు నేషనల్ హెరాల్డ్ స్థాపిస్తే.. దానిని దొడ్డి దారిన సోనియా, రాహుల్ గాంధీలకు చెందిన రియల్ ఎస్టేట్ కంపెనీకి తరలించారని విమర్శించారు. ఈ వ్యవహారంపై దేశవ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ ధర్నా చేయడం సిగ్గు మాలిన చర్య అని ఈ సందర్భంగా ఆయన అభివర్ణించారు. 2012లో నేషనల్ హెరాల్డ్ ఆస్తులపై దర్యాప్తు జరపాలంటూ సుబ్రమణ్య స్వామి పిటిషన్ వేశారన్నారు. అందులోభాగంగా సోనియాగాంధీ, రాహుల్ గాంధీలపై ఆయన కేసు వేశారని తెలిపారు . అయినా.. కాంగ్రెస్ పార్టీ ఎందుకు ధర్నాలు చేస్తుందని ఆయన సందేహం వ్యక్తం చేశారు. వీరికి భయపడి కేసులు వెనక్కి తీసుకోవాలా? అని పార్టీని సూటిగా ఆయన ప్రశ్నించారు. ఈ వ్యవహారంపై దేశంలో అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు సైతం దర్యాప్తు జరపాలని చెప్పిందని గుర్తు చేశారు. చేసిన తప్పులకు చెంపలు వేసుకోవాలని కాంగ్రెస్ పార్టీ అగ్రనేతలు సోనియా, రాహుల్ గాంధీలకు ఆయన సూచించారు. ప్రజలను తప్పుదారి పట్టించడంతోపాటు ఈడీ కార్యాలయాల ముందు ధర్నా చేయడం మానుకోవాలని వారికి హితవు పలికారు. కాంగ్రెస్ పార్టీ చేసిన కుంభకోణాలను ప్రజలు ఇంకా మరిచిపోలేదన్నారు. కాంగ్రెస్ పార్టీ ధర్నా చేయడమంటే ప్రజాస్వామ్యాన్ని, సుప్రీంకోర్టు, హైకోర్టును తప్పుపట్టడమేనని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ కేసులు ఎందుకు వెనక్కి తీసుకోవాలని కాంగ్రెస్ పార్టీ శ్రేణులను ఆయన డిమాండ్ చేశారు. చట్టానికి వీరేమైనా చుట్టాలా అంటూ ఆయన సందేహం వ్యక్తం చేశారు.

## భారీ లాభాలతో ముగిసిన స్టాక్ మార్కెట్లు



న్యూఢిల్లీ: భారత స్టాక్ మార్కెట్ సూచీలు లాభాలతో ముగిశాయి. బుధవారం ఉదయం గ్యాప్ డౌన్ తో స్టార్ట్ అయిన మార్కెట్లు-.. నిమిషాల వ్యవధిలోనే కోలుకొని బుల్ ర్యాలీ తీశాయి. మార్కెట్లు ముగిసే సమయానికి సెన్సెక్స్ 309.40 పాయింట్లు (0.40 శాతం) లాభంతో.. 77,044.29 వద్ద, నిఫ్టీ 108.65 పాయింట్ల(0.47శాతం) లాభంతో.. 23,437.20 పాయింట్ల వద్ద నిలిచాయి. నిఫ్టీ రెండు వారాల గరిష్ట స్థాయిని తాకడం మరో విశేషం. నిఫ్టీ బ్యాంక్ ఇండెక్స్ 738.25 పాయింట్లు-(1.41 శాతం) పెరిగి 53,117.75 వద్ద, నిఫ్టీ మిడ్‌క్యాప్ 100 371 పాయింట్లు- పెరిగి 52,345 వద్ద స్థిరపడటంతో మార్కెట్ సెంటిమెంట్ ఉత్సాహంగా ఉంది. ఈక్విటీ-బెంచ్‌మార్క్‌లు ఇవాళ్టి సెషన్‌ను రోజు గరిష్ట స్థాయిలో ముగించడం మరో ఆసక్తికర అంశం. బ్యాంకింగ్, ఫైనాన్షియల్ రంగం షేర్లలో బలమైన కొనుగోళ్ల కారణంగా వరుసగా మూడవ రోజు లాభాలను నమోదు చేశాయి. దలాల్ స్ట్రీట్‌లో బ్యాంకులు ముందంజలో ఉన్నాయి. యాక్సిస్ బ్యాంక్, ఇండస్‌ఇండ్ బ్యాంక్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ నిఫ్టీ లాభాల్లో కీలక పాత్ర పోషించాయి. ప్రభుత్వ రంగ బ్యాంకులు ఇండియన్ బ్యాంక్, యూనియన్ బ్యాంక్ 4-5శాతం ర్యాలీ తీసి మిడ్‌క్యాప్ సూచీలను ముందుకు తీసుకెళ్లాయి. నిన్న భారత స్టాక్ మార్కెట్లు భారీ స్థాయిలో పెరిగిన సంగతి తెలిసిందే. అదే ఊపును మార్కెట్లు- ఇవాళ వరుసగా మూడో రోజు కొనసాగించడం విశేషం. నిన్న మంగళవారం సెన్సెక్స్ 1,671.65 పాయింట్లు- లేదా 2.22 శాతం లాభంతో.. నిఫ్టీ 513.45 పాయింట్లు- లేదా 2.25 శాతం లాభంతో ముగిసిన సంగతి తెలిసిందే.

## నేటినుంచి భూభారతి అవగాహన సదస్సులు




హైదరాబాద్: ధరణి స్థానంలో తీసుకుని వచ్చిన తెలంగాణ భూ భారతి కార్యక్రమం గురువారం నుంచి నాలుగు మండలాల్లో పైలట్ ప్రాజెక్టుగా అమలు కానుంది. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెడుతున్న భూభారతి పైలట్ ప్రాజెక్టు రాష్ట్రంలోని నాలుగు మండలాల్లో ప్రారంభించనున్నారు. ములుగు జిల్లా వెంకటాపురం, ఖమ్మం జిల్లా నేలకొండపల్లి, కామారెడ్డిలోని లింగంపేట, నారాయణపేట జిల్లా మద్దూర్ మండలంలోని ఖాజీపురంలో భూ భారతి పైలట్ ప్రాజెక్టు ప్రారంభించనున్నారు.. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని మద్దూర్ మండలం ఖాజీపురంలో రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రాజెక్టు ప్రారంభించనున్నారు. అలాగే.. వికారాబాద్ జిల్లా పుడూరు గ్రామంలో జరిగే భూ భారతి చట్టం అవగాహన కార్యక్రమంలో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పాల్గొననున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా జరుగనున్న భూ భారతి చట్టం అవగాహన సదస్సులో జిల్లా కలెక్టర్లు, ఎమ్మెల్యేలు, రెవెన్యూ అధికారులు పాల్గొననున్నారు. ఏప్రిల్ 17 నుంచి జూన్ 2 వరకు భూ భారతి చట్టం పై అవగాహన సదస్సులు నిర్వహించనుంది ప్రభుత్వం. రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న ఒక ప్రతిష్టాత్మకమైన కార్యక్రమం ఇది. దీని ప్రయోజనం రాష్ట్రంలో భూ నిర్వహణను సమర్థవంతంగా నిర్వహించడం , రైతులకు, పర్యావరణానికి అనుకూలంగా భూముల వినియోగాన్ని ప్రోత్సహించడం. ఈ కార్యక్రమం, తెలంగాణలో భూముల రిజిస్ట్రేషన్, భూమి చట్టాలు, ఆస్తి హక్కుల పునరుద్ధరణ వంటి ముఖ్యమైన అంశాలను కవర్ చేస్తుంది. భూ భారతి కార్యక్రమం ద్వారా, ప్రభుత్వమే భూముల ఖాతాలు, రికార్డులను సరికొత్తగా సృష్టించి వాటి మాలికల హక్కులను సులభంగా ప్రజలకు అందించేందుకు సహాయపడుతుంది. అంతేకాకుండా, ఇది రైతులకు భూములపై అనువైన పర్యవేక్షణను, కరెంట్ పొదుపు, పర్యావరణ పరిరక్షణ అంశాలు వంటి వాటిపై అవగాహన కూడా పెంచుతుంది.

## స్టేజి పైనే...మంత్రి ఎమ్మెల్యే వాగ్వాదం



నిజామాబాద్:నిజామాబాద్ జిల్లా భీంగల్ లో కల్యాణలక్ష్మీ చెక్కుల పంపిణిలో ఉద్రిక్తత నెలకొంది. స్టేజ్ పైనే మంత్రి జూపల్లి కృష్ణారావు,బీఆర్ఎస్ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి ఒకరినొకరు వాగ్వాదానికి దిగారు. జూపల్లి మాట్లాడుతుండగా డౌన్ డౌన్ అంటూ బీఆర్ఎస్ కార్యకర్తలు నినాదాలు చేశారు. దీంతో కాంగ్రెస్,బీఆర్ఎస్ కార్యకర్తలు బాహాబాహీకి దిగారు. మంత్రి జూపల్లి స్టేజ్ పై కల్యాణలక్ష్మీ చెక్కుల పంపిణీ చేస్తుండగా తులం బంగారం ఏమైందని ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి ప్రశ్నించారు. వెంటనే మంత్రి జూపల్లి కల్గజేసుకుని 10 ఏళ్లలో మీరు మూడెకరాల భూమి ఇచ్చారా?. నిరుద్యోగ భృతి ఇచ్చారా? గతంలో చేసిన ముఖ్యమంత్రుల అప్పు,10 ఎళ్లలో కేసీఆర్ చేసిన అప్పు సమానం. మేము వచ్చి 16 నెలలే అయింది ఇచ్చిన హామీలు అన్ని అమలు చేస్తాం అని మంత్రి జూపల్లి బదులిచ్చారు. దీంతో ఇరువురి మధ్య వాగ్వాదం తలెత్తడంతో కాంగ్రెస్, బీఆర్ఎస్ వర్గాలు బాహాబాహికి దిగారు. పోలీసులు కల్గజేసుకుని ఇరు వర్గాలను చెదరగొట్టారు. తోపులాట జరగడంతో ఉద్రిక్తత నెలకొంది. దీంతో పోలీసులు స్వల్ప లాఠీచార్జ్ చేయడంతో పలువురికి స్వల్ప గాయాలయ్యాయి.

## గ్రూప్-1 పరీక్షలో భారీ స్కామ్



హైదరాబాద్: గ్రూప్-1 పరీక్షలో భారీ స్కామ్ జరిగిందని బీఆర్ఎస్ నేత, హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి సంచలన ఆరోపణలు చేశారు. మొత్తం 21,093 మంది మెయిన్స్ పరీక్ష రాస్తే.. 21,103 మందికి ఫలితాలు ఎలా ఇచ్చారని అన్నారు. ఆ 10 మంది అదనంగా ఎలా వచ్చారని ప్రశ్నించారు. పరీక్ష రాసిన వాళ్ళకంటే ఎక్కువ మందికి రిజల్ట్ ఇస్తారని నిలదీశారు. ఉర్దూ మీడియంలో మొదటగా 9 మంది అని చెప్పి.. తర్వాత 10 అంటున్నారు.. ఒక్కరు ఎలా పెరిగారని క్వశ్చన్ చేశారు. యూపీఎస్సీలో ప్రిలిమ్స్‌కు, మెయిన్స్ కు ఒకేటే హాల్ టికెట్ ఉంటుందని.. మరీ ఇక్కడ ప్రిలిమ్స్, మెయిన్స్‌కు ఎందుకు వేర్వేరుగా హాల్ టికెట్ నెంబర్లు ఇచ్చారన్నారు. కమిషన్లు తీసుకోని ఫలితాలు ఇచ్చారని ఆరోపించారు. 438 సిరీస్‌లో ఉన్న వారందరికీ ఒకే మార్కులు ఎలా వస్తాయన్నారు. కాంగ్రెస్ నేత రాములు నాయక్ కోడలికి మల్టీ జోన్‌లో ఫస్ట్ ర్యాంక్ వచ్చింది. తన కోడలు పరీక్షల కోసం 18 గంటలు చదివిందని రాములు నాయక్ చెప్పారు. ఆయన కోడలు మాత్రం రోజు 5 గంటలు చదివానని చెప్పింది. ఇద్దరిలో ఎవరు చెప్పేది నిజమని ప్రశ్నించారు. కోటి ఉమెన్స్ కాలేజ్‌లో అమ్మాయిలు మాత్రమే పరీక్షా రాశారని.. ఈ సెంటర్లో పక్కా స్కామ్ జరిగిందని ఆరోపించారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం అన్ని విభాగాల్లో ఫెయిల్ అయ్యిందని.. స్కాములు చేస్తోందని అన్నారు.

## తెలంగాణలో రాగల మూడ్రోజులు వర్షాలు

### ఈదురుగాలులతో వానలు పడే అవకాశం



**హైదరాబాద్:** తెలంగాణలో మరో మూడు రోజులు వర్షాలు కురుస్తాయని వాతావరణశాఖ తెలిపింది. తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు నమోదయ్యే అవకాశం ఉందని పేర్కొంది. అదే సమయంలో రాబోయే మూడురోజుల్లో గరిష్ఠ ఉష్ణోగ్రతలు రెండు నుంచి మూడు డిగ్రీలు పెరిగే ఛాన్స్ ఉందని చెప్పింది. జయశంకర్ భూపాలపల్లి, ములుగు, కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట జిల్లాల్లో అక్కడక్కడ గంటకు 40 నుంచి 50 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీస్తాయని తెలిపింది. వరంగల్, హన్మకొండ, జనగాం, సిద్దిపేట, యాదాద్రి భువనగిరి, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజ్‌గిరి, వికారాబాద్, మెదక్, మహబూబ్‌నగర్, నాగర్ కర్నూల్, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాల్లో అక్కడక్కడ ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో వానలు పడుతాయని తెలిపింది. కొన్ని జిల్లాల్లో బుధవారం ఉరుములు మెరుపులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరించింది. కొన్ని జిల్లాల్లో గంటకు 40 నుంచి 50 కిలోమీటర్లు, మరికొన్ని జిల్లాల్లో గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీస్తాయని తెలిపింది. రానున్న రెండు రోజులు పలు జిల్లాల్లో గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో ఈదురు గాలులతోపాటు- ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం పడే సూచనలున్నాయని పేర్కొంది. రాగల మూడు రోజులు అక్కడక్కడ తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని వెల్లడించింది. గరిష్ఠ ఉష్ణోగ్రతలు రెండు నుంచి మూడు డిగ్రీలు పెరిగే అవకాశం ఉందంది. నైరుతి బంగాళాఖాతం, దాని పరిసర ప్రాంతాల్లో సముద్ర మట్టం నుంచి 1.5 కి.మీ.ఎత్తులో కొనసాగిన ఉపరితల ఆవర్తనం.. బలహీన పడిందని వాతావరణ కేంద్రం విడుదల చేసిన ఓ ప్రకటనలో తెలిపింది. బుధవారం సైతం హైదరాబాద్ మహానగరంలో ఉదయం నుంచి ఎండలు మండిపోయాయి. మధ్యాహ్నం వరకు ఇదే పరిస్థితి ఉన్న సంగతి తెలిసిందే. ఇక వాతావరణంలో తేమ శాతం బాగా తగ్గిపోయింది. ఇక నీటి ఎద్దడి సైతం ప్రజలును తీవ్ర ఇబ్బందికి గురి చేస్తోంది. గురువారం భూపాలపల్లి, ములుగు, కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ, జనగాం, నాగర్ కర్నూల్ జిల్లాల్లో అక్కడక్కడ ఈదురుగాలులు, ఉరుములు, మెరుపులతో వానలు పడే సూచనలున్నాయని చెప్పింది. శుక్రవారం భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ, నాగర్ కర్నూల్ జిల్లాల్లో ఉరుములు, మెరుపులు, గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో వర్షాలు కురుస్తాయని వాతావరణశాఖ వివరించింది. ఈ మేరకు ఆయా జిల్లాలకు వాతావరణశాఖ ఎల్లో అలెర్ట్‌ని జారీ చేసింది.

## అనుమతులన్నీ తీసుకున్నాకే పనులు చేపట్టాం



హైదరాబాద్: కంచ గచ్చిబౌలిలోని 400 ఎకరాలు అటవీ భూములు కావని, ప్రభుత్వ పోరంబోకు/బంజరు భూములని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి(సీఎస్) శాంతికుమారి స్పష్టంచేశారు. అన్ని అనుమతులు తీసుకున్నాకే రూ.50 వేల కోట్ల పెట్టుబడులతో లక్ష ఉద్యోగాల కల్పనకు ఈ భూమి అభివృద్ధి ప్రారంభించినట్లు తెలిపారు. దాదాపు ఇరవై ఏళ్లపాటు న్యాయపరమైన వివాదాల్లో ఉండటం, వినియోగంలో లేకపోవడంతో అక్కడ చెట్లు పెరిగాయన్నారు. ఈ మేరకు సుప్రీంకోర్టులో దాఖలు చేసిన అఫిడవిట్‌లో సమగ్ర వివరాలను వెల్లడించారు. కంచ గచ్చిబౌలిలోని సర్వే నంబరు-25లో 2374.02 ఎకరాల భూములున్నాయి. వీటిలో ఐదు నీటి కుంటలున్నాయి. ఇది 'కంచ పోరంబోకు సర్కారీ భూమి'గా నమోదై ఉంది. 1975లో 2,324.05 ఎకరాల పొజిషన్‌ను యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్(హెచ్‌సీయూ)కు రాష్ట్ర ప్రభుత్వం అప్పగించింది. అయితే వర్సిటీ పేరిట ఫైనల్ ఎలైనేషన్ ఉత్తర్వులు జారీ కాలేదు. రెవెన్యూ రికార్డుల్లో ఇప్పటికీ ప్రభుత్వ భూమిగానే ఉంది. హెచ్‌సీయూకి విశాలమైన ఖాళీ భూములున్నాయి. వాటికి, ప్రస్తుత 400 ఎకరాలకు మధ్య ఎలాంటి ఫెన్సింగ్ లేదు. వర్సిటీతోపాటు చుట్టుపక్కల భూముల్లో సంచరించే జింకలు, నెమళ్లు, ఇతర పక్షులు ఈ భూముల్లో వచ్చి పోతుంటాయి. ఈ 400 ఎకరాలను గతంలో రాష్ట్ర ప్రభుత్వం క్రీడల కోసం అభివృద్ధి చేసేందుకు ఐఎంజీ అకాడమీస్ భారత ప్రైవేట్ లిమిటెడ్‌తో 2003 ఆగస్టు 9న ఒప్పందం కుదుర్చుకుంది. ఈ క్రమంలో 400 ఎకరాలను హెచ్‌సీయూ నుంచి తీసుకొని 2004 ఫిబ్రవరి 3న స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఏపీ(శాప్)కి అప్పగించింది. మరో 134.28 ఎకరాలను టీఎన్‌జీవో హౌసింగ్ సొసైటీకి కేటాయించింది. అనంతరం శాప్ 400 ఎకరాలను ఐఎంజీ సంస్థకు బదిలీ చేసింది. బదులుగా సర్వేనంబరు-36లోని 191.36 ఎకరాలతోపాటు సర్వేనంబరు-37లోని 205.20 ఎకరాలను అదేరోజు హెచ్‌సీయూకి కేటాయించింది. అనంతరం వివాదం చెలరేగడంతో ఐఎంజీతో కుదిరిన ఒప్పందాన్ని 2006 నవంబరు 21న ప్రభుత్వం రద్దు చేసుకుని భూమిని వెనక్కి తీసుకుంది. దీనిపై ఐఎంజీ సంస్థ హైకోర్టును ఆశ్రయించింది. హైకోర్టులో 2023 మార్చి 7న ప్రభుత్వానికి అనుకూలంగా తీర్పు రావడంతో ఐఎంజీ సంస్థ ఎస్‌ఎల్‌పీ దాఖలు చేసింది. దాన్ని మే3న న్యాయస్థానం కొట్టివేసింది.ఐటీ విస్తరణకు కీలక ప్రాంతం హైదరాబాద్ ఐటీహబ్‌గా రూపాంతరం చెందింది. 1,400లకుపైగా ఐటీ కంపెనీల్లో లక్షల మంది ఉద్యోగులున్నారు. మాదాపూర్, గచ్చిబౌలి, రాయదుర్గం, ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ ప్రాంతాల్లో ఉన్న భారీ ఐటీపార్కులకు ఈ 400 ఎకరాల భూములు సమీపంలో ఉన్నాయి. పరిశ్రమ మరింత విస్తరణకు అవకాశము ఉండటాన్ని దృష్టిలో పెట్టుకొని కొత్త ప్రాజెక్టులను అభివృద్ధి చేయాలని టీజీఐఐసీ 122.63 ఎకరాలలో గత జనవరి 15న లేఅవుట్‌ను ఖరారు చేసింది.అన్ని ప్రక్రియలు పూర్తిచేశాం వివాదం ముగిసిన

తర్వాత టీజీఐఐసీ ఈ భూమిని తీసుకుని అభివృద్ధి చేయడం ప్రారంభించింది. పర్యావరణ పరిరక్షణ ప్రణాళికను సైతం తయారు చేసింది. తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి(పీసీబీ) వద్ద గత జనవరి 20న 'కన్సెంట్ ఫర్ ఎస్టాబ్లిష్‌మెంట్' పిటిషన్‌ను దాఖలు చేయగా అనుమతి లభించింది. టీజీఐఐసీ రెవెన్యూ శాఖ నుంచి మార్చి 17న ఈ భూముల్లోని చెట్లకు తహసీల్దారు నుంచి యాజమాన్యపత్రాన్ని పొంది,

వాటి వివరాలను శంషాబాద్ అటవీ డివిజినల్ అధికారికి అందజేసింది. ఆ తర్వాత మాత్రమే టీజీఐఐసీ అభివృద్ధి పనులను చేపట్టింది. ఈ భూమిని కొనుగోలు చేసే వ్యక్తులు విడివిడిగా పర్యావరణ అనుమతులను తప్పనిసరిగా తీసుకోవాలి.ఎక్కడైనా 50 హెక్టార్లకు మించి లేదా లక్షన్నర చదరపు మీటర్లకు మించి నిర్మాణాలు చేపడితే రాష్ట్ర పర్యావరణ ప్రభావ అధ్యయన అథారిటీ నుంచి పర్యావరణ అనుమతి పత్రాన్ని తీసుకోవాలి. ఇక్కడ 50 హెక్టార్లలోపు మాత్రమే అభివృద్ధి చేస్తున్నట్లు టీజీఐఐసీ పీసీబీకిచ్చిన దరఖాస్తులో తెలిపింది. పర్యావరణ నిర్వహణ ప్రణాళికను సైతం మార్చి 3న దాఖలు చేసింది.

## గరిష్ఠానికి బంగారం.. రూ.98,000 మించిన ధర



న్యూఢిల్లీ: ప్రపంచవ్యాప్తంగా చోటు-చేసుకుంటు-న్న వాణిజ్య మార్పులు భారత మార్కెట్‌పై భారీ ప్రభావాన్ని చూపిస్తున్నాయి. ఈ క్రమంలోనే దేశ రాజధాని ఢిల్లీలో బుధవారం 24 క్యారెట్ల బంగారం ధరలు రూ.1,650 పెరిగి 10 గ్రాములకు రూ.98,100కు చేరాయి. ఇదే సమయంలో 99.5 శాతం స్వచ్ఛత కలిగిన బంగారం ధర కూడా రూ.1,650 పెరిగి రూ.97,650 స్థాయికి చేరుకుంది. ఈ ధరలు ప్రస్తుతం ఆల్ -టైం గరిష్ఠ స్థాయికి చేరుకున్నాయి. అమెరికా-చైనా వాణిజ్య సంబంధాల్లో పెరుగుతున్న ఉద్రిక్తతల నేపథ్యంలో అనేక మంది కూడా సురక్షితమైన బంగారం పెట్టు-బడులపైన ఫోకస్ చేస్తున్నారు.

## సుప్రీం తీర్పు ప్రభుత్వానికి చెంపపెట్టు

**హైదరాబాద్:** కంచ గచ్చిబౌలి భూముల విషయంలో సుప్రీంకోర్టు తీర్పును మాజీ మంత్రి, సిద్దిపేట బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు స్వాగతించారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన, చేయబోతున్న పర్యావరణ విధ్వంసం ఎంత భయంకరమైందో సుప్రీం కోర్టులో జరిగిన వాదనల వల్ల ప్రపంచానికి తేటతెల్లమైంది అని హరీశ్‌రావు పేర్కొన్నారు. బాధ్యత గల ప్రభుత్వం, కావాలనే సెలవు దినాల్లో బుల్‌డోజర్లతో విధ్వంసానికి పాల్పడటంపై సుప్రీం కోర్టు చేసిన వ్యాఖ్యలు ఈ ప్రభుత్వానికి చెంపపెట్టు-. విధ్వంసం చేసిన వంద ఎకరాలను ఎలా పునరుద్ధరిస్తారో చెప్పాలని నిలదీయడం ఆహ్వానించదగ్గ పరిణామం. కంచె గచ్చిబౌలి భూములను, పర్యావరణాన్ని కబళించాలని చూసిన కాంగ్రెస్ ప్రభుత్వానికి సెంట్రల్ ఎంపవర్డ్ కమిటీ-తన రిపోర్టుతో కళ్లు తెరిపించింది అని హరీశ్‌రావు తెలిపారు. అధికారం ఉంది కదా అని ఇష్టారీతిగా వ్యవహరిస్తే సభ్య సమాజం, న్యాయ వ్యవస్థ చూస్తూ ఊరుకోవని.. రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని కాపాడటానికి ముందుకు వస్తాయని గతంలోనూ అనేక సార్లు నిరూపనైంది. ఈరోజు కూడా అదే జరిగింది. విధ్వంసమే విధానంగా సాగుతున్నది రేవంత్ రెడ్డి నిరంకుశ పాలన.. నాడు హైడ్రా పేరుతో ఇండ్లు కూల్చి అరాచకం. నేడు బుల్‌డోజర్లతో పర్యావరణ హననం. మాకు న్యాయస్థానాల మీద ఎంతో గౌరవం ఉంది. అందుకే బాధ్యతగా బిఆర్ఎస్ పార్టీ తరుపున సెంట్రల్ ఎంపవర్డ్ కమిటీ-కి నివేదిక ఇచ్చాం. ఆధారాలతో సహా వాస్తవాలు వివరించాం. వృక్షో రక్షతి రక్షిత అని పెద్దలంటే, వృక్షో భక్షతి అన్నట్లు-గా తయారైన రేవంత్ రెడ్డికి బుద్ధి చెప్పేందుకు రాష్ట్ర ప్రజలందరూ ఏకం కావాలి అని హరీశ్‌రావు పిలుపునిచ్చారు.

# చైనా తెగువను చూసి నేర్చుకోవాలి !

అమెరికా ఆశలు గల్లంతవుతున్నాయి. అక్కడికి వెళ్లి ఉద్యోగాలు చేస్తామన్న భరోసా లేకుండా పోయింది. మనం అమెరికాతో ఎంత సన్నిహితంగా ఉన్నా ట్రంప్ మాత్రం మనలను శత్రువులుగానే చూస్తున్నారు. విదేశాల్లో సైతం మాంద్యం ఆవరించింది. ట్రంప్ సుంకాల పుణ్యమా అని అమెరికాతో పాటు ప్రపంచంలో ధరలు పెరుగుతున్నాయి. ద్రవ్యోల్బణం దాడి చేస్తోంది. ట్రంప్‌ను ఎదుర్కోవడంలో చైనా చూపిన తెగువ అభినందనీయం. అలాంటి ధైర్యం మనం చేయలేకపోతున్నాం. చైనా ప్రభుత్వం ఎగుమతుల కోసం కొత్త నియంత్రణ వ్యవస్థ, విధానాలను రూపొందిస్తోందని, కార్ల నుంచి క్షిపణుల దాకా అన్నింటి తయారీకి అవసరమయ్యే అయస్కాంతాల ఎగుమతుల్ని నిలిపేసినట్లు, అనేక చైనా ఓడరేవుల్లో షిప్‌మెంట్స్ ఉన్నట్లు ది న్యూయార్క్ టైమ్స్ నివేదిక తెలిపింది. నివేదికల ప్రకారం, కొత్త నియంత్రణ వ్యవస్థ అమలు లోకి వచ్చిన తర్వాత అమెరికన్ మిలిటరీ కాంట్రాక్టర్లతో సహా అన్ని కంపెనీలకు వస్తువులు చేరకుండా శాశ్వతంగా నిరోధించవచ్చని తెలుస్తోంది. అమెరికా చాలా వరకు చైనా దిగుమతుల పై ఆధారపడింది. దీంతో చైనా ట్రంప్ సుంకాలకు ప్రతీకారం తీర్చుకోవడం ప్రారంభించింది. చైనా ప్రపంచంలోనే రేర్ ఎర్త్ ఎలిమెంట్స్‌లో దాదాపుగా 90 శాతం ఉత్పత్తిని కలిగి ఉంది. ఇది రక్షణ, ఎలక్ట్రిక్ వాహనాలు,ఎనర్జీ అండ్ ఎలక్ట్రానిక్స్ పరిశ్రమల్లో ఉపయోగిస్తారు. రేర్ ఎర్త్ మూలకాల్లో 17ఉన్నాయి. సమారియం, గాడోలినియం, టెర్బియం, డిస్ప్రోసియం, లుటేటియం, స్కాండియం, యట్రియం సంబంధిత వస్తువులతో సహా ఏడు వర్గాల మధ్యస్థ, భారీ అరుదైన ఎర్త్‌లను ఎగుమతి నియంత్రణ జాబితాలో ఉంచారు. ట్రంప్ సుంకాలు విధించానే చైనా బెంబేలెత్తి పోలేదు. ధీటుగా ప్రతీకార సుంకాలు విధించింది. అమెరికాకు అవసరమైన అనేక వస్తువుల ఎగుమతులను నిషేధించింది. దీంతో ఇప్పుడు ట్రంప్ గిలగిల కొట్టుకుంటున్నాడు. అలాంటి ధైర్యం మనం కూడా చేయాలి. కీలెరిగి వాత పెట్టాలి. ట్రంప్ బెదిరింపులకు లొంగకుండా దౌత్యపరంగా హెచ్చరికలు చేయాలి. మనదేశం నుంచి కూడా అనేక రకాల వస్తువులను అమెరికా కొనుగోలు చేస్తోంది. అందులో అత్యంత ముఖ్యమైనవేవో ఉంటాయి. వాటి విషయంలో మనం కూడా చైనా లాగా మంకుపట్టాలి. అప్పుడు ట్రంప్ దిగివస్తాడు. అక్కడి భారతీయులకు కూడా ఇది ముఖ్యం. ఎందుకంటే దేశంలో ఇప్పటికే ఆహార ద్రవ్యోల్బణం తీవ్రంగా ఉంది. అమెరికా సుంకాలు విధిస్తే మన విదేశీ మారక నిల్వలు పడిపోతాయి. ఇప్పటికే దేశీయంగా మన యువత నిరుద్యోగం ఎదుర్కొంటోంది. ఎలాగూ అమెరికాలో ఉద్యోగావకాశాలు తగ్గాయి. యూరప్ దేశాల్లోనూ ఇదే దుస్థితి ఉంది. మనతిండి మనం తింటూ..మన పనులను మనం చేసుకుంటే స్వయం శక్తిని అవలంబించుకోవాలి. అదేపనిగా అమెరికా లాంటి దేశాలపై ఆధారపడకుండా చూసుకోవాలి. దేశంలో ప్రస్తుత పరిస్థితులును చర్చించాలి. ఆర్థికంగా అనేక విషయాలు చర్చించాల్సి ఉంది. ప్రధానంగా పెట్రో, గ్యాస్ ధరలు విపరీతంగా పెరిగాయి. జిఎస్టీ పేరుతో ప్రజల నడ్డి విరుస్తున్నారు. నిరుద్యోగం ఇంతని చెప్పడానికి లేదు. ఉద్యోగాల కల్పన, ఉద్యోగాల భర్తీ, ఉపాధి అవకాశాలు అసలు లేకుండా పోయాయి. యువత సర్టిఫికెట్లు పట్టుకుని విదేశాలకు చెక్కేస్తున్నారు. ఈ దేశంలో బతకలేమని కూలీలు గల్ఫ్ దేశాలకు వెళుతున్నారు. రైతులకు మద్దతు ధరలు ధైర్యం దక్కడం లేదు. బియ్యం ధరలు అమాంతంగా పెరిగాయి. ఉప్పులు,పప్పులు మొదలు నిత్యావసరాల ధరలు విపరీతంగా పెరిగాయి. గృహసంబంధ సిమెంట్, ఇసుక, ఇనుము తదితర వస్తువుల ధరలు విపరీతంగా పెంచేస్తున్నారు. సామాన్యులు ఇల్లు కొనుక్కుని బతికే అవకాశం లేకుండా చేశారు. బ్ఆయంకుల రుణాలు కూడా తీల్చి పిప్పి చేస్తున్నాయి. కేవలం ప్రభుత్వం కట్టించే ఇళ్లపై ఆధారపడేలా చేస్తున్నారు. ఇదంతా కూడా అభివృద్ధికి నమూనా ఎలా అవుతుందన్నది చర్చించాలి. ప్రధాని మోడీ చెబుతున్న వికసిత్ భారత్ కళ్లముందే వెక్కిరిస్తోంది.

# పోలీస్ సిబ్బంది ప్రతి ఒక్కరూ బాధ్యతగా పనిచేయాలి: జిల్లా ఎస్పీ నరసింహ

**పెన్ పహాడ్,ఏప్రిల్ 16,మన సాక్షి:**



పోలీస్ స్టేషన్ల తనిఖీల్లో భాగంగా బుధవారం పెనపహాడ్ పోలీస్ స్టేషన్ ను జిల్లా ఎస్పీ నరసింహ సందర్శించారు. స్టేషన్ రికార్డును, స్టేషన్ పరిసరాలు, వివిధ రకాల నేరాల్లో స్వాధీనం చేసుకోబడిన వాహనాలు, ఫిర్యాదుల నమోదు ప్రాథమిక దర్యాప్తు మొదలగు అంశాలను పరిశీలించారు. సిబ్బంది సమస్యలు అడిగి తెలుసుకుని ఎలాంటి సమస్యలున్నా అధికారులకు తెలపాలని కోరారు. సిబ్బంది ప్రతి ఒక్కరూ బాధ్యతగా పని చేయాలి, డయల్ 100 పిర్యాదులు, పోలీసు స్టేషన్ కు వచ్చే బాధితుల సమస్యలపై త్వరగా స్పందించాలి అని ఆదేశించారు.గ్రామాల్లో అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా పటిష్టంగా పని చేయాలి, గ్రామ పోలీసు అధికారి వ్యవస్థను ప్రణాళికతో అమలు చేయాలని అన్నారు.గ్రామ పోలీసు అధికారులు గ్రామాల్లో ఎలాంటి సమస్యలు వచ్చినా ముందుగా సమాచారం వచ్చేలా సమాచార వనరులు వృద్ధి చేసుకోవాలి అన్నారు.

ప్రతిరోజు గ్రామాలను సందర్శిస్తూ ప్రజలకు సన్నితంగా ఉంటూ పోలీస్ సేవలను అందించాలని ఆదేశించారు. మండల పరిధిలో ఇసుక అక్రమ రవాణాను పటిష్టంగా నిరోధించాలని ఇసుక అక్రమ రవాణా చేస్తే చట్టపరమైన కేసులు నమోదు చేసి రవాణా చేసే వారిని బైండోవర్ చేయడం, వాహనాలు సీజ్ చేయడం లాంటి చర్యలు తీసుకోవాలని తెలిపారు. గంజాయి రవాణా చేసిన కేసుల్లో ఉన్న నిందితులపై ఎప్పటికప్పుడు నిఘా ఉంచి వారి కదలికలను నమోదు చేయాలని ఆదేశించారు. జిల్లా పోలీస్ శాఖ ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న పోలీస్ ప్రజా భరోసా కార్యక్రమాల ద్వారా ప్రజల్లో చైతన్యం తేవాలని సామాజిక అంశాల గురించి వివరించాలని, నేరాలకు పాల్పడితే చట్ట పరిధిలో శిక్షలు అనుభవించాల్సి వస్తుందని తెలియజేయాలి అన్నారు. సమస్యలు సృష్టించే వారిని గుర్తించి వారిలో మార్పు వచ్చేలా చూడాలన్నారు. దొంగతనాలు లాంటివి జరగకుండా ప్రజల్లో భద్రత పరమైన చైతన్యం తేవాలి అన్నారు, కొత్త వ్యక్తులు, అనుమానస్పద వ్యక్తులు గ్రామాల్లోకి వస్తే ఆశ్రయం ఇవ్వవద్దు, పోలీసు వారికి సమాచారం అందించాలని ప్రజలను కోరారు.సీసీ కెమెరాల ఏర్పాటుకు గ్రామాల్లో ప్రజలు ముందుకురావాలని కోరారు.వారి వెంట సూర్యాపేట రూరల్ సీఐ రాజశేఖర్, ఎస్ఐ కస్తాల గోపికృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

# సన్న బియ్యంతో పాటు నిత్యవసర వస్తువులను ఇవ్వాలి



**సూర్యాపేట,ఏప్రిల్ 16,మన సాక్షి:**

రేషన్ షాపుల్లో సన్న బియ్యంతో పాటు ప్రజలకు అవసరమయ్యే 12 రకాల నిత్యవసర వస్తువులను ఇవ్వాలని కోరుతూ ప్రగతిశీల మహిళా సంఘం పిడిఎస్యు ఆధ్వర్యంలో సివిల్ సప్లైఆఫీసర్ కు వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా ప్రగతిశీల మహిళా సంఘం జిల్లా కార్యదర్శి కొత్తపల్లి రేణుక,పిడిఎస్యు రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎర్ర అఖిల్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం రేషన్ షాపుల్లో ప్రజలకు సన్న బియ్యం ఇవ్వడం హర్షించదగిన విషయమని, దీనిని ప్రతి ఒక్కరూ హర్షించాల్సిందే అన్నారు. అదేవిధంగా నిత్యవసరాల ధరలు రోజురోజుకు పెరుగుతూ పేద ప్రజలు కొనలేని పరిస్థితిలో ఉన్నందున 2014 ముందు కాంగ్రెస్ ప్రభుత్వం రేషన్ షాపుల్లో ఉప్పు, పప్పు, చింతపండు, కిరోసిన్, మంచి నూనె ,తదితర 12 రకాల వస్తువులను ఇచ్చేవాళ్లు అదేవిధంగా ఇప్పుడు కూడా 12 రకాల వస్తువులను ఇచ్చి పేద ప్రజలకు ప్రభుత్వం అండగా నిలబడాలని కోరారు. ఈ కార్యక్రమంలో పిఓడబ్ల్యూ జిల్లా అధ్యక్షుడు మారసాని చంద్రకళ, జిల్లా నాయకులు పట్టా కల్పన, ఐతరాజు పద్మ, పజ్యూరి రేణుక, పిఓఎల్ నాయకుడు కట్ట రమేష్, రేహమతి పాల్గొన్నారు.

# నారాయణగూడ సంఘ బంధం అధ్యక్షురాలుగా జయమ్మ



**పెన్ పహాడ్,ఏప్రిల్ 16,మన సాక్షి:**

మండల పరిధిలోని నారాయణ గూడెం ఉమ్మడి గ్రామపంచాయతీ పరిధిలో ఉన్న నాగులపహాడ్ మర్రిగూడెం గ్రామాలలో ఉన్న సంఘాల సభ్యులు నారాయణ గూడెం సంఘాల మొదటి లీడర్ల నుండి ఏకగ్రీవంగా సంఘ బంధాల అధ్యక్షురాలుగా ఏకగ్రీవంగా నూతన కమిటీని బుధవారం ఎన్నుకోవడం జరిగింది అధ్యక్షురాలుగా కట్టూజు జయమ్మ మరియు కమిటీ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షులుగా నారాయణ పుల్లమ్మ, కార్యదర్శిగా శంకరమద్ది సుకన్య, కోశాధికారిగా మామిడి మంజుల, సంయుక్త కార్యదర్శిగా దాసరి అశ్విని, ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. ఈ కార్యక్రమంలో క్లస్టర్ సిసి శైలజ, ఇన్చార్జి సిసి ఆశ, వివోఏ కుర్రి ప్రమీల, వివిధ గ్రామాల సంగాల మొదటి అధ్యక్షురాలు సంఘాల సభ్యులు తదితరులు పాల్గొన్నారు..

# న్యాయవాది కిషోర్ పై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలి

**సూర్యాపేట,ఏప్రిల్ 16,మన సాక్షి:**



సూర్యాపేటకు చెందిన న్యాయవాది మంతాపురం కిషోర్ పై దాడిచేసిన ఉగ్గం బుచ్చిరాములు,ఆయన కుమారుడిని చట్టప్రకారం శిక్షించాలని బార్ అసోషియేషన్ మాజి అధ్యక్షుడు నూకల సుదర్శన్ రెడ్డి , న్యాయవాదులు వసంత సత్యనారాయణ పిళ్లై, బాణాల విజయ్ కుమార్ లు అన్నారు. స్థానిక ఏరియా ఆసుపత్రి వద్ద వారు మీడియాతో మాట్లాడుతూ అడ్వకేట్ కిషోర్ తనకు చెందిన భూమి పిల్లలమర్రి శివారు గాంధినగర్ వద్ద సర్వే నంబర్ 409,410 లో వున్న భూమి వద్దకు సర్వేయర్ వచ్చాడన్న విషయం తెలుసుకుని, బుధవారం నాడు భూమిదగ్గరకు వెళ్లి తనకు ముందస్తుగా నోటీసు ఇవ్వకుండా ఎలా సర్వే చేస్తారని ఎమ్మార్వోకు మరియు పోలీసులకు తెలియజేశారని అన్నారు. ఈ సందర్భంగా నోటీసు ఇచ్చిన తరువాతనే సర్వే చేస్తామని ఎమ్మార్వో పోలి వెళ్లిపోయారని, తరువాత బుచ్చిరాములు మరియు కొందరు వ్యక్తులు కలిసి అడ్వకేట్ కిషోర్ పై దాడులు చేసి గాయపరిచారని వారు అన్నారు. తనతో పాటు 40 మంది పేదలకు చెందిన భూములను పరిరక్షణ కోసం అడ్వకేట్ కిషోర్ భూమి దగ్గరకు వెళితే భౌతిక దాడులకు పాల్పడడం దుర్మార్గపు చర్యగా వారు తెలిపారు. ప్రజాస్వామ్య వ్యవస్థ లో చట్టప్రకారం న్యాయస్థానం ద్వారా భూ వివాదాలు పరిష్కరించుకోవాలని, దానికి బదులుగా దాడులకు పాల్పడే వారిపై పోలీసులు కేసులు నమోదు చేసి చట్టపరమైన చర్యలు చేపట్టాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అడ్వకేట్ లు మాంద్ర మల్లయ్య, వీరేష్ నాయక్, అబ్దుల్ లతీఫ్, కంచర్ల సతీష్, రాచకొండ యాదగిరి, సందీప్, రాధాకృష్ణ, చంద్రకాంత్ తదితరులు పాల్గొన్నారు.

# వేసవిలో ప్రజలు జాగ్రత్తగా ఉండాలి



**అర్వపల్లి,ఏప్రిల్ 16,మన సాక్షి:**

ప్రస్తుతం వేసవి ఎండలు తీవ్రంగా ఉన్నాయని వాటి నుండి ప్రజలు జాగ్రత్తలు తీసుకొని వడదెబ్బ తగలకుండా చూసుకోవాలని సూర్యాపేట జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ కోట చలం అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మితంగా తనిఖీ చేసి రికార్డులను పరిశీలించిన అనంతరం మాట్లాడారు. ఆరోగ్య సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండాలని అన్నారు. ప్రభుత్వాసుపత్రిలో సహజ కానుపులు జరిగితే వారికి ప్రభుత్వం నుండి అందే ప్రోత్సాహాల గురించి స్థానిక ఆశా కార్యకర్తలు, ఏఎన్ఎం లో చెప్పాలని అన్నారు. ఆరోగ్య శాఖలో పనిచేసే సిబ్బంది సమయపాలన పాటించాలని ఎవరైనా విధులకు రాకపోతే కఠిన చర్యలు తీసుకుంటామని అన్నారు.ఈ కార్యక్రమంలో డాక్టర్ భూక్య నగేష్ నాయక్ , సి హెచ్ ఓ మాలోత్ బిచ్చు నాయక్, సూపర్వైజర్ అనిత, నర్సింగ్ ఆఫీసర్ సునీత, స్థానిక ఏఎన్ఎం జ్యోతి, ల్యాబ్ టెక్నీషియన్ చుక్కయ్య, కుంభం వీరయ్య, ఆశా కార్యకర్తలు, అరుణ, స్వరూప, నీరజ కలమ్మ, శైలజ, పాల్గొన్నారు.

# నూతన డిఎస్పిని కలిసిన ఎస్.రెడ్డి సాహెబ్

**రామసముద్రం,ఏప్రిల్ 16,మన సాక్షి:**



అన్నమయ్య జిల్లా మదనపల్లి కాంగ్రెస్ పార్టీ నాయకులు రెడ్డి సాహెబ్ బుధవారం డిఎస్పీ మహేంద్రను పుష్ప గుచ్ఛం ఇచ్చి మర్యాద పూర్వకంగా కలిశారు. శాంతి భద్రతల పరిరక్షణలో మీ మీ ముద్ర ఉండాలని అసాంఘిక కార్యకలాపాలపై ఉక్కుపాదం మోపాలని,శాంతి భద్రతలపట్ల కఠినంగా వ్యవహరించి మదనపల్లెలో మీ ముద్ర వుండాలన్నారు. మదనపల్లె నూతన డీయస్పీ ఎస్. మహేంద్ర తో కలసిన సందర్భంగా మదనపల్లె నియోజకవర్గ నాయకులు ఎస్.రెడ్డి సాహెబ్ ఆకాంక్షించారు.మదనపల్లి నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు ఎస్.రెడ్డి సాహెబ్ మాట్లాడుతూ అసాంఘిక కార్యకలాపాలపై ఉక్కు పాదం మోపడమే కాకుండా శాంతి భద్రతలే ప్రధాన లక్ష్యంగా ముందుకెళ్ళాలని ఆకాంక్షించారు.

# ఉద్యోగ విరమణ సహజం

**కంగ్టి, ఏప్రిల్ 16, మన సాక్షి :**



ప్రభుత్వ ఉద్యోగులకు ఉద్యోగ విరమణ సహజమని, వృత్తిలో ఉన్నప్పుడు చేసిన సేవలే చిరకాలం గుర్తుండిపోతాయని మాజీ ఎమ్మెల్యే లు మహా రెడ్డి విజయ్ పాల్ రెడ్డి ,మహా రెడ్డి భూపాల్ రెడ్డి, డిసిసి ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్ రెడ్డి అన్నారు.సంగారెడ్డి జిల్లా కంగ్టి మండల దామరగిద్ద యుపిఎస్ ప్రభుత్వ పాఠశాలలో సోషల్ ఉపాధ్యాయులుగా నారాయణ విధులు నిర్వహించి పదవి విరమణ కార్యక్రమం పిట్లంలో బుధవారం సాయి గార్డెన్ ఫంక్షన్ హాల్లో జరిగింది. ఈ కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యేలు మహా రెడ్డి విజయ్ పాల్ రెడ్డి , మహా రెడ్డి భూపాల్ రెడ్డి,డిసిసి ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్ రెడ్డి హాజరై శాలువా కప్పి సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ .. ఉపాధ్యాయ వృత్తిలో ఆయన ఉత్తమ సేవలు అందించాలని కొనియాడారు.ఈ కార్యక్రమంలో పిఆర్టియు రాష్ట్ర అధ్యక్షులు గుండు లక్ష్మణ్, కంగ్టి ఎంఈవో రహీమొద్దీన్,మాజీ జడ్పీటీసీ నరసింహారెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు రామ్ సింగ్, మాజీ జడ్పిటిసి గుండు మోహన్, మాజీ ఎంపీటీసీ శ్రీనివాస్ గౌడ్, పిఆర్టియు రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు కిఫాయత్ అలీ, ఉపాధ్యాయులు సంగ్ శెట్టి తదితరులు ఉన్నారు.

# కప్పల విజయ అకాల మరణం తీరని లోటు

**శాలిగౌరారం,ఏప్రిల్ 16,మన సాక్షి:**



వ్యవస్థ మార్పు కోసం జరిగే అనేక పోరాటాలలో కప్పల విజయ పాల్గొని దోపిడీ, పీడన , అసమానతలు లేని నూతన ప్రజాస్వామిక విప్లవం కోసం అహర్నిశలు కృషి చేసిందని సిపిఐ (ఎం-ఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్ర నాయకులు ఎం డేవిడ్ కుమార్ కొనియాడారు.సిపిఐ (ఎం-ఎల్) న్యూ డెమోక్రసీ ఊట్కూరు గ్రామ కమిటీ సభ్యులు, ప్రగతిశీల మహిళా సంఘం (పి.ఓ.డబ్ల్యూ) జిల్లా నాయకురాలు కప్పల విజయ సంతాప సభ గ్రామ సీనియర్ నాయకుడు వేముల శంకర్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా డేవిడ్ కుమార్ పాల్గొని మాట్లాడుతూ కామ్రేడ్ . కామ్రేడ్ యానాల మల్లారెడ్డి అందించిన స్ఫూర్తితో ప్రేరణ పొంది చిన్ననాటి నుండే విప్లవ కమ్యూనిస్టు రాజకీయాలకు ఆకర్షితురాలై ఈ వ్యవస్థ మార్పు కోసం ఆయుధం పట్టుకొని అడవి ఉద్యమంలో పాల్గొన్నదని తెలిపారు. ఊటుకూరు గ్రామంలో జరిగే పోరాటాలలో అలుపెరగని శ్రమ చేసిందని అన్నారు.ఈ కార్యక్రమంలో సిపిఐ (ఎం-ఎల్) న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి ఇందూరు సాగర్, అరుణోదయ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఉదయగిరి, ఏఐకేఎంఎస్ జిల్లా కార్యదర్శి అంబటి చిరంజీవి, పిఓడబ్ల్యూ జిల్లా కార్యదర్శి పజ్జూరు ఉపేంద్ర, పి వై ఎల్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మామిడోజు వెంకటేశ్వర్లు, బివి చారి, ఏఐకేఎంఎస్ జిల్లా నాయకులు గజ్జి రవి, పుట్ట సత్తయ్య, సిపిఐ (ఎం-ఎల్) న్యూ డెమోక్రసీ నాయకులు బండారు వెంకన్న, బొంగరాల నరసింహ, యానాల సత్తిరెడ్డి, ఏనుగు సత్తిరెడ్డి, రావుల తారమ్మ, సామ నర్సిరెడ్డి, సిలువేరు జానయ్య, కుంభం వెంకటేశం, అంబటి వెంకటేశం, కల్లూరు అయోధ్య, విజయ కుమారుడు ఇటికాల వెంకటేష్, అరుణోదయ నాయకులు పిట్టల అనిల్ తదితరులు పాల్గొన్నారు.

# మరణించిన హమాలీ కుటుంబానికి ఆర్థిక సహాయం

**సూర్యాపేట,ఏప్రిల్ 16,మన సాక్షి:**



శాలిగౌరారం గ్రామంలో పేద కుటుంబానికి చెందిన హమాలీ గుడిపాటి సైదులు అనారోగ్యంతో మరణించాడు. బుధవారం శాలిగౌరారం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో సైదులు కుటుంబానికి 8 వేల రూపాయలు ఆర్థిక సాయం అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమం లో లయన్స్ క్లబ్ చార్టర్ ప్రసిడెంట్ బుడిగే శ్రీనివాసులు, క్లబ్ అధ్యక్షులు డెంకల సత్యనారాయణ, వైస్ ప్రసిడెంట్ సీఎం రెడ్డి, కోశాధికారి వడ్లకొండ బిక్షం, క్లబ్ ప్రతినిధులు ఆకవరం అశోకా చారి, గుండ్ల రామ్మూర్తి, బొడ్డు నగేష్, జోగు శ్రీనివాసులు, నిమ్మల వీరస్వామి, బట్ట చిన సైదులు,తదితరులు పాల్గొన్నారు.

# ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం



**అర్వపల్లి,ఏప్రిల్ 16,మన సాక్షి:**

రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న కొనుగోలు కేంద్రాలలో రైతులు ధాన్యాన్ని విక్రయించినట్లయితే ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర వస్తుందని తిరుమలగిరి మార్కెట్ కమిటీ చైర్మన్ ఎల్సోజు చామంతి నరేష్, అన్నారు.మండల పరిధిలోని కాసర్లపహాడ్ లో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించి మాట్లాడారు.రైతులు పండించిన ధాన్యాన్ని తే మశాతం లేకుండా, చెత్తాచెదారం తాలు, లేకుండా చూసుకోవాలని అన్నారు.రైతులు కొనుగోలు కేంద్రాలను సద్వినియోగపరచుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా నాయకుడు గుడిపల్లి మధుకర్ రెడ్డి, ఏవో గణేష్, సిసి నాగేష్, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు జలంధర్, సైదులు,బొల్లం లింగరాజు, బద్దం యాదగిరి, బొల్లం శ్రీశైలం, నూర్జహాన్, అజీమా, మౌనిక భవాని స్వాతి, విజయ సరిత, నల్లగుంట్ల శ్రీనివాస్, రవి రాజేష్, పాల్గొన్నారు.

# మాచారం దేవాలయంలో చోరీ

**పెన్ పహాడ్,ఏప్రిల్ 16,మన సాక్షి:**



మండల పరిధిలోని మాచారం రాములవారి దేవాలయంలో చోరీ జరిగిన సంఘటన వెలుగులోకి వచ్చింది.ఎస్ఐ కస్తాల గోపికృష్ణ తెలిపిన వివరాల ప్రకారం మాచారం గ్రామ శివారులోని శ్రీ రామాలయం గుడిలో ఎప్పటిలాగే రాత్రి 7:30 గంటల సమయంలో అక్కెనపల్లి వెంకన్న గుడికి తలుపులు వేసి ఇంటికి వెళ్ళగా మరుసటి రోజు బుధవారం ఉదయం సుమారు 6 గంటలకు వెంకన్న గుడి తలుపులు తీసి చూడగా ఎవరు గుర్తు తెలియని దొంగలు గుడి తలుపు లకు ఉన్న బేడ%శీ% పగు లగొట్టి గుడిలోకి ప్రవేశించి అమ్మవారి మెడలో ఉన్న ఎనిమిది గ్రాముల పూస్తే మరియు 35 గ్రాముల సిల్వర్ వస్తువు అయినా శతగోపం లను దొంగలించుకపోయినారు అని అట్టి గుడి చైర్మన్ అయినా బులక రామచంద్రయ్య అలియాస్ బొబ్బయ ఫిర్యాదు చేయడంతో దరఖాస్తు ఇవ్వగా ఎస్సై గోపికృష్ణ కేసు నమోదు చేసి పరిశోధన చేయనైనది చైర్మన్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

# మున్సిపల్,పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

**నారాయణపేట టౌన్, ఏప్రిల్ 16, మన సాక్షి:**



మున్సిపల్, గ్రామపంచాయతీ కార్మికుల సమస్యలను పరిష్కరించడంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని యూనియన్ రాష్ట్ర కార్యదర్శి పాలడుగు సుధాకర్ విమర్శించారు.బుధవారం మున్సిపల్ గ్రామ పంచాయతీ కార్మికుల యూనియన్ ఆధ్వర్యంలో సిఐటియు జిల్లా కార్యదర్శి బలరాం అధ్యక్షతన నారాయణపేట జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ భవనంలో జరిగిన జిల్లా సదస్సు ఇట్టి సదస్సుకు యూనియన్ రాష్ట్ర కార్యదర్శి పాలడుగు సుధాకర్ ముఖ్య వక్తగా హాజరై ప్రసంగించారు.తమ ఆరోగ్యాలను పణంగా పెట్టి ప్రజల ఆరోగ్యాలను కాపాడుతున్న మున్సిపల్ ,గ్రామపంచాయతీ కార్మికులకు కనీస వేతనం అమలు చేయడంలో ప్రభుత్వాలకు మనసు రావాట్లేదని విమర్శించారు. మున్సిపల్ కార్మికులకు కనీస వేతనం 26 వేల రూపాయలు నిర్ణయించి అమలు చేయాలని గ్రామపంచాయతీ కార్మికులకు కనీస వేతనం 18 వేల రూపాయలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. పెండింగ్ లో ఉన్నా 4 నేలల వేతనాలు వెంటనే ఇవ్వాలి గ్రామపంచాయతీ కార్మికులకు మల్టీపర్పస్ విధానాన్ని రద్దుచేసి కారోబార్ బిల్ కలెక్టర్ లకు జూనియర్ పంచాయతీ కార్యదర్శి హోదా ఇవ్వాలని నెల నెల రెగ్యులర్గా వేతనాలు ఇవ్వాలని కార్మికులకు గ్రీన్ ఛానల్ ద్వారా రాష్ట్ర ప్రభుత్వం వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు.కాంట్రాక్ట్, అవుట్సోర్సింగ్ ఉద్యోగ కార్మికులను పర్మినెంట్ చేయాలన్నారు.స్వాతంత్రానికి పూర్వం నుండి పోరాడు సాధించుకున్న కార్మిక చట్టాలన్నిటిని దేశ ప్రధాని నరేంద్ర మోడీ యజమానులకు అనుకూలంగా మారుస్తూ నాలుగు లేబర్ కోడ్ లను తీసుకొస్తున్నారని దాన్ని కార్మిక వర్గం ఐక్యంగా అడ్డుకోవాలని పిలుపునిచ్చారు.

# సురేష్ హత్య కేసులో నలుగురు నిందితుల అరెస్ట్

## కేసు వివరాలను వెల్లడించిన జిల్లా ఎస్పీ

**నల్లగొండ,ఏప్రిల్ 16, మన సాక్షి:**



నల్లగొండ జిల్లా కేంద్రంలో రామగిరి గీతాంజలి అపార్ట్మెంట్ గీతాంజలి కలర్ ల్యాబ్ లో జరిగిన ఓ దారుణమైన సురేష్ హత్య కేసు నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. బుధవారం జిల్లా ఎస్పీ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించి జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవర్ వివరాలను వెల్లడించారు.ఎస్పీ తెలిపిన వివరాల ప్రకారం సురేష్ హత్య కేసులో నలుగురు నిందితులు అరెస్టు చేశామని పేర్కొన్నారు. హత్యకు వాడిన వాహనాలను స్వాధీనం చేసుకున్నామని తెలిపారు.

రిటైర్డ్ ఎక్సైజ్ సీఐ మాత్ర వెంకటయ్య తన కూతురు సంసారం నాశనం కావడానికి కారణం తన అల్లుడు యొక్క అన్న అయినా గద్దపాటి సురేష్ అనే వ్యక్తి కారణమని అభిప్రాయం ఏర్పరచుకున్న మృతుని యొక్క తమ్ముని మామ,తమ్ముని భార్య, గద్దపాటి ఉమామహేశ్వరి మృతుడిని హత్య చేయించేందుకు గతంలో నేవీలో పనిచేసే రిటైర్డ్ అయిన స్కాట్ డిటెక్ట్ డిటెక్టివ్ ఏజెన్సీకి చెందిన చిక్కు కిరణ్ కుమార్,సి కె కుమార్ అనే వ్యక్తికి అతని తమ్ముడు ముషం జగదీష్ను సుపారీ ఇచ్చి హత్య చేయించారని వివరించారు.

అద్దెకు కావలసిన వస్తువులు కిరణ్ కుమార్ హైదరాబాద్ లో తీసుకొని నల్లగొండకు వచ్చి జగదీష్ తో కలిసి పట్టణంలోని మణికంఠ లేజర్ కలర్ ల్యాబ్ వద్దకు చేరుకొని ముందుగా వేసుకున్న పథకం ప్రకారం గద్దపాటి సురేష్ షాప్ వెనక అప్పటికే పెట్టి ఉంచిన ద్విచక్ర వాహనము తీసుకొని మృతుని షాపు వద్దకు వచ్చి తమకు ఫోటోలు ప్రింట్ కావాలని అడగగా అతడు రాత్రి అయినది రేపు ఉదయం రమ్మని అనగా అర్జెంటుగా కావాలని మాటల్లో పెట్టి మృతుడి పనిలో నిమగ్నమై ఉన్నాడు అదే అదునుగా భావించి అతనిపై కత్తులతో దాడి చేసి గొంతు కోసి వీపు భాగంలో కడుపులో విచక్షరహితంగా పొడిచి దారుణంగా హత్య చేశారని పేర్కొన్నారు. హత్యకు అనంతరం వారు బైకుపై చెరువుగట్టుకు వెళ్లి రక్తం అంటిన బట్టలు కత్తులు కారులు పెట్టుకొని మూసి వాగు సమీపంలో చెట్ల పొదలలో విసిరి వేసి హైదరాబాద్ కు పారిపోయారని వివరించారు. నేరస్తుల వద్ద మూడు వస్తువులను స్వాధీనం చేసుకున్నామన్నారు. మారుతి జెన్ కార్ ఒకటి, ద్విచక్ర వాహనాలు రెండు,సెల్ ఫోన్లు 6 వారి వద్ద నుండి స్వాధీనం చేసుకున్నామని పేర్కొన్నారు. ఈ కేసును డి.ఎస్.పి శివరాం రెడ్డి ఆధ్వర్యంలో చాకచక్యంగా వ్యవహరించిన పోలీసులను ఎస్పీ అభినందించారు. ఈ కేసులో డిఎస్పి శివరాం రెడ్డి,నల్గొండ టు టౌన్ సిఐ రాఘవరావు, శాలిగౌరవరం సిఐ కొండల్ రెడ్డి, నలగొండ వన్ టౌన్ సిఐ రాజశేఖర్ రెడ్డి, ఎస్సైలు సైదులు, సైదా బాబు విష్ణుమూర్తి,సాయి ప్రశాంత్ సిబ్బంది పాల్గొన్నారు.

# మహిళ పై యాసిడ్ తో దాడి కేసులో నిందితుడికి 20 ఏళ్ల జైలు

## జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్

**నల్లగొండ,ఏప్రిల్ 16,మన సాక్షి:**

నాంపల్లి మండలం దామెర గ్రామానికి చెందిన బచ్చనబోయిన పిట్టల మహేష్ తండ్రి పెద్దయ్య అదే గ్రామానికి చెందిన మహిళను వేధించి యాసిడ్ తో చంపేందుకు యత్నించగా బాధితురాలు నిందితుడు పిట్టల మహేష్ పైన నాంపల్లి పోలీస్ స్టేషన్లో ఇచ్చిన పిర్యాదు మేరకు కేసు నమోదు చేసి ఛార్జ్ షీట్ కోర్టులో దాఖలు చేయగా బుధవారం నల్గొండ జిల్లా ఎస్సీ ఎస్టీ కోర్టులో నేరం రుజువు కావడంతో నిందితుడికి సెక్షన్ 307 ఐపిసి (హత్యాయత్నం)కింద నేరానికి పదేళ్ల జైలు శిక్ష రూ.1000/- జరిమానా, సెక్షన్ 326-ఆ ఐపీసీ (యాసిడ్ దాడి)కింద పదేళ్ల జైలు శిక్ష రూ.1000 జరిమానా రెండూ ఏకకాలంలో 20 సంవత్సరాల జైలు శిక్ష,మొత్తం జరిమానా మొత్తం 2000 విధించడం జరిగిందని జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ ఒక ప్రకటనలో తెలిపారు..ఈ కేసులో సరైన ఆధారాలను సేకరించి కోర్టులో ఛార్జ్ షీట్ దాఖలు సమర్పించి నిందితునికి శిక్ష పడే విధంగా కృషి చేసిన అప్పటి విచారణ అధికారులు మహేశ్వర్, డిఎస్పీ దేవరకొండ, డి.విజయ్ కుమార్, ఏస్ ఐ ఆఫ్ పోలీస్, నాంపల్లి , ప్రస్తుతఏఎస్పీ పి.మౌనిక, ఐపీఎస్ దేవరకొండ, సీఐ డి.రాజు, సర్కిల్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్, నాంపల్లి సర్కిల్, ఏస్ఐఓఎం.శోభన్ బాబు, సబ్-ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్, ఏప పి.అఖిల,సీడీ ఓ బి.సైదులు, లైజన్ అధికారులు పి.నరేందర్, ఎన్.మల్లికార్జున్ జిల్లా ఎస్పీ అభినందించారు.

# పాడి రైతుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం



**రామసముద్రం,ఏప్రిల్ 16,మన సాక్షి:**

అన్నమయ్య జిల్లా అభివృద్ధి, సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం రాజంపేట టిడిపి పార్లమెంట్ అధ్యక్షులు చమర్తి జగన్మోహన్ రాజు అన్నారు.జగన్మోహన్ రాజుకి భారీ ఘన స్వాగతం పలికిన మేక వారి పల్లి గ్రామస్తులు తెలుగు తమ్ముళ్లు,టిడిపి మండల అధ్యక్షుడు గన్నేసుబ్బ నరసయ్య నాయుడు ఆహ్వానం మేరకు హాజరైన చమర్తి చంద్రబాబు నాయుడు సారధ్యంలో నిర్మించిన మేక వారి పల్లెకు చెందిన మేక పద్మావతమ్మ కు చెందిన గోశాలను తెలుగు తమ్ముళ్లతో కలిసి రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. చమర్తి మాట్లాడుతూ రాజంపేటకు మంచి రోజులు వచ్చాయని, ప్రతి టిడిపి నాయకుడు కార్యకర్త కలసికట్టుగా పనిచేసి రాజంపేటలో టిడిపి గౌరవం నిలబెడదామని, ప్రతిపక్షాలను మట్టి కనిపించి రాజంపేటలో టిడిపి జెండా ఎగరాలంటే అభివృద్ధి , సంక్షేమం ప్రతి గ్రామంలో నెలకొల్పాలని రాజంపేట పార్లమెంట్ టిడిపి అధ్యక్షులు చమర్తి జగన్ మోహన్ రాజు తెలియజేశారు.బుధవారం రాజంపేట మండల పరిధిలోని మేక వారి పల్లి గ్రామంలో నూతనంగా నిర్మించిన గోకులం షెడ్డును ప్రారంభించారు. ఈ సందర్భంగా గోమాతలకు ప్రత్యేక పూజలు చేసారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాజంపేట నియోజకవర్గంలో బలమైన కార్యకర్తల బలం ఉన్న పార్టీ టిడిపి అని,టిడిపి బలం కు తోడు అభివృద్ధి, సంక్షేమం తోడవుతే భవిష్యత్తులో టీడీపీ కి తిరుగు లేదని,కావున ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో కలసి కట్టుగా పని చేసి రాజంపేటలో టిడిపి జెండా ఎగరవేద్దాం అని,నాయకులకు , కార్యకర్తలకు అన్ని విధాల అండగా ఉంటామని ఆయన తెలియజేశారు.ఈ కార్యక్రమంలో టిడిపి ముఖ్య నాయకులు, సర్పంచులు, కార్యకర్తలు, యువకులు, మహిళలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

# పౌష్టికహారంతోనే ఎదుగుదల




**శాలిగౌరారం,ఏప్రిల్ 16,మన సాక్షి:**

పిల్లలు,బాలింతలు,గర్భిణీలు పౌష్టికహారం తీసుకున్నపుడే ఆరోగ్యంగా ఉంటారని శాలి గౌరారం ఐసీడిఎస్ మండల సూపర్వైజర్ ఎం.జ్యోతి అన్నారు.శాలిగౌరారం మండలం వంగమర్తిలోని అంగన్వాడీ కేంద్రంలో పోషణ్ పక్వాడ్ కార్యక్రమం జరిగింది. ఈజ్యోతి మాట్లాడుతు ముఖ్యంగా పిల్లలు తరచూ బరువు, ఆరోగ్య పరీక్షలు చేసుకోవాలని కోరారు. పిల్లల, తల్లుల పోషణ, ఆరోగ్యం పై అవగాహనా కలిపించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ కేంద్రం టీచర్ పి. అమృతమ్మ ఆయాలు తదితరులు పాల్గొన్నారు.

# గర్భిణీ స్త్రీలు బాలింతలు పౌష్టికాహారం తీసుకోవాలి

**అడవిదేవులపల్లి,ఏప్రిల్ 16,మన సాక్షి:**



గర్భిణీ స్త్రీలు బాలింతలు పౌష్టికాహారం తీసుకోవాలని అంగన్వాడి సూపర్వైజర్ నాగరాణి అన్నారు. దామరచర్ల ప్రాజెక్టు పరిధిలోగల అడవిదేవులపల్లి మండలం బాలెంపల్లి గ్రామంలోని అంగన్వాడి కేంద్రంలో పోషణ పక్షం కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా సూపర్వైజర్ నాగరాణి మాట్లాడుతూ గర్భిణి, బాలింతలకు, తీసుకోవలసిన పోషకాహారం ఆరోగ్యం ఎస్ ఎస్ ఎఫ్ పి 1000 రోజుల ప్రాముఖ్యత గురించి వారికి వివరించడం జరిగింది.ప్రతినెల 0-5 సం.ల పిల్లలకు బరువులు క్రమం తప్పకుండా తీయించాలని వివరించారు.ఈ కార్యక్రమంలో గ్రామ సెక్రటరీ ప్రవీణ్,స్కూల్ టీచర్స్,అంగన్వాడీ టిచర్లు నాగలక్ష్మి,అన్నపూర్ణ ఆయాలు తదితరులు పాల్గొన్నారు.

# ఉపాధి హామీ సిబ్బందితో సమీక్షా సమావేశం



**రామసముద్రం, ఏప్రిల్ 16,మన సాక్షి:**

అన్నమయ్య జిల్లా మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఎంపీడీవో భాను ప్రసాద్ ఉపాధి హామీ సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సమీక్ష సమావేశంలో ఉపాధి కూలీలతో ప్రత్యేకంగా ఫారం పాండ్స్, మీద పశువుల నీటి తొట్లు, మీద అలాగే లేబర్ మొబిలైజేషన్ మీద దృష్టి పెట్టమని, ఫీల్డ్ అసిస్టెంట్లులకు అలాగే ఈసీకి తెలియజేయడం జరిగింది. ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాల మేరకు టార్గెట్ల మేరకు పని చేయవలసిందిగా అందరికీ సూచించడం జరిగింది.మరియు ఏపీవో కు ప్రభుత్వము నిర్దేశించిన లక్ష్యాల మేరకు పని చేయాలని తెలిపారు.

# ప్రారంభమైన నవమ వార్షిక బ్రహ్మోత్సవాలు

**మేడ్చల్ జిల్లా,ఏప్రిల్ 16, మన సాక్షి:**



అంగరంగ వైభవంగా ప్రారంభమైన నవమ వార్షిక బ్రహ్మోత్సవాలు. అఖిలాండకోటి బ్రహ్మాండ నాయక మరకత శ్రీ లక్ష్మీ గణపతి నవమ వార్షిక బ్రహ్మోత్సవాలు నేటి బుధవారంతో ప్రారంభమయ్యాయి. ప్రపంచంలోనే అరుదైన మరకతం తో మలచిన కానాజిగూడలో శ్రీ లక్ష్మి గణపతి దేవస్థానం నవమ వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా స్వామివారికి పెందల కడనే సుప్రభాత సేవ, విశేష అభిషేకం, కలశ స్థాపన, యాగశాల ప్రవేశము, పుణ్యాహవాచనం, అంకురార్పర, అగ్ని ప్రతిష్టాపన వంటి కార్యక్రమాలు ఆలయ వ్యవస్థాపకులు, కార్యనిర్వహకులు, డాక్టర్ మోత్కూరి సత్యనారాయణ శాస్త్రి చేపట్టారు. దేవాలయంలో లక్ష్మీ గణపతి, కుబేర, నరసింహ, భూ సూక్త హెూమాలు నిర్వహించారు. బ్రహ్మోత్సవ హెూమాలలో పాల్గొనే భక్తులచే కుంకుమార్చనలు చేయించారు. తదనంతరం అన్న ప్రసాద వితరణ గా వించారు.ఈ కార్యక్రమాలలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారి తీర్థ ప్రసాదలు స్వీకరించారు.

# ప్రభుత్వ భూమి అక్రమిస్తే కఠిన చర్యలు

**ధర్మారం, ఏప్రిల్ 16,మన సాక్షి:**



ధర్మారం జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు మండల కేంద్రంలోని ప్రభుత్వ భూమి సర్వే నెం.476 లో భూ అక్రమ దారులను గుర్తించి నాలుగు ప్రదేశములలో వారియొక్క తాత్కాలిక నిర్మాణాలను జెసిబి ద్వారా తొలగించి మొత్తం విస్తీర్ణం 0.24 గుంటలు ప్రభుత్వ స్వాధీనం లోనికి తీసుకోనైనది. ఇట్టి భూమిలో రక్షణ నిమిత్తం కంచే ఏర్పాటు చెయ్యడం జరుగుతుంది.ప్రభుత్వ భూమిని ఆక్రమించుకున్న ఎంతటి వారినైనా సహించేది లేదని చట్ట పరంగా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమములో మండల గిర్దవార్ వరలక్ష్మి,నవీన్ రెవెన్యూ సిబ్బంది సాగర్, రాజయ్య, కర్ణకార్, తిరుపతి పాల్గొన్నారు.

# సన్న బియ్యంతో భోజనం చేసిన ఎంపీడీవో

**మందమర్రి రూరల్,ఏప్రిల్ 16,మాన సాక్షి:**



తెలంగాణ కాంగ్రెస్ సర్కార్ ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన సన్న బియ్యం పంపిణీలో భాగంగా మండలంలోని సారంగపల్లి 52 నంబర్ రేషన్ షాపు ద్వారా పంపిణీ చేయబడిన సన్నబియ్యం భోజనాన్ని బుధవారం రోజున మండల ప్రజాపరిషత్ అధికారి రాజేశ్వర్. రేశవేని లింగయ్య దంపతుల ఇంట్లో సన బియ్యంతో వండినభోజనం చేయడం జరిగింది ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ కాంగ్రెస్ సర్కార్ ధనికులు తింటున్న సన్న రకం బియ్యాన్ని పేదలకు సైతం పంపిణీ చేయాలని దృఢ సంకల్పంతో రాష్ట్ర సర్కారు ఈ నెల మొదటి వారంనుండి సన్న బియ్యం పంపిణీ చేయడం జరుగుతుందని అన్నారు. లబ్ధిదారులు అందరూ కూడా చౌక ధరల దుకాణం దగ్గరకు వెళ్లి సన్న బియ్యం తెచ్చుకోవాలని తెలియజేశారు.ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ చంద్రకళ నాయకులు తాజుద్దీన్ పాల్గొన్నారు

# బిఆర్ఎస్ రజతోత్సవ సభను విజయవంతం చేయాలి



**దోమకొండ, ఏప్రిల్ 16,మన సాక్షి:**

బీఆర్ఎస్ పార్టీ అధినేత కేసీఆర్ తలపెట్టిన, ఏప్రిల్ 27 న చలో వరంగల్ రజతోత్సవ సభను విజయవంతం చేయాలని , బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు గండ్ర మధుసూదన్ రావు అన్నారు. దోమకొండ మండల కేంద్రంలోని, పెఠిక సంఘంలో బీఆర్ఎస్ పార్టీ నాయకుల ఆధ్వర్యంలో, విలేకరుల సమావేశం బుధవారం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.... కాంగ్రెస్ ప్రభుత్వం అధికార వ్యామోహంతో, ఎన్నికలలో ఎన్నో హామీలు ఇస్తామని చెప్పి, అధికారంలోకి వచ్చి ప్రజలను మభ్యపెడుతుందన్నారు.తెలంగాణా ప్రజలు కాంగ్రెస్ ప్రభుత్వం పట్ల ,పూర్తి అసహనంతో ఉన్నారని, ప్రజలందరూ కూడా మళ్ళీ మాజీ సీఎం కేసీఆర్ పాలననే కోరుకుంటున్నారని తెలిపారు.ఈ కార్యక్రమంలో మాజీ ఏఎంసీ ఛైర్మెన్ కుంచాల శేఖర్, ముత్యంపేట్ సింగిల్ విండో ఛైర్మెన్ కొడిప్యాక తిరుపతి గౌడ్,మాజీ ఎంపిపి కానుగంటి శారదా నాగరాజు,మాజీ ఎంపిటిసి సభ్యులు కడారి రమేష్, మాజీ ఉప సర్పంచ్ గజవాడ శ్రీకాంత్, నాయకులు బోమ్మెర శ్రీనివాస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# నేడు తడ్కల్ తైబజార్ వేలం పాట



**కంగ్టి, ఏప్రిల్ 16, మన సాక్షి :**

సంగారెడ్డి జిల్లా కంగ్టి మండల పరిధిలోని తడ్కల్ గ్రామంలో గ్రామపంచాయతీ కార్యాలయ ఆవరణలో గురువారం ఉదయం 10 గంటలకు తైబజార్ వేలం పాట నిర్వహిస్తున్నట్లు కార్యదర్శి శ్రీనివాసరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా గ్రామ ప్రత్యేక అధికారి విజయ భాస్కర్ హాజరవుతున్నట్టు పేర్కొన్నారు.కావున గ్రామ ప్రజా ప్రతినిధులు, గ్రామ పెద్దలు, వ్యాపారస్తులు హాజరై కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు.

# ఇన్ఫినిటీ మాల్ లో గేమ్ ఆన్ ప్లే జోన్ ప్రారంభం

**శేరిలింగంపల్లి,ఏప్రిల్ 16,మన సాక్షి:**

శేరిలింగంపల్లి,జ్యోతి చిన్నారుల ఆటవిడుపు కోసం విభిన్న రకాల, వినోద భరితాన్ని పంచే ఆటలతో ఏర్పాటు చేసిన గేమ్ ఆన్ ప్లే ఏరియా ప్రముఖ దర్శకుడు రామ్ గోపాల్ వర్మ ముఖ్యఅతిథిగా హాజరై,ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ, నిర్మాత రాక్ లైన్ వెంకటేష్, కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్ తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వేసవి సెలవుల్లో పిల్లలకు ప్రత్యేక వినోదాన్ని అందించేందుకు గేమ్ ఆన్ ప్లే జోన్ ను చందానగర్ లో ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. తక్కువ ఛార్జీలతో అన్ని వర్గాల వారికి అందుబాటులో ఉండేలా ప్లే జోన్ ను కొనసాగించాల్సిందిగా నిర్వాహకులను కోరారు. అనంతరం నిర్వాహకులు అభిలాష్, శ్రావ్యలు మాట్లాడుతూ.చిన్న, పెద్ద వయస్సుతో సంబంధం లేకుండా అందరూ సందడిగా గేమ్స్ ఆడుకునేందుకు వీలుంది. వర్చువల్ గేమ్స్, బౌలింగ్, సాఫ్ట్ ప్లే, క్రికెట్, హ్యూమన్ క్లా, కార్నివాల్ , డాషింగ్ కార్స్ అందుబాటులో ఉన్నాయి. వీటితోపాటు పుట్టినరోజు వేడుకలు, రుచికరమైన భోజనం అందుబాటులో ఉంటాయి. ఈ కార్యక్రమంలో గేమ్ ఆన్ నిర్వాహకులు, డైరెక్టర్ బాబీ, నటులు సామ్రాట్, రోల్ రైడా, గాయత్రి భార్గవి, జనార్దన్ మహర్షి, తదితరులు పాల్గొన్నారు.



# శాంతి భద్రతల పరిరక్షణలో డయల్-100 సేవలు కీలకం: జిల్లా ఎస్పీ యోగేష్ గౌతమ్






**నారాయణపేట టౌన్, ఏప్రిల్ 16, మన సాక్షి :**

జిల్లా కేంద్రంలోని జిల్లా ఎస్పీ ప్రధాన కార్యాలయం కాన్ఫరెన్స్ హాల్లో బుధవారం డయల్ 100 సేవల నిర్వహణ పై బ్లూ కోట్స్, పెట్రో కార్స్ పోలీసు సిబంధితో జిల్లా ఎస్పీ యోగేష్ గౌతమ్ సమీక్ష సమావేశం నిర్వహించారు.

సిబ్బందికి డయల్ 100 కాల్స్ వచ్చినప్పుడు ఏమైనా సమస్యలు వస్తున్నాయా, ఏలాంటి కాల్స్ ఎక్కువగా వస్తున్నాయని అడిగి తెలుసుకున్నారు. డయల్ 100 కాల్స్ వచ్చినప్పుడు సంబంధిత స్థలానికి త్వరగా చేరుకోవాలని ఎవరైనా వీధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే శాఖ పరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ శాంతి భద్రతలు పరిరక్షించడంలో బ్లూ కోట్స్, పెట్రో కార్స్ సిబ్బంది సేవలు ఎంతో కీలకం అని ఆయన తెలిపారు. డయల్ 100 కాల్స్ వచ్చినపుడు పోలీసు సిబ్బంది వీలైనంత త్వరగా స్పందించి సంఘటన స్థలాన్ని చేరుకోవడం ద్వారా నేరం యొక్క తీవ్రతను వీలైనంతవరకు తగ్గించవచ్చని తెలిపారు. ముఖ్యంగా డయల్ 100 కాల్ వచ్చినప్పటినుండి త్వరగా సంఘటన స్థలాలకు చేరుకునేంత వరకు సిబ్బంది నిరంతరం అప్రమత్తంగా ఉండాలని, స్టేషన్ హౌస్ ఆఫీసర్ కి సమాచారం ఇవ్వాలని సూచించారు.

సమస్య పెద్దదైతే ఉన్నతాధికారులకు సమాచారం అందించి స్టేషన్ సిబ్బందిని వినియోగించుకొని సమస్యను పూర్తిగా పరిష్కరించాలని సూచించారు. ముఖ్యంగా భూ తగాదాల కాల్స్ వచ్చినపుడు త్వరితగతిన సంఘటన స్థలానికి చేరుకోవాలని సూచించారు. జన సామర్థ్యం గల ప్రదేశాలలో విసిబుల్ పోలీసింగ్ గా ఉండాలని, డయల్100 కాల్స్, సైబర్ నేరాలు, డ్రగ్స్ మొదలగు వాటి పై ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు.

విధుల్లో ఉన్నవారు నిరంతరం పెట్రోలింగ్ నిర్వహిస్తూ పాయింట్ బుక్స్ విధిగా తనిఖీ చేయాలని, రౌడీ షీటర్స్, సస్పెక్ట్స్ లను, ఎంఓ క్రిమినల్స్ నీ ప్రతిరోజు తనిఖీ నిర్వహించాలని సూచించారు. డయల్ 100 కు వినియోగించే టాబ్ లాను జాగ్రత్తగా వినియోగించి 24 గంటలు నెట్వర్క్ లో అందుబాటులో ఉండే విధంగా చూసుకోవాలి అని తెలిపారు. సిబ్బంది ప్రత్యేక శ్రద్ధ వహిస్తూ డయల్ - 100 విధులను నిర్వర్తించడం ద్వారా రాష్ట్ర పోలీసుల కీర్తి, జిల్లా పోలీసుల కీర్తి ఉన్నత స్థానాలకు ఎదుగుతుందని, ఒక్కరూ తప్పు చేస్తే యావత్ పోలీసు శాఖ మొత్తానికి చెడ్డ పేరు వస్తుంది అని కావున ప్రతి ఒక్కరూ జాగ్రత్తగా విధులు నిర్వర్తించాలని తెలిపారు. రాత్రి సమయాలలో, ముఖ్యంగా పట్టణాల ప్రాంతాలలో గస్తీ లు నిర్వహిస్తూ ఎటువంటి ఆసాంఘిక సంఘటనలు జరగకుండా పర్యవేక్షించాలని సూచించారు. కంట్రోల్ రూమ్ సిబ్బంది 24 గంటలు అప్రమత్తంగా ఉంటూ మొబైల్ ద్వారా, టాబ్ ల ద్వారా, లేదా సెట్ ద్వారా కమ్యూనికేషన్ సమాచారాన్ని సంబంధిత సిబ్బందికి చేరవేసి ప్రజల వద్దకు త్వరగా చేరుకునే విధంగా క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ ఎన్ లింగయ్య, డయల్ 100 పెట్రో కార్స్, బ్లూ కోర్ట్స్ సిబ్బంది, కంట్రోల్ రూమ్ సిబంది తదితరులు పాల్గొన్నారు.

# యాదమ్మ కుటుంబానికి ప్రభుత్వం ఎక్స్ గ్రేషియా చెల్లించాలి

**సూర్యాపేట,ఏప్రిల్ 16,మన సాక్షి:**



సూర్యాపేట మండలం టేకుమట్ల గ్రామానికి చెందిన 15 మంది వ్యవసాయ కార్మికులు ఆత్మకూర్ (ఎస్) మండలం బొప్పారం గ్రామానికి మిరపకాయలు ఏరటానికి వెళుతూ కోటపహాడ్ గ్రామంలో ప్రమాదవశాత్తు ఆటో బోల్తాబడ్డ ఘటనలో చనిపోయిన యాదమ్మ కుటుంబానికి ప్రభుత్వం 25 లక్షల రూపాయలు ఎక్స్ గ్రేషియా చెల్లించి, గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందించి ఆదుకోవాలని అఖిలభారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి ప్రభుత్వాన్నిడిమాండ్ చేశారు. బుధవారం ప్రమాదవశాత్తు ఆటో బోల్తా పడి సూర్యాపేట ప్రభుత్వ జనరల్ హాస్పిటల్ లో మరణించిన యాదమ్మ మృతదేహాన్ని, గాయాల పాలై చికిత్స పొందుతున్న వ్యవసాయ కూలీలను ఐద్వా, తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో సందర్శించి పరామర్శించారు. ఈ సందర్భంగా మల్లు లక్ష్మిమాట్లాడుతూ సొంత గ్రామంలో పనులు లేకపోవడంతో వ్యవసాయ కార్మికులు పొట్ట పోషించుకునేందుకు సుదూర ప్రాంతాలకు ప్రతిరోజు ఆటోలలో ప్రయాణించటం మూలంగా రోడ్డు ప్రమాదం జరిగి వ్యవసాయ కార్మిక మహిళలు చనిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రతిరోజు ఏదో ఒక జిల్లాలో ఈ ఘటనలు జరుగుతుందని అన్నారు. ఉదయం నాలుగు గంటలకు నిద్రలేచి ఆరు గంటలకే రైతుల భూముల్లో కూలి పని చేసుకొని రాత్రి వచ్చేవరకు ఏడు అవుతుందన్నారు. రెక్కల కష్టం మీద ఆధారపడి జీవిస్తున్న వ్యవసాయ కార్మికులు రోడ్డు ప్రమాదాల మూలంగా చనిపోతున్నారని ఈ మరణాలు ప్రభుత్వ హత్యలేనని అన్నారు. ప్రభుత్వం కూలీలకు సొంత గ్రామాలలో ఉపాధి కల్పిస్తే ఇలాంటి ప్రమాదాలు జరిగేవి కాదన్నారు.

**ప్రమాదాల బారిన పడకుండా కాపాడాలి:**

సూర్యాపేట జిల్లాలో ప్రతిరోజు ఏదో ఒక గ్రామంలో వ్యవసాయ పనులకు వెళుతున్న ఆటోలు రోడ్డు ప్రమాదాలకు గురై మహిళ వ్యవసాయ కార్మికులు చనిపోతున్నప్పటికీ వాటిని నివారించడంలో ప్రభుత్వం దృష్టి సారించాలని కోరారు.ఆటో ప్రమాదం వల్ల చనిపోయిన వ్యవసాయ కూలీలను పరిశీలిస్తే అందరూ నిరుపేద వ్యవసాయ కార్మికులేనని అన్నారు. రోడ్డు ప్రమాదం వల్ల చనిపోతున్న వారికి ప్రభుత్వం ఎలాంటి పరిహారం ఇవ్వకపోవడంతో వారి కుటుంబాలు వీధిన పడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. రెక్కాడితే గాని డొక్కాడే వ్యవసాయ కార్మికుల బాధలు ప్రభుత్వానికి పట్టవా అని ప్రశ్నించారు. రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రభుత్వం కఠినమైన చర్యలు చేపట్టాలని కోరారు. మృతుల కుటుంబాలకు ఎక్స్ గ్రేషియా చెల్లించి, తీవ్రంగా గాయపడిన వ్యవసాయ కార్మికులకు మెరుగైన వైద్యం అందించాలని డిమాండ్ చేశారు. ఆటో ప్రమాదం వల్ల చనిపోయిన వారికి, తీవ్ర గాయాల చికిత్స పొందుతున్న వారికి జిల్లా కలెక్టర్ ప్రత్యేక నిధుల ద్వారా ఆర్థిక సహాయం అందించి కూలీలను ఆదుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఐద్వా రాష్ట్ర అధ్యక్షురాలు అరుణ జ్యోతి, రాష్ట్ర సహాయ కార్యదర్శి ఆశలత, తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర నాయకులు మల్లు నాగార్జున రెడ్డి, ఐద్వా జిల్లా ప్రధాన కార్యదర్శి మద్దెల జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

# వేదాంత స్కూల్ గుర్తింపు రద్దు చేయాలని ఫిర్యాదు

**నారాయణపేట టౌన్, ఏప్రిల్ 16, మన సాక్షి :**



నారాయణపేట జిల్లా కేంద్రంలోని వేదాంత పాఠశాల గుర్తింపు రద్దు చేయాలని బుధవారం విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో డీఈఓ కార్యాలయంలో బుధవారం లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. అంబేద్కర్ జయంతి రోజు పాఠశాల నిర్వహణ చేయడంతో పాటు అంబేద్కర్ ను అగౌరవ పరిచిన పాఠశాల యాజమాన్యంపై తక్షణమే చర్యలు తీసుకోవాలన్నారు. జాతీయ సెలవు దినం ఉన్నప్పటికీ పాఠశాల తరగతులు నిర్వహించిన వేదాంత స్కూల్ పై ఏ విధమైన చర్యలు తీసుకున్నారో తమకు తెలుపాలన్నారు. ఫిర్యాదు చేసిన వారిలో విశ్వహిందూ పరిషత్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ రాంబాబు, కన్న శివకుమార్, కడుదాస్ ప్రవీణ్, రామకృష్ణ, సునీత, మహేశ్వరి, సురేఖ తదితరులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల ఎంపిక పారదర్శకంగా చేయాలి: జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్

**నారాయణపేట టౌన్, ఏప్రిల్ 16, మన సాక్షి:**




ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల ఎంపిక జిల్లాలో పారదర్శకంగా చేపట్టాలని జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ సూచించారు. ఇందిరమ్మ ఇండ్ల కోసం వచ్చిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి, అర్హత కలిగిన వారినే ఎంపిక చేయాలన్నారుగురువారం జిల్లా కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో ఇందిరమ్మ ఇళ్ల యాక్షన్ ప్లాన్ పై ఏర్పాటు చేసిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఇందిరమ్మ ఇండ్ల పథకాన్ని అమలు చేస్తోందని, గత జనవరి 26న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కోస్గి మండలం చంద్రవంచ గ్రామంలో ఇందిరమ్మ ఇండ్ల పథకాన్ని ప్రారంభించారని,అలాగే ఫిబ్రవరి 21న నారాయణపేట మండలంలోని అప్పక్ పల్లి గ్రామంలో ఓ లబ్ధిదారు రాలికి మంజూరైన ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి ముఖ్యమంత్రి భూమి పూజ చేశారని కలెక్టర్ ఈ సందర్భంగా గుర్తు చేశారు.

మండలంలో ఒక్కో గ్రామాన్ని ఎంపిక చేసి ఈ పథకాన్ని అమలు చేయడం జరిగిందని, ఇప్పటి వరకు ఇందిరమ్మ ఇండ్లు మంజూరైన వారికి బుధవారం సాయంత్రం వరకు మొదటి విడత రూ. లక్ష వారి ఖాతాలో జమ అవుతుందనే సమాచారం వచ్చిందని కలెక్టర్ తెలిపారు.అలాగే నియోజకవర్గానికి ప్రభుత్వం కేటాయించిన 3500 ఇండ్ల కోసం అర్హత కలిగిన వారినే ఎంపిక చేయాలని, జిల్లాలో లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియలో చిన్న పొరపాటు కూడా జరగడానికి వీలులేదని ఆమె తేల్చి చెప్పారు. దరఖాస్తు చేసుకున్న వారి వద్దకు వెళ్లి ప్రస్తుతం వాళ్ళు ఉంటున్న ఇంటిని, పై కప్పు ను పరిశీలించిన తర్వాతే ప్రభుత్వ నిబంధనల మేరకు ఎంపిక చేయాలని ఆమె ఆదేశించారు. హైదరాబాద్, లేదా వేరే ప్రాంతాలలో నివాసం ఉంటున్న వారిని ఎంపిక చేయ వద్దన్నారు. ఎలిజిబుల్ విత్ ల్యాండ్ ప్రకారమే ఎంపిక ఉండాలన్నారు. ఇందిరమ్మ కమిటీల ద్వారా ఈ నెల 21 వరకు దరఖాస్తుల జాబితా ఎంపీడీవోలకు చేరుతుందని, ఈ నెల 30 వరకు ఇచ్చిన కోటా కు క్షేత్రస్థాయిలో సర్వే చేసి ఎంపిక చేయాలని ఆమె సూచించారు. మే 2న గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద అర్హుల జాబితా ప్రచురించడం జరుగుతుందని తెలిపారు. అధికారులు ఎవరో ఫోన్ చేశారని, అనర్హులను పథకానికి ఎంపిక చేసినా గ్రామస్తుల నుంచి అభ్యంతరాలు వస్తాయని, ఈ విషయం దృష్టిలో పెట్టుకొని అర్హుల ఎంపిక పగడ్బందీగా, పారదర్శకంగా చేయాలని కలెక్టర్ సూచించారు. అలాగే ఈ నడి వేసవి కాలంలో జిల్లాలో ఎక్కడా తాగునీటి సమస్య తలెత్తకుండా ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని ఆమె అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల జిల్లా అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్ హౌసింగ్ పీడీ శంకర్, అన్ని మండలాల ప్రత్యేక అధికారులు, ఎంపీడీవోలు ఎంపీవో లు, మున్సిపల్ కమిషనర్లు, ఆర్ డబ్ల్యూఎస్, ఇరిగేషన్, హౌసింగ్ ఏ ఈ లు పాల్గొన్నారు.

# బిఆర్ఎస్ రజతోత్సవ వాల్ పోస్టర్ ఆవిష్కరణ



**టేక్మాల్, ఏప్రిల్ 16,మన సాక్షి:-**

ఇప్పటికిప్పుడు ఎన్నికలు వస్తే కేసీఆర్ ప్రభుత్వం ఖాయమని, బిఆర్ఎస్ రజతోత్సవాల సందర్భంగా నిర్వహించనున్న ఛలో వరంగల్ సభను విజయంతం చేయాలని ఆందోల్ మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్ కోరారు. ఈ సందర్భంగా మండల కేంద్రమైన టేక్మాల్లో బుధవారం రజతోత్సవాల వాల్ పోస్టర్ ను పార్టీ నాయకులతో కలిసి ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లడుతూ తెలంగాణ రాష్ట్రం సాధన కోసం బిఆర్ఎస్ పార్టీ ఆవిర్భవించిందని, ఎన్నో ఒడిదుడుకులను, కష్టాలను అదిగమించి తెలంగాణ రాష్ట్రాన్ని టిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో కేసీఆర్ స్వరాష్ట్రాన్ని సాధించారని తెలిపారు. కొట్లాడి సాధించుకున్న తెలంగాణను పదేళ్లపాటు అధికారంలో ఉన్న బిఆర్ఎస్ రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో నడిపిస్తూ ముందుకు తీసుకెళ్లడంలో కేసీఆర్ తనదైన శైలితో ముందుకు సాగారని కొనియాడారు. పార్టీ ఆవిర్భవించి 25 సంవత్సరాలు గడుస్తున్న ప్రస్తుత తరుణంలో రజతోత్సవాలను నిర్వహించేందుకు పార్టీ వరంగల్ సభను పెద్ద ఎత్తున నిర్వహించడానికి సంకల్పించిందన్నారు. ఈ సభను విజయవంతం చేయడానికి పార్టీ శ్రేణులు,తెలంగాణ ఉద్యమకారులు, తెలంగాణ అభిమానులు పెద్ద సంఖ్యలో తరలి వచ్చి రజతోత్సవాల సభను విజయవంతం చేయాలని ఆయన కోరారు. మండల పరిధిలోని ప్రతి గ్రామం నుంచి ప్రజలు, కార్యకర్తలు, ముఖ్య నాయకులు, పార్టీ శ్రేణులు పెద్ద సంఖ్యలో తరలి రావడానికి సన్నద్ధం కావాలని ఆకాంక్షించారు. అధికారంలో ఉన్న పదేళ్ల కాలంలో ప్రజా సంక్షేమం కోసం టిఆర్ఎస్ పార్టీ, ప్రభుత్వం పనిచేసిందని ఆయన గుర్తు చేశారు. స్వరాష్ట్ర ఉద్యమ ఆకాంక్షతో ఆవిర్భవించిన టీఆర్ఎస్ ఎన్నో ప్రజా సంక్షేమ పథకాలను తీసుకువచ్చి తెలంగాణ ప్రజలను అన్ని రంగాల్లో అగ్రగామిగా ముందుకు నడిపించిందని తెలియజేశారు. టిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో కొలువుదీరిన తెలంగాణ సర్కార్ అన్ని వర్గాల ప్రజలు, రైతాంగాన్ని ముందుకు తీసుకెళ్లడానికి కల్యాణ లక్ష్మి, షాదీముబారక్, రైతు బీమా, రైతు బంధు, వృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళలకు చేదోడుగా నిలవడానికి ఫించన్లను అందిస్తూ వారికి అండగా నిలిచిందన్నారు. కల్లబొల్లి మాటలు చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చలేని దీనస్థితిలో ఉండి తెలంగాణ ప్రజలను మోసం చేసిందన్నారు. ఇప్పటికిప్పుడు ఎన్నికలు వస్తే టిఆర్ఎస్ పార్టీ విజయకేతనం ఎగురవేసి కేసీఆర్ ప్రభుత్వం ఏర్పాటు చేయడం తథ్యమన్నారు. తెలంగాణ ప్రజల ఆశలను, ఆకాంక్షలకు అనుగుణంగా పదేళ్లపాటు నిర్మాణం చేసిన తెలంగాణను కాంగ్రెస్ పార్టీ విచ్ఛిన్నం చేసిందన్నారు. రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి తెలంగాణ ప్రజలు తగిన గుణపాఠం చెప్తారన్నారు. ఈ నెల 27న జరిగే ఛలో వరంగల్ కార్యక్రమానికి మండల పరిధిలోని ఆయా గ్రామాలకు చెందిన ముఖ్య నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలి రావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు భక్తుల వీరప్ప, నాయకులు సిద్దయ్య, రవి, రజాక్, సాయిబాబా, మల్లేశం, సలావోద్దీన్, సాయిలు, సంగయ్య, బాలకృష్ణ, నారాగౌడ్, తదితరులు ఉన్నారు.

# బీఆర్ఎస్ రజతోత్సవ మహాసభను జయప్రదం చేయాలి




**నాచారం,ఏప్రిల్ 16,మన సాక్షి:**

హన్మకొండ జిల్లా ఎల్కతుర్తిలో ఈ నెల 27న జరగనున్న బీఆర్ఎస్ రజతోత్సవ మహాసభను జయప్రదం చేయాలని బిబీఆర్ఎస్వీ రాష్ట్ర కార్యదర్శి జంగయ్య బుధవారం ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కాలేజ్ వేదికగా పిలుపునిచ్చారు. బీఆర్ఎస్ పార్టీ తెలంగాణ ప్రజల ఆరు దశాబ్దాల కలను నెరవేర్చిందన్నారు. అధినేత కేసీఆర్ పదేండ్ల పాలనలో సంక్షేమం, అభివృద్ధిలో తెలంగాణ మిగతా రాష్ట్రాలకు ఆదర్శంగా నిలిచిందన్నారు. 16 నెలల కాంగ్రెస్ పాలనపై ప్రజల్లో తీవ్ర అసంతృప్తి నెలకొందన్నారు. రజతోత్సవ మహాసభ నిర్వహణ ఏర్పాట్లను చూసి కాంగ్రెస్ నేతల్లో భయం మొదలైందని చెప్పారు. అధికారంలోకి రానున్నది బీఆర్ఎస్ పార్టీనేనన్నారు. ఈ కార్యక్రమంలో వినోద్ నాగరాజ్ రమేష్ మల్లేష్ వెంకట్ మురళి ప్రశాంత్ యుగేందర్ శ్రీకాంత్ విజేందర్ తదితరులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే కోసం వెళ్లిన కార్మికులను అడ్డుకున్న నేతలు

**తొర్రూరు ఏప్రిల్ 16 (మన సాక్షి ):**



మహబూబాబాద్ జిల్లా తొర్రూరు మండలం చర్లపాలెం గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో బుధ వారం కమ్యూనిటీ డెవలప్మెంట్ ఫౌండేషన్ సహకారంతో మినరల్ వాటర్ ప్లాంట్ను ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి పాలకుర్తి నియోజకవర్గ ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ప్రారంభోత్సవం వేళ, గ్రామ పంచాయతీలో పని చేస్తున్న కార్మికులు,ధర్మారపు వెంకటమ్మ, ధర్మారపు జయమ్మ, చింతకుంట్ల సత్తయ్య, చిట్టిమల్ల సాయిలు, ధర్మారపు మల్లమ్మ, ధర్మారపు మైబ గత ఎనిమిది నెలలుగా జీతాలు అందక తీవ్రంగా బాధపడుతున్నామని ఎమ్మెల్యేను కలవడానికి ప్రయత్నించారు. కానీ వారిని స్థానిక కాంగ్రెస్ కార్యకర్తలు అడ్డుకున్నారు అని వారు వాపోయారు."మేడం మాకు పూట గడవడం చాలా ఇబ్బందిగా ఉంది. మీ కాళ్లు మొక్కుతాను మేడం, కానీ మాకు జీతాలు ఇప్పించండి" అంటూ కార్మికులు వేడుకున్నారు. అయితే, ఎమ్మెల్యేని కలవడానికి ప్రయత్నించిన కార్మికులను స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు అడ్డుకోవడం ఆగ్రహాన్ని రేపింది. కార్మికుల వాదనం మేరకు, ఎమ్మెల్యే యశస్విని రెడ్డి సమస్యలు వినకుండా నేరుగా కారెక్కి వెళ్లిపోయారని తెలిపారు.

# సినీనటి కుషిత సందడి

**రాజేంద్రనగర్, ఏప్రిల్ 17,మన సాక్షి :**



సినీ నటి కుషిత సందడి చేశారు. బండ్లగూడ కార్పొరేషన్ పరిధిలోని సన్ సిటీలో ఏర్పాటుచేసిన మినర్వా స్వీట్స్ షాపును ఆమె బుధవారం పలువురు మోడల్స్ తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ.. తాము మూడో అవుట్లెట్ను ప్రారంభించామని వినియోగదారులకు నాణ్యమైన స్వీట్లు స్నాక్స్ అందజేస్తున్నట్లు తెలియజేశారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ ముఖ్యఅతిథిగా హాజరై పాల్గొన్నారు. ఈ సందర్భంగా సినీ నటి కుషిత పలువురు మోడల్స్ సెల్ఫీ దిగుతూ సందడి చేశారు.

# ఘనంగా స్వపరిపాలన దినోత్సవం

**తిరుమలగిరి (సాగర్),ఏప్రిల్16 మన సాక్షి:**



తిరుమలగిరి సాగర్ మండలం, తిమ్మాయిపాలెం గ్రామంలో గల వండర్ కిడ్స్ ఇంగ్లీష్ మీడియం స్కూల్లో ఘనంగా స్వపరిపాలనా దినోత్సవం వార్షిక దినోత్సవం జరుపుకోవడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా తిరుమలగిరి సాగర్ మండల విద్యాధికారి అయిన సి.హెచ్. శ్రీనివాస్ విచ్చేసి విద్యార్థులకు చదువు యొక్క గొప్పదనం గురించి మాట్లాడారు. ఈ సందర్భంగా గురుకుల విద్యాలయాలు 100 శాతం సీటు సాధించిన పాఠశాల విద్యార్థులను అభినందించి వారికి ప్రశంసా పత్రాలు అందజేశారు. పాఠశాల కరస్పాండెంట్ ఎస్ కె . మౌలాలి,గురుకుల కోచింగ్ ఇచ్చిన ఉపాధ్యాయులు వై. మురళి, టి . రంగాచారి కలిసి ఎం.ఈ.ఓ శ్రీనివాస్ కు సన్మానం చేశారు.ఈ కార్యక్రమంలో మిగతా ఉపాధ్యాయ బృందం పి.విజయ, జె.సుశీల, యం.రంగా, కృష్ణవేణి, అబ్బాస్,అజ్జు,నాగేశ్వరి తదితరులు విద్యార్థుల తల్లిదండ్రులు ఈ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేసినందుకు వండర్ కిడ్స్ విద్యాసంస్థలు తరుపున ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలియజేయడం జరిగింది.

# ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి



**దోమకొండ, ఏప్రిల్ 16, మన సాక్షి:**

ప్రభుత్వం ఏర్పాటు చేసిన దాన్యం కొనుగోలు, కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు అనంతరెడ్డి, మాజీ జెడ్పిటిసి తీగల తిరుమల గౌడ్ అన్నారు. దోమకొండ మండలంలోని అంచనూర్ , లింగుపల్లి, గ్రామాలలో ఐకెపి ఆధ్వర్యంలో, ఏర్పాటు చేసిన వరి కొనుగోలు కేంద్రాలను బుధవారం ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ..... రైతులు ప్రభుత్వం ద్వారా ఏర్పాటు చేసిన కొనుగోలు, కేంద్రాలలో విక్రయించి ప్రభుత్వం చెల్లించే మద్దతు ధరను పొందాలని, ఏ గ్రేడు రకం కు 2320, బి గ్రేడ్ రకముకు 2300 మద్దతు ధర లభిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో తాహసిల్దార్ సంజయ్ రావు, ఎంపీడీవో ప్రవీణ్ కుమార్, డిపిఎం రమేష్ బాబు, ఏఎంసీ డైరెక్టర్లు పోగుల సాయిలు, గోపాల్ రెడ్డి, నాయకులు పోగుల నర్సింలు, ఏపీఎం రాజు, తదితరులు పాల్గొన్నారు.



# కారు ఉండగానే రోడ్డు వేసేసిన కాంట్రాక్టర్..

**బాపట్ల:** జిల్లా వేటపాలెం మండలం ఆమోదగిరి పట్నంలో వింత ఘటన చోటుచేసుకుంది. ఓ వీధిలో రోడ్డు వేస్తుండగా ఇంటి ముందున్న కారును తొలగించకుండానే కాంట్రాక్టర్ సిమెంట్ రోడ్డు వేశాడు. ఏడాదిగా కారు అక్కడే ఉందని, తీయమని చెప్పినా యజమాని పట్టించుకోలేదని పంచాయతీ కార్యదర్శి తెలిపారు. కాంట్రాక్టర్ సర్వే చేయకుండానే రోడ్డు వేశారని కారు యజమాని ఆరోపిస్తున్నారు. అయితే దీనికి సంబంధించిన వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.

కొన్ని కొన్ని ఘటనలు చూస్తే అమ్మబాబోయ్ అనుకుంటాం. మరికొన్ని వీడెవడెండీ బాబూ అనుకునేలా చేస్తాయి. అలాంటి ఘటనే ఆంధ్రప్రదేశ్‌లో చోటుచేసుకుంది. సాధారణంగా మనం రోడ్డుపై వెళు_న్నప్పుడు దారిలో ఏదైనా అడ్డొస్తే ఏం చేస్తాం.. వీలైతే దానిని పక్కకు పెట్టి ముందుకెళ్తాం.. కుదరని పరిస్థితుల్లో పక్కకు జరిగి మన దారిన మనం పోతాం. అలా కూడా వీలు లేని పరిస్థితుల్లో ఆ వస్తువు లేదా వాహనం యజమాని ఎవరైనా ఉంటే అతనికి చెప్పి.. దానిని పక్కకు తీయించి, ఆ దారిలో వెళ్తుంటాం. కానీ వీడెవడెండీ బాబూ.. ఇలా ఉన్నాడు.. అనే ఘటన బాపట్ల జిల్లా వేటపాలెం మండలం ఆమోదగిరిపట్నంలో చోటుచేసుకుంది. ఆమోదగిరిపట్నంలో ఓ వీధిలో రోడ్డు వేస్తున్నారు. అయితే రోడ్డు వేసే క్రమంలో ఓ ఇంటి ముందు నిలిపిన కారు అడ్డు వచ్చింది. అయితే ఆ కారును పక్కకు తీసేయకుండానే సిమెంట్ రోడ్డు వేసేశారు సదరు కాంట్రాక్టర్. దీనికి సంబంధించిన వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. అసలు విషయానికి వస్తే.. ఆమోదగిరిపట్నంలోని ఓ వీధిలో ఇటీవల సిమెంట్ రోడ్డు నిర్మించారు. వెంకటరమణ అనే వ్యక్తి ఇంటి ముందు నుంచి సుబ్బారావు అనే వ్యక్తి ఇంటి వరకూ ఈ రోడ్డు నిర్మాణం జరిగింది. అయితే వెంకటరమణ ఇంటి ముందు ఆగి ఉన్న కారును తీయకుండానే.. సిమెంట్ రోడ్డు వేసేశారు. కారును అలాగే ఉంచి రోడ్డు వేసిన ఫోటోలు, వీడియోలు నెట్టింట చక్కర్లు కొడుతున్నాయి. ఇది చూసిన నెటిజనం ఇదేందిరా అయ్యా అని ముక్కున వేలేసుకుంటున్నారు.

**విశాఖ కేసులో విస్తుపోయే నిజాలు**

అయితే ఈ వ్యవహారంపై అధికారులు స్పందించారు. ఏడాదిగా కారు అక్కడే ఉందని.. అక్కడి నుంచి పక్కకు తీయాలని ఎన్నిసార్లు చెప్పినా కారు యజమాని పట్టించుకోలేదని స్థానిక పంచాయతీ కార్యదర్శి చెప్తున్నారు. పైగా ఇంటికి తలుపులు వేసి వెళ్లిపోయారని.. చెప్తున్నారు. ఈ రోడ్డు గతేడాది మంజూరైందని.. కానీ కారు యజమాని తీరు కారణంగా నిర్మించలేకపోయామని తెలిపారు. అయితే కారును తీయకుండా కాంట్రాక్టర్ రోడ్డు వేసిన విషయం తమ దృష్టికి వచ్చిందని.. దీనిపై విచారణ జరుపుతామని అధికారులు చెప్తున్నారు. మరోవైపు కాంట్రాక్టర్ సర్వే చేయకుండానే రోడ్డు నిర్మాణ పనులు చేపట్టారని కారు యజమాని ఆరోపిస్తున్నారు. మరి కాంట్రాక్టర్‌ది తప్పా, కారు ఓనర్‌ది తప్పా.. ఈగోలో దీనికి కారణమా అనేది తెలియాల్సి ఉంది.

# రాజధానిలో 5 భారీ టవర్లు.. ఎన్ని రూ. వేలకోట్లంటే?

**అమరావతి:** ఏపీ రాజధాని అమరావతి నిర్మాణంలో కీలక అడుగుపడింది. రాజధానిలో ఐదు భారీ టవర్ల నిర్మాణానికి సీఆర్డీఏ టెండర్లు ఆహ్వానిస్తోంది. సచివాలయ టవర్లు, హెచ్‌వోడీ కార్యాలయ టవర్ల నిర్మాణం కోసం సీఆర్‌డీఏ టెండర్లు పిలిచింది. సచివాలయ నిర్మాణంలో నాలుగు టవర్లు, హెచ్‌వోడీ ఆఫీస్ టవర్ నిర్మాణం కోసం ఈ టెండర్లు పిలిచారు. మొత్తం ఐదు టవర్ల నిర్మాణానికి 4,668 కోట్లు ఖర్చు చేయనున్నారు. మరోవైపు మే రెండో తేదీన ప్రధాని మోదీ అమరావతి పర్యటనకు రానున్న సంగతి తెలిసిందే.

ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి నిర్మాణ పనుల్లో వేగం పెరిగింది. మూడేళ్లలో రాజధాని నిర్మాణం పూర్తి చేస్తామంటున్న టీడీపీ కూటమి ప్రభుత్వం ఆ దిశగా అడుగుల వేస్తోంది. ఇప్పటికే అమరావతిలో నిర్మాణ పనులు మొదలయ్యాయి. మే 2వ తేదీన అధికారికంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చేతుల మీదుగా అమరావతి రీలాంఛింగ్ కార్యక్రమం నిర్వహించనున్నారు. మరోవైపు అమరావతి నిర్మాణంలో మరో కీలక అడుగు పడింది. అమరావతి నిర్మాణంలో కీలకమైన సచివాలయ టవర్ల నిర్మాణానికి టెండర్లు పిలిచారు. సచివాలయ టవర్ల నిర్మాణానికి సీఆర్డీఏ టెండర్లను ఆహ్వానిస్తోంది. సచివాలయంలో 4 టవర్లు, హెచ్‌వోడీ కార్యాలయానికి ఒక టవర్ చొప్పున రూ. 4,668 కోట్లతో అమరావతిలో ఐదు టవర్లు నిర్మించనున్నారు. ఈ టవర్ల నిర్మాణం కోసం సీఆర్డీఏ టెండర్లను ఆహ్వానిస్తోంది.



ఆంధ్రప్రదేశ్ సచివాలయంలో 1, 2 టవర్ల నిర్మాణం కోసం రూ.1,897 కోట్లు, 3, 4 టవర్ల నిర్మాణం కోసం రూ.1,664 కోట్లతో సీఆర్డీఏ టెండర్లను ఆహ్వానించింది. అలాగే హెచ్‌వోడీ కార్యాలయం టవర్ నిర్మాణం కోసం రూ. 1,126 కోట్లతో మరో టెండరును పిలిచింది. మొత్తం 5 టవర్లకు రూ. 4,668 కోట్లు అంచనా వ్యయంగా నిర్ణయించారు. మే ఒకటో తేదీన ఈ టెక్నికల్ బిడ్లను సీఆర్‌డీఏ అధికారులు తెరవనున్నారు. హెచ్‌వోడీలకు సంబంధించిన టవర్‌లో మొత్తం 45 అంతస్థులు ఉండనున్నాయి. సచివాలయంలోని మిగతా నాలుగు టవర్లను 40 ఫ్లోర్లతో నిర్మించనున్నారు. ఈ టవర్లన్నీ కూడా డయాగ్రిడ్ స్ట్రక్చర్‌తో నిర్మించనున్నారు. అమరావతి రాజధాని నిర్మాణంలో సచివాలయ టవర్ల నిర్మాణం అత్యంత కీలకం కానుంది. మరోవైపు ఈ టవర్ల నిర్మాణాన్ని రెండున్నర నుంచి మూడేళ్లలో పూర్తి చేయాలని సీఆర్‌డీఏ స్పష్టం చేసింది.

మరోవైపు అమరావతి నిర్మాణం కోసం రుణం ఇచ్చేందుకు ఇప్పటికే ప్రపంచ బ్యాంకు, ఏడీబీ, హడ్కో ముందుకు వచ్చిన సంగతి తెలిసిందే. అలాగే జర్మనీకి సంబంధించిన కేఎఫ్‌డబ్ల్యూ బ్యాంక్ కూడా రుణం ఇచ్చేందుకు సంసిద్ధత వ్యక్తం చేసింది. అలాగే ఈ రుణాల నుంచి కేంద్రం ఇటీవల 4200 కోట్ల వరకూ విడుదల చేసిన సంగతి తెలిసిందే. మరోవైపు మే నెల రెండో తేదీన ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అమరావతి పర్యటనకు రానున్నారు. ఇందుకోసం భారీగా ఏర్పాట్లు జరుగుతున్నాయి. సచివాలయం వెనుకవైపున మోదీ సభ కోసం విస్తృత ఏర్పాట్లు జరుగుతున్నాయి. ప్రధాని సభలో అమరావతి త్రీడీ నమూనాను ప్రదర్శించేందుకు ఏపీ ప్రభుత్వం కసరత్తు చేస్తోంది.

# శబరిమల అయ్యప్ప తొలి బంగారు లాకెట్ ఈయనకే దక్కింది



**శబరిమల:** ఆలయంలో అయ్యప్ప స్వామి ప్రతిమతో కూడిన బంగారు లాకెట్ల విక్రయాలను ట్రావెన్‌కోర్ దేవస్థానం బోర్డు ప్రారంభించింది. కేరళ దేవాదాయశాఖ మంత్రి వీఎన్ వాసవన్ విషు పర్వదినాన ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. తొలి లాకెట్‌ను ఆన్‌లైన్‌లో కొనుగోలు చేసిన ఆంధ్రప్రదేశ్‌కు చెందిన మణిరత్నంకు అందజేశారు. 2, 4, 8 గ్రాముల బరువులో ఈ లాకెట్లు అందుబాటులో ఉన్నాయి. కేరళలోని శబరిమల ఆలయంలో ట్రావెన్‌కోర్ దేవస్థానం బోర్డు అయ్యప్ప స్వామి ప్రతిమతో బంగారు లాకెట్ల విక్రయాలు ప్రారంభించింది. కేరళ దేవాదాయశాఖ మంత్రి వీఎన్ వాసవన్ పవిత్ర విషు పర్వదినం రోజు ఈ విక్రయాలకు శ్రీకారం చుట్టారు. ఈ మేరకు లాకెట్‌ను ఆన్‌లైన్ ద్వారా కొనుగోలు చేసిన ఆంధ్రప్రదేశ్‌కు చెందిన భక్తుడికి మొదటి లాకెట్‌ను అందజేశారు. ఈ లాకెట్‌ను శ్రీకాకుళంకు చెందిన మణిరత్నం చేతికి అందింది.

**శబరిమల అయ్యప్పకు భారీగా ఆదాయం**

శ్రీకాకుళానికి చెందిన మణిరత్నం అనే వ్యక్తి శబరిమల అయ్యప్ప ప్రతిమ ఉన్న బంగారు లాకెట్‌ను ఆన్‌లైన్‌లో కొనుగోలు చేశారు. మణిరత్నం తండ్రి కొబగాపు నారాయణరావు జిల్లా వైద్య ఆరోగ్యశాఖలో ఉద్యోగిగా పనిచేస్తున్నారు. శబరిమల అయ్యప్ప ఆలయ గర్భగుడిలో ఉంచి పూజించిన తొలి లాకెట్‌ను తమ కుమారుడు అందుకోవడం ఆనందంగా ఉందన్నారు మణిరత్నం తండ్రి కొబగాపు నారాయణరావు. మొదటగా ఆన్‌లైన్‌లో బుక్ చేసుకున్న వారిలో మణిరత్నం ఎంపికయ్యారని.. ఆయనకు మొదటి లాకెట్‌ను అందజేశారని.. మణిరత్నం 4 గ్రాముల లాకెట్‌ను రూ.38,600కు కొనుగోలు చేశారన్నారు.

కేరళ దేవాదాయశాఖ మంత్రి వీఎన్ వాసవన్, ట్రావెన్‌కోర్ దేవస్థానం బోర్డు అధ్యక్షుడు ప్రశాంత్ విషు రోజు (ఏప్రిల్ 14)న సన్నిధానం దగ్గర జెండా చెట్టు కింద బంగారు లాకెట్ల పంపిణీని ప్రారంభించారు. ఈ లాకెట్లను ట్రావెన్‌కూర్ దేవస్థానం బోర్డు జారీ చేస్తోంది. అయ్యప్ప ఆలయం బోర్డు ప్లాటినం జూబ్లీ ఉత్సవాలు జరుపుకుంటున్న సందర్భంగా లాకెట్లను తీసుకొచ్చారు. అయ్యప్ప స్వామి ప్రతిమ ఉన్న లాకెట్లు 2, 4, 8 గ్రాములలో లభిస్తాయి. శబరిమల అయ్యప్ప గర్భగుడిలో పూజల తర్వాత భక్తులకు లాకెట్లను దేవస్థానం బోర్డు అధికారులు అందిస్తున్నారు. రెండు గ్రాముల బంగారు లాకెట్ ధర రూ. 19,300 కాగా.. నాలుగు గ్రాముల లాకెట్ ధర రూ. 38,600, ఎనిమిది గ్రాముల లాకెట్ ధర రూ. 77,200గా నిర్ణయించారు.

వెబ్‌సైట్‌కు వెళ్లిన తర్వాత లాగిన్ అయ్యా.. పైన నేరుగా గోల్డ్ లాకెట్ అని కనిపిస్తుంది.. అందులోకి వెళ్లి బుక్ చేసుకోవచ్చని వివరించారు. రిజర్వేషన్ చేసుకున్న వారు శబరిమల ఆలయాన్ని సందర్శించి అక్కడి పరిపాలనా కార్యాలయం నుంచి లాకెట్‌ను తీసుకోవాలని సూచిస్తున్నారు.

# విశాఖ కేసులో విస్తుపోయే నిజాలు

**విశాఖపట్నం:** మధురవాడ గర్భిణి అనూష హత్య కేసులో రోజుకో కొత్త విషయం వెలుగులోకి వస్తోంది. అనూషను చంపేందుకు జ్ఞానేశ్వర్ గతంలో ఎన్ని వేషాలు వేశాడనేదీ ఒక్కొక్కటిగీ వెలుగులోకి వస్తున్నాయి. అనూషను పెళ్లికి ముందే శారీరకంగా కలుద్దామంటూ బలవంతం చేసినట్లు తెలిసింది. అయితే ఆమె అందుకు ఒప్పుకో కపోవటంతో ఫ్యామిలీకి తెలియకుండా పెళ్లి చేసుకున్నాడు. వివాహమైన తర్వాత అనూషను వదిలించుకునేందుకు చాలా ప్లాన్లు వేశాడు. చివరకు మూడో కంటికి తెలియకు ండా రాత్రి వేళ హత్య చేశాడు. కానీ ఓ అనుమానం.. అతని ప్లాన్ బెడిసి కొట్టేలా చేసింది.



విశాఖపట్నంలోని మధురవాడలో హత్యకు గురైన నిండు గర్భిణి అనూష ఘటనలో ఆమె భర్త గెద్దాడ జ్ఞానేశ్వర్ గతంలో ఎన్ని వేషాలు వేశాడో.. ఆమెను చంపేందుకు ఎన్ని కుట్రలు పన్నాడో ఒక్కక్కటిగా బయటికి వస్తున్నాయి. అసలు అనూషను జ్ఞానేశ్వర్ చంపిన విషయం కూడా బయటికి వచ్చుండేది కాదు. రాత్రి పడుకున్న నా భార్య తెల్లారేసరికి ఉలుకుపలుకు లేకుండా పడుందని నాటకం ఆడాడు జ్ఞానేశ్వర్. కానీ, అనూష స్నేహితురాలి తల్లికి అనుమానం వచ్చింది. ఆమె అనుమానమే నిజమైంది. ఒకవేళ ఆమె అనుమానించకుండా ఉండుంటే జ్ఞానేశ్వర్ హత్య చేసిన విషయం ఇంత త్వరగా తెలుసుండేది కాదు.. అసలు పూర్తిగా తెలిసే అవకాశమే లేకుండా పోయేదేమో. మరోవైపు పోలీసులు విచారణలో జ్ఞానేశ్వర్ కుట్రలు ఒక్కొక్కటిగా వెలుగు చూస్తున్నాయి. వైజాగ్ బీచ్‌రోడ్డులోని ఓ కాలేజీలో అనూష హోటల్ మేనేజ్‌మెంట్ కోర్సు చేస్తున్నప్పుడు ప్రేమ పేరుతో వెంటపడ్డాడు. పెళ్లికి ముందే శారీరకంగా ఒకటవుదామని పలుమార్లు ప్రయత్నించినా అనూష అందుకు ఒప్పుకోలేదు. దీంతో అతని కుటుంబ సభ్యులకు తెలియకుండా సింహాచలంలో పెళ్లి చేసుకున్నాడు. ఈ పెళ్లికి అనూష కుటుంబ సభ్యులు హాజరయ్యారు. ఆ తర్వాత మధురవాడలో కాపురం పెట్టి తాను బెంగళూరులో ఉంటున్నానని తల్లిదండ్రులను నమ్మించాడు.

పెళ్లి తర్వాత అనూషతో శారీరకంగా దగ్గరైన జ్ఞానేశ్వర్.. ఆ తర్వాత ఆమెను ఎలాగోలా వదిలించుకోవాలని అవకాశం చిక్కినప్పుడల్లా ప్రయత్నాలు చేశాడు. నాకు క్యాన్సర్ అటాక్ అయ్యింది.. నాతో ఉంటే నీ జీవితం పాడైపోతుంది.. విడాకులు తీసుకుని వేరొకరిని పెళ్లి చేసుకుని హాయిగా ఉండంటూ నంగనాచి కబుర్లు చాలానే చెప్పాడు. కానీ ఈ ఒత్తిళ్లకు అనూష లొంగలేదు. చావైనా బతుకైనా నీతోనే.. నిన్ను వదిలి ఎక్కడికీ వెళ్లను అని అనూష తెగేసి చెప్పింది. పెళ్లై రెండేళ్లు గడచినా ఇంట్లో రెండు మంచాలు, వంట సామాన్లు తప్ప మరే సౌకర్యాలు కల్పించకుండా కాలం గడిపాడు జ్ఞానేశ్వర్. ఆమెతో కలిసి ఫొటోలు దిగితే ఫ్రెండ్స్ ద్వారా బయటకు వెళ్లిపోతాయని ఎప్పటికప్పుడు జాగ్రత్త పడుతూ వచ్చాడు. గర్భిణిగా ఉన్న ఆమె ఓ సారి 'ఫలూదా' తాగాలని ఉందని అడిగితే తీసుకు వచ్చి దాంట్లో నిద్రమాత్రలు కలిపి ఇచ్చాడు. తాగే సమయంలో గ్లాసులో కరగకుండా ఉన్న ఓ మాత్రను ఆమె గుర్తించి ఏమిటని అడగటంతో తనకు తెలియదని బుకాయించాడు. మొత్తానికి ఆమెను వదిలించుకోవాలనే ప్రయత్నాలు అయితే ఆపలేదు.

ఏప్రిల్ 13వ తేదీ అర్ధరాత్రి దాటిన తర్వాత భార్యను హత్య చేసిన జ్ఞానేశ్వర్.. ఆ తర్వాత పెద్ద నాటకమే వేశాడు. పొద్దున్నే లేచి బెడ్ రూమ్‌లోనే ఫోన్ చూసుకుంటూ చాలా నేచురల్‌గా నటించాడు. అనూష డెలివరీ ఉందని రెండు రోజుల ముందే అమ్మమ్మ ఆమె దగ్గర వచ్చారు. ఆవిడ హాలులో పడుకునేవారు. ఉదయం అనూషను నిద్రలేపేందుకు గదిలోకి వెళ్లారు. ఆమె ఎంత లేపినా అనూష నుంచి స్పందన లేదు. ఏంటి లేవడం లేదా.. ఏమైంది అని ఆశ్చర్యం వ్యక్తం చేస్తూ తనలోని నట విశ్వరూపాన్ని చూపించాడు జ్ఞానేశ్వర్. తన భార్య లేవడం లేదని అందరినీ కంగారు పెట్టాడు. నైబర్స్‌లో ఇద్దరు గ్రే హౌండ్స్ కానిస్టేబుల్స్ ఉన్నారు. వారిలో ఒకరికి కారు ఉంది. ఆ కారులో ముందుగా ఓ ప్రైవేటు హాస్పిటల్‌కి అనూషను తీసుకువెళ్లాడు. అనూష అప్పటికే చనిపోయిందని డాక్టర్లు నిర్ధారించారు. అయితే, వాళ్లతో హాస్పిటల్‌కు వెళ్లిన అనూష స్నేహితురాలి తల్లి.. ఆమె మెడపై ఉన్న మచ్చను గుర్తించారు. అంతేకాకుండా అనూష శరీరం నల్లగా ఉబ్బిపోవడం చూసి ఇది క్యాజువల్ డెత్ కాదని అనుమానం వ్యక్తం చేశారు. దీంతో అనూష డెడ్ బాడీని అక్కడి నుంచి కేజీహెచ్‌కు తీసుకెళ్లారు. విషయం పోలీసులకు చెప్పడంతో వాస్తవాలు బయటపడ్డాయి. హత్యకు గురైన నిండు గర్భిణి అనూషకు పోస్టుమార్టం నిర్వహించిన కేజీహెచ్ డాక్టర్లు.. ఆమె గర్భం నుంచి మృత ఆడశిశువును బయటకు తీశారు. ఈ హృదయ విదారకరమైన ఘటన అందరినీ కలచి వేసింది. నిందితుడు జ్ఞానేశ్వర్ ప్రత్యక్షంగా ఒకరిని, పరోక్షంగా ఇద్దరిని బలిగొన్నాడని అంతా ఆవేదన వ్యక్తం చేశారు.

# లారీ డ్రైవర్‌కు డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్ట్.. రీడింగ్ చూసి బిత్తరపోయారు..

**ప్రకాశం:** జిల్లాలో హైవేపై పోలీసులు డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు చేస్తుండగా రాజస్థాన్‌కు చెందిన ఓ లారీ డ్రైవర్ పట్టుబడ్డాడు. అతడి బ్రీత్ ఎనలైజర్ రీడింగ్ చూసి పోలీసులు షాక్ అయ్యారు. ఆయనకు రీడింగ్ ఏకంగా 398.1/100 రావడంతో అంతా ఆశ్చర్యపోయారు. ఇంత మోతాదులో మద్యం సేవించి లారీ ఎలా నడుపుతున్నాడని పోలీసులు విస్మయం వ్యక్తం చేశారు. ఆ డ్రైవర్‌కు పది రోజుల జైలు శిక్ష విధించారు.

ఇటీవల కాలంలో పోలీసుల డ్రంక్ అండ్ డ్రైవ్‌లు ముమ్మరం చేశారు. నగరాలు, పట్టణాలతో పాటుగా హైవేలపై కూడా అవసరమైన చోట్ల టెస్ట్‌లు చేస్తున్నారు. కొంతమంది డ్రైవర్లు తాగి వాహనాలను నడుపుతున్నారనే సమాచారంతో హైవేల్లో కూడా డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్టులు మొదలుపెట్టారు. ఈ క్రమంలో ప్రకాశం జిల్లాలోని హైవేపై చేసిన డ్రంక్ అండ్ డ్రైవ్‌లో ఆసక్తికర సీన్ కనిపించింది. ఓ లారీ డ్రైవర్‌కు పోలీసులు బ్రీత్ ఎనలైజర్‌తో టెస్ట్ చేశారు.. మనోడి రీడింగ్ చూసి పోలీసులు అవాక్కయ్యారు.. మరి ఆ రేంజ్‌లో ఉంది మనోడి తాగుడు.



మూడు రోజుల క్రితం నేషనల్ హైవే 16పై ప్రకాశం జిల్లా సీతారామపురం కోస్టల్ సెంటర్‌లో పోలీసులు వాహనాలు తనిఖీ చేపట్టారు. ఈలోపు అటువైపుగా లారీలో తూగుతూ వస్తున్న ఓ డ్రైవర్‌ను ఆపారు..బ్రీత్ ఎనలైజర్‌తో టెస్ట్ చేయగా ఆల్కహాల్ రీడింగ్ చూసి పోలీసులు బిత్తరపోయారు. అమ్మో ఏకంగా 398.1/100 రావడంతో అవాక్కయ్యారు.. ఎంత తాగావురా నాయనా అనుకుంటూ అతడ్ని అదుపులోకి తీసుకున్నారు. డ్రంక్ అండ్ డ్రైవ్‌లో దొరికిపోయిన లారీ డ్రైవర్‌ను రాజస్థాన్‌కు చెందిన సమీన్‌గా గుర్తించారు. వెంటనే అతడ్ని అక్కడి నుంచి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అతడ్ని మంగళవారం ఒంగోలు 2వ క్లాస్ మెజిస్ట్రేట్ ముందు హాజరుపరచగా.. పది రోజుల జైలు శిక్ష విధించారు న్యాయమూర్తి. హైవేపై మద్యం తాగి వాహనాలు నడిపితే జైలుశిక్ష తప్పదని పోలీసులు హెచ్చరించారు.

సాధారణంగా డ్రంక్ అండ్ డ్రైవ్‌లో బ్రీత్ ఎనలైజర్ రీడింగ్ చూసిన సమయంలో 40/100.. మరీ ఎక్కువ తాగితే 120/100 వంటి రీడింగులు వస్తుంటాయి. కానీ మనోడి రీడింగ్ మాత్రం దాదాపుగా 400కు టచ్ అయ్యింది. ఆరు బీర్లు లేదా ఓ ఫుల్ బాటిల్ మద్యం తాగినా అంత రీడింగ్ రాదని పోలీసులు చర్చించుకున్నారట. ఈ రాజస్థాన్ డ్రైవర్ ఏకంగా నేషనల్ హైవేపై ఈ రేంజ్‌లో మద్యం సేవించి లారీ ఎలా నడపాడనే చర్చ జరుగుతోంది.. మొత్తానికి లారీ డ్రైవర్ డ్రంక్ అండ్ డ్రైవ్ ఎపిసోడ్ చర్చనీయాంశం అయ్యింది.

# సంతకం చేసి 2260 ఖాళీలకే ఉత్తర్వులు జారీ చేశారా..

**ఆంధ్రప్రదేశ్** ఆంధ్రప్రదేశ్‌లో స్పెషల్ డీఎస్సీకి సంబంధించి ఇటీవలె చంద్రబాబు సర్కార్ ఉత్తర్వులు జారీ చేసింది. అయితే మెగా డీఎస్సీ అంటూ 16 వేలకుపైగా ఖాళీలు భర్తీ చేస్తామంటూ కూటమి సర్కార్ చెప్పి.. కేవలం 2 వేలకుపైగా పోస్టులకు మాత్రమే ఉత్తర్వులు జారీ చేసిందంటూ సోషల్ మీడియాలో కొందరు నెటిజన్లు ట్రోల్స్ చేస్తున్నారు. ఈ నేపథ్యంలోనే అసలు నిజం ఏంటి. ఏపీ సర్కార్ నిజంగానే 2 వేలకుపైగా పోస్టులకే ఉత్తర్వులు ఇచ్చిందా. అసలు డీఎస్సీ ఉత్తర్వులకు సంబంధించి నిజానిజాలేంటీ అనేది ఈ స్టోరీలో చూద్దాం.

అధికారంలోకి రాగానే ఆంధ్రప్రదేశ్‌లో ఉన్న టీచర్ ఖాళీల భర్తీ కోసం మెగా డీఎస్సీ ప్రకటిస్తామని టీడీపీ-జనసేన-బీజేపీ నేతృత్వంలోని ఎన్డీఏ కూటమి ఏపీ అసెంబ్లీ ఎన్నికలకు ముందు నుంచి హామీ ఇస్తూ వస్తోంది. అయితే అధికారంలోకి వచ్చిన తర్వాత ఎన్నికల హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తోంది చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం. ఈ క్రమంలోనే ఏపీలో 2,260 స్పెషల్ ఎడ్యుకేషన్ టీచర్ల భర్తీకి ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్రంలోని జిల్లాల వారీగా ఖాళీ పోస్టుల వివరాలతో ఉత్తర్వులు కూడా జారీ చేసింది. వీటిలో 1124 స్కూల్ అసిస్టెంట్, 1136 ఎస్‌జీటీ పోస్టులు ఉన్నాయి.

# ఏపీలో మరికొందరు ఉద్యోగుల తొలగింపు.. ఈ నెలతో వారందరు కట్, ప్రభుత్వం సంచలన నిర్ణయం

**ఆంధ్రప్రదేశ్:** ప్రభుత్వం ఫైబర్ నెట్ ఉద్యోగుల తొలగింపులో మరో సంచలన నిర్ణయం తీసుకుంది. గత ప్రభుత్వ హయాంలో సూర్య ఎంటర్‌ప్రైజెస్ ద్వారా నియమితులైన దాదాపు 500 మంది ఉద్యోగులను తొలగించింది. గతంలో ఫైబర్ నెట్‌లో అవినీతి జరిగిందనే ఆరోపణల నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకుంది. ఛైర్మన్ జీవీరెడ్డి రాజీనామా, ఎండీ బదిలీ తర్వాత ఉద్యోగుల తొలగింపు కొనసాగుతోంది. త్వరలో కొత్త నియామకాలు చేపట్టే అవకాశం ఉంది.

**ఏపీలో మరోసారి ఉద్యోగుల తొలగింపు**

**తాజాగా మరికొందర్ని తొలగిస్తూ నిర్ణయం**

**ఈ నెలతో వారందరు కట్.. వివరాలివే**

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఫైబర్ నెట్ విషయంలో మరోసారి సంచలన నిర్ణయం తీసుకుంది. తాజాగా మరోసారి ఉద్యోగుల్ని భారీగా తొలగించింది. ఈసారి దాదాపు 500 మంది ఉద్యోగులను తొలగిస్తూ నిర్ణయించారు. గత ప్రభుత్వ హయాంలో సూర్య ఎంటర్‌ప్రైజెస్ ద్వారా నియమితులైన ఉద్యోగులకు వారిని తొలగించనున్నారు. ఈ నెలాఖరుతో వారి ఉద్యోగాల గడువు ముగియనుంది.. వారి కాంట్రాక్టును పొడిగించబోమని క్లారిటీ ఇచ్చారు. గత ప్రభుత్వ హయాంలో ఫైబర్ నెట్‌లో అవినీతి, అక్రమాలు జరిగాయనే ఆరోపణలు రావడంతో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఆరా తీసింది.. విజిలెన్స్ విచారణకు ఆదేశించింది. అంతేకాదు ఇటీవల 248మందిని తొలగించారు.



గత ప్రభుత్వ హయాంలో వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధులు, నేతలు చెప్పిన వారందరినీ ఫైబర్ నెట్‌లో ఉద్యోగాలు ఇచ్చినట్లు ఆరోపణలు వచ్చాయి. అయితే వీరిలో ఎక్కువమంది ఉద్యోగుల్ని రాయలసీమ జిల్లాకు సంబంధించిన వారిని తీసుకున్నారనే టాక్ వచ్చింది. వీరిలో చాలామంది ఉద్యోగులు కార్యాలయానికి రాకుండానే జీతాలు తీసుకునేవారనే ఆరోపణలు వచ్చాయి. ఆ వెంటనే దీనిపై కూటమి ప్రభుత్వం దృష్టి పెట్టింది. 2014-2019 మధ్య అధికారంలో ఉన్న టీడీపీ ప్రభుత్వం తక్కువ ధరకే కేబుల్, నెట్, ఫోన్ సేవలను అందించింది.. ప్రజల నుంచి మంచి రెస్పాన్స్ వచ్చింది.. ఎంతోమంది కనెక్షన్లు తీసుకున్నారు. కానీ గత ప్రభుత్వం వచ్చిన తర్వాత ఏపీ ఫైబర్ నెట్ విషయంలో విమర్శలువచ్చాయి.. అలాగే ఏపీ ఫైబర్ నెట్ అప్పుల్లో కూరుకుపోయిందని కూటమి ప్రభుత్వంలోని పార్టీలు ఆరోపించాయి. అలాగే ఫైబర్ నెట్ కనెక్షన్లు కూడా తగ్గిపోయాయనే విమర్శలు వచ్చాయి.

అయితే గత ప్రభుత్వంలో నియమితులైన ఉద్యోగులు ఉండటంతో కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వా తీసుకున్న నిర్ణయాలు అమలు కాలేదు. దీంతో ప్రభుత్వం అక్రమాలపై విచారణకు ఆదేశించింది. గత ప్రభుత్వ హయాంలో నియమితులైన ఉద్యోగులు ఆఫీసుకు కూడా వెళ్లకుండా జీతాలు తీసుకునేవారని విచారణలో తేలడంతో వారందరినీ తొలగించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇప్పటికే రెండు, మూడుసార్లు పలువుర్ని తొలగించగా.. తాజాగా మరో 500 మంది ఉద్యోగులను తొలగించారు. ఆ స్థానాల్లో కొత్తగా ఉద్యోగ నియామకాలు చేపట్టే అవకాశం ఉందంటున్నారు.

అలాగే ఇటీవల ఫైబర్ నెట్ సంస్థకు ఛైర్మన్‌గా ఉన్న జీవీరెడ్డి తన పదవికి రాజీనామా చేశారు. గత ప్రభుత్వ హయాంలో జరిగిన అవినీతి, ఉద్యోగుల నియామకాల విషయంలో సంస్థ ఎండీ తీరుపై జీవీరెడ్డి అభ్యంతరం వ్యక్తం చేశారు. ఆ తర్వాత ఎపిసోడ్ ముఖ్యమంత్రి చంద్రబాబు దగ్గరకు చేరింది.. దీంతో జీవీరెడ్డి రాజీనామా, ఆ సంస్థ ఎండీగా ఉన్న దినేష్ కుమార్‌ను బదిలీ చకచకా జరిగిపోయాయి.. ఆ తర్వాత ఆ సంస్థలో ఉద్యోగుల తొలగింపు కొనసాగుతోంది.



## పార్లమెంట్‌లో తెలంగాణ ఎంపీల అటెండెన్స్..

తెలంగాణ ఎంపీల పార్లమెంటు హాజరు, ప్రశ్నలు, చర్చల్లో పాల్గొనడంపై ఆసక్తికర వివరాలు వెల్లడయ్యాయి. కాంగ్రెస్ ఎంపీ చామల కిరణ్ కుమార్ 100 శాతం హాజరుతో టాప్‌లో ఉన్నారు. బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ అత్యధికంగా 80 ప్రశ్నలు అడిగారు. ఎంఐఎం ఎంపీ అసదుద్దీన్ ఓవైసీ 21 చర్చలతో ఆ విషయంలో టాప్‌లో నిలిచారు. నల్గొండ ఎంపీ రఘువీర్ రెడ్డి మాత్రం అతి తక్కువ హాజరు, ప్రశ్నలు, చర్చలతో చివరి ప్లేస్‌లో నిలిచారు.

ప్రజాస్వామ్య వ్యవస్థలో పార్లమెంట్ సమావేశాలు కీలకమైనవి. ఇవి చట్టాలను రూపొందించడానికి, ప్రభుత్వం జవాబుదారీతనాన్ని కలిగి ఉండటానికి, ప్రజల సమస్యలను చర్చించటానికి పార్లమెంట్ ముఖ్య వేదిక. పార్లమెంట్ సమావేశాలలో దేశంలోని ముఖ్యమైన సమస్యలు, సామాజిక అంశాలు, ఆర్థిక పరిస్థితులు, ఇతర జాతీయ ప్రాముఖ్యత కలిగిన విషయాలపై సభ్యుల మధ్య చర్చలు జరుగుతాయి. దీని ద్వారా ప్రజల అభిప్రాయాలు ప్రభుత్వానికి తెలుస్తాయి. భుత్వ విధానాలు, చర్యలపై సభ్యులు తమ అభిప్రాయాలను వ్యక్తం చేస్తారు. పార్లమెంట్ సభ్యులు సభ కార్యకలాపాల్లో చురుగ్గా పాల్గొనటంతో పాటు చట్టాలు రూపొందించడం, ప్రభుత్వ విధానాలపై చర్చించడం వంటి ముఖ్యమైన విధులను నిర్వర్తించడం చాలా ముఖ్యం.

తెలంగాణ నుంచి 17 మంది ఎంపీలు ప్రాతినిధ్యం వహిస్తున్న సగంతి తెలిసిందే. కాంగ్రెస్ నుంచి 8 మంది ఎంపీలు, బీజేపీ నుంచి 8 మంది, ఎంఐఎం నుంచి ఒకరు ఎంపీగా ప్రాతినిధ్యం వహిస్తున్నారు. అయితే పార్లమెంట్ సమావేశాలకు తెలంగాణ ఎంపీల హాజరు శాతం, అడిగిన ప్రశ్నలు, చర్చల్లో పాల్గొనటంపై ఆసక్తికర వివరాలు వెల్లడయ్యాయి. జూన్ 2024 నుంచి 4 ఏప్రిల్ 2025 మధ్య పార్లమెంట్ సమావేశాలకు కాంగ్రెస్ ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి 100 శాతం హాజరయ్యారు. ఆ తర్వాత బీజేపీ ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి 95 శాతం హాజరు నమోదు చేశారు. మరో బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ అత్యధికంగా 80 ప్రశ్నలు వేసి 91 శాతం సమావేశాలకు హాజరయ్యారు. ఎంఐఎం ఎంపీ అసదుద్దీన్ ఓవైసీ చర్చల్లో టాప్‌లో ఉన్నారు. ఆయన 21 చర్చల్లో పాల్గొన్నారు. నల్గొండ ఎంపీ రఘువీర్ అతి తక్కువ హాజరుతో పాటుగా.. తక్కువ ప్రశ్నలు, చర్చల్లో పాల్గొన్నారు.

## అదే నిజమైతే సీఎస్ జైలుకు వెళ్లాల్సిందే



హైదరాబాద్ కంచ గచ్చిబౌలి భూముల వ్యవహారంపై సుప్రీంకోర్టులో నేడు (ఏప్రిల్ 16) విచారణ జరిగింది. ఈ సందర్భంగా జస్టిస్ బీఆర్ గవాయ్ నేతృత్వంలోని ధర్మాసనం ఘాటు వ్యాఖ్యలు చేసింది. సుప్రీంకోర్టు మార్గదర్శకాలకు ఏమాత్రం విరుద్ధంగా వ్యవహరించినా ఊరుకునేది లేదని ధర్మాసనం హెచ్చరించింది. హైదరాబాద్ కంచ గచ్చిబౌలి భూముల వివాదంపై సుప్రీంకోర్టులో నేడు విచారణ జరిగింది. ఈ భూముల్లో చెట్లు నరికివేయడంపై దేశ అత్యున్నత న్యాయస్థానం సీరియస్ అయింది. చెట్ల పునరుద్ధరణకు ప్రణాళికతో రావాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. పర్యావరణ పరిరక్షణలో రాజీపడే ప్రసక్తి లేదని తేల్చి చెప్పింది. తదుపరి విచారణను మే 15కు వాయిదా వేసింది.

జస్టిస్ బీఆర్ గవాయి, జస్టిస్ అగస్టిన్ జార్జ్ మసీహ్‌లతో కూడిన ధర్మాసనం ఈ కేసును నేడు విచారించింది. చెట్లను ఇష్టానుసారంగా నరికివేయడాన్ని సమర్థించుకోవడం సరికాదని ప్రభుత్వానికి చురకలంటించింది. చెట్ల పునరుద్ధరణపై రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ఒక ప్రణాళికతో రావాలని కోర్టు ఆదేశించింది. చెట్లు కొట్టేసే ముందు 1996లో సుప్రీంకోర్టు ఇచ్చిన మార్గదర్శకాల ప్రకారం ముందస్తు అనుమతులు తీసుకున్నారా? లేదా? స్పష్టంగా చెప్పాలంది. అనుమతులు తీసుకోకుండా చెట్లు కొట్టివేసినట్లు తేలితే తెలంగాణ సీఎస్ సహా సంబంధిత అధికారులు జైలుకు వెళ్లాల్సి వస్తుందని హెచ్చరించింది. వారిని కాపాడాలనుకుంటే.. విధ్వంసం సృష్టించిన 100 ఎకరాలను ఎలా పునరుద్ధరిస్తారో చెప్పాలని ప్రభుత్వాన్ని కోరింది. చెట్ల పునరుద్ధరణను వ్యతిరేకిస్తే.. ఆ భూముల్లోనే తాత్కాలిక జైలును కట్టి వారిని అందులోకి పంపుతామని ధర్మాసనం హాట్ కామెంట్స్ చేసింది. కోర్టు నోటీసు లేకుండా వివాదాస్పద భూమిలో ఒక్క చెట్టు కూడా నరకొద్దని ఆదేశించింది. తీర్పు వెలువరించిన తర్వాత కూడా ఆ ప్రాంతంలో బుల్డోజర్లు ఎందుకున్నాయని ప్రశ్నించింది. ప్రభుత్వం తరఫు న్యాయవాది కోర్టుకు సమాధానమిస్తూ.. ప్రతిపక్షాలు ఫేక్ వీడియోలతో ప్రభుత్వంపై సోషల్ మీడియాలో దుష్ప్రచారం చేశాయని తెలిపారు. కొన్ని మినహాయింపులకు లోబడే చెట్లను తొలగించామని చెప్పారు. ప్రస్తుతం ఆ భూముల్లో అన్ని పనులు నిలిపివేశామని, భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూసుకుంటామని కోర్టుకు విన్నవించారు.

వాదనలు విన్న ధర్మాసనం కంచ గచ్చిబౌలి భూములపై స్టేటస్ కో కొనసాగుతుందని తెలిపింది. తదుపరి విచారణను మే 15కు వాయిదా వేసింది. భూముల్లో పర్యావరణాన్ని ఎలా పునరుద్ధరిస్తారు..? ఎంత కాలంలో పూర్తి చేస్తారు..? జంతువులను ఎలా సంరక్షిస్తారు..? అనే అంశాలపై ప్రణాళికను 4 వారాల్లోగా సమర్పించాలని కోర్టు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది.

# ఇంకుడు గుంతలు లేని వారికి తీపికబురు..

గ్రేటర్ హైదరాబాద్‌లో ఇంకుడు గుంతలు నిర్మించని వారికి ట్యాంకర్లపై రెట్టింపు ఛార్జీల వసూలు నిర్ణయాన్ని వాటర్ బోర్డు వాయిదా వేసింది. గత ఏడాది అధిక ట్యాంకర్ బుకింగ్‌లు జరిగిన ప్రాంతాల్లో సర్వే చేసి.. ఇంకుడు గుంతలు లేకపోవడమే కారణమని గుర్తించారు. ప్రభుత్వం నుండి స్పందన లేకపోవడం.. ఈ ఏడాది నిర్మించిన గుంతల ఫలితం వెంటనే తెలియకపోవడంతో ఈ నిర్ణయం వచ్చే ఏడాదికి వాయిదా పడింది. దీనికి సంబంధించి పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి.



గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో నీటి సంరక్షణ చర్యలను ప్రోత్సహించేందుకు జలమండలి గతంలో తీసుకున్న కీలక నిర్ణయం వాయిదా పడింది. ఇంకుడు గుంతలు నిర్మించుకోని ఇళ్లకు వేసవిలో నీటి ట్యాంకర్లు బుక్ చేసుకుంటే రెట్టింపు ఛార్జీలు వసూలు చేయాలనే ప్రతిపాదనను జలమండలి ప్రస్తుతానికి అమలు చేయడం లేదు. గత వేసవిలో కొన్ని ప్రత్యేక ప్రాంతాల నుండి నీటి ట్యాంకర్ల కోసం భారీ సంఖ్యలో అభ్యర్థనలు రావడంతో జలమండలి లోతుగా విచారణ చేపట్టింది. ఆ సర్వేలో.. చాలా ఇళ్లలో ఇంకుడు గుంతలు లేకపోవడం వల్లే బోర్లు త్వరగా ఎండిపోయి, ప్రజలు ట్యాంకర్లపై ఆధారపడుతున్నారని గుర్తించారు.

దీనిని నివారించడానికి.. జలమండలి ప్రజలకు ఇంకుడు గుంతల ప్రాముఖ్యతను తెలియజేస్తూ వాటిని నిర్మించుకోవాలని సూచించింది. అంతేకాకుండా.. సూచనలను పట్టించుకోని వారు వేసవిలో ట్యాంకర్లు బుక్ చేసుకుంటే రెట్టింపు ఛార్జీలు వసూలు చేయాలని నిర్ణయించింది. గత సంవత్సరం నమోదైన ట్యాంకర్ బుకింగ్‌ల సరళిని పరిశీలించిన జలమండలి.. ఈసారి కూడా అవే ప్రాంతాల నుండి అధిక సంఖ్యలో అభ్యర్థనలు వస్తున్నట్లు గుర్తించింది.

దీంతో రెట్టింపు ఛార్జీల వసూలుకు అనుమతి ఇవ్వాలని కోరుతూ ప్రభుత్వానికి నివేదిక కూడా సమర్పించింది. అయితే.. ప్రభుత్వం నుండి సానుకూల స్పందన రాకపోవడం.. ఈ ఏడాది నిర్మించుకున్న ఇంకుడు గుంతల వల్ల వెంటనే ప్రయోజనం ఉండకపోవచ్చనే అభిప్రాయంతో.. ఈ నిర్ణయాన్ని వచ్చే ఏడాది వేసవి నుండి అమలు చేయాలని జలమండలి భావిస్తోంది. దీని ఫలితంగా.. ఈ వేసవిలో ట్యాంకర్లు బుక్ చేసుకునే వారందరికీ సాధారణ ఛార్జీలే వర్తిస్తాయి.

గ్రేటర్ హైదరాబాద్‌లో పశ్చిమ ప్రాంతంలోనే బోర్లు ఎక్కువగా ఎండిపోతున్నాయి. కూకట్‌పల్లి, శేరిలింగంపల్లి, మియాపూర్, ఎస్ఆర్ నగర్, కుత్బుల్లాపూర్, హైటెక్ సిటీ, ఐటీ కారిడార్ వంటి ప్రాంతాల నుండి నీటి ట్యాంకర్ల కోసం అధిక సంఖ్యలో అభ్యర్థనలు వచ్చాయి. జలమండలి సేకరించిన వివరాల ప్రకారం.. దాదాపు 42 వేల మంది వినియోగదారులు ఉండగా.. వీరిలో 90 శాతం మంది పశ్చిమ నగర ప్రాంతానికి చెందినవారే ట్యాంకర్లు బుక్ చేసుకుంటున్నారు. జలమండలి అధికారులు ఈ ఇళ్లను సందర్శించి.. ఇంకుడు



గుంతలు లేని 17 వేల మందికి నోటీసులు జారీ చేశారు. ఈ సందర్భంగా వారికి ఇంకుడు గుంతల ఆవశ్యకతను వివరిస్తూ కౌన్సెలింగ్ కూడా ఇచ్చారు. దీంతో దాదాపు ఐదు వేల మంది ఇంకుడు గుంతలు నిర్మించుకున్నారు. ఇంకుడు గుంతలు నిర్మించుకోని వారిపై ఒత్తిడి పెంచే ప్రయత్నంలో భాగంగా.. ట్యాంకర్ బుకింగ్‌లపై రెట్టింపు ఛార్జీలు విధిస్తామని జలమండలి హెచ్చరించింది. అయితే.. ప్రస్తుతం నిర్మించిన ఇంకుడు గుంతలు ఏ మేరకు ప్రభావవంతంగా పనిచేస్తున్నాయనేది వచ్చే వర్షాకాలంలో తెలుస్తుంది. దీనితో పాటు ప్రభుత్వం నుండి కూడా స్పష్టమైన ఆదేశాలు లభించకపోవడంతో.. ఈ ఏడాది ట్యాంకర్ల బుకింగ్‌పై అదనపు ఛార్జీల వసూలు నిర్ణయాన్ని ప్రస్తుతానికి వాయిదా వేస్తున్నట్లు అధికారులు తెలిపారు.

# భూ భారతి మార్గదర్శకాలు విడుదల..

తెలంగాణ ప్రభుత్వం మెరుగైన భూ పరిపాలన కోసం భూ భారతి చట్టాన్ని అమలులోకి తెచ్చింది. ముందుగా నాలుగు మండలాల్లో పైలట్ ప్రాజెక్టు చేపడుతోంది. భూ రికార్డుల తయారీ, మార్పులు, నిర్వహణ ఈ చట్టం కింద జరుగుతాయి. దరఖాస్తు చేసుకున్న 60 రోజుల్లో సమస్య పరిష్కారం.. ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్, సాదా బైనామాల క్రమబద్ధీకరణ, వారసత్వ భూముల హక్కులు, మ్యుటేషన్‌కు 30 రోజుల గడువు.. భూదార్ కార్డుల జారీ, కొత్త పాసుపుస్తకాల జారీ వంటి అనేక అంశాలు ఇందులో ఉన్నాయి. అప్పీళ్లు , రివిజన్‌కు కూడా అవకాశం ఉంది. పేద రైతులకు ఉచిత న్యాయ సహాయం లభిస్తుంది.

రాష్ట్రంలో భూ పరిపాలనను మరింత మెరుగుపరచాలనే లక్ష్యంతో తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా భూ భారతి చట్టాన్ని తీసుకువచ్చింది. ఈ నూతన చట్టం సమగ్ర అమలుకు ముందు.. ప్రభుత్వం ఒక వ్యూహాత్మక అడుగు వేసింది. రాష్ట్రంలోని నాలుగు వేర్వేరు మండలాలను ఎంపిక చేసి.. అక్కడ పైలట్ ప్రాజెక్టును ప్రారంభించనున్నట్లు ప్రకటించింది. ఈ పైలట్ ప్రాజెక్టు కోసం నారాయణపేట జిల్లాలోని మద్దూరు, ఖమ్మం జిల్లాలోని నేలకొండపల్లి, ములుగు జిల్లాలోని వెంకటాపూర్, కామారెడ్డి జిల్లాలోని లింగంపేట మండలాలను ఎంపిక చేశారు.

ప్రభుత్వం చట్టం ప్రకారం అన్నీ జరుగుతాయని స్పష్టం చేస్తున్నప్పటికీ.. ఈ పైలట్ ప్రాజెక్ట్ ఆవశ్యకతపై పలు చర్చలు జరుగుతున్నాయి. అయితే.. అధికారులు ఈ సందేహాలకు సమాధానమిస్తూ, గ్రామ స్థాయిలో ఉన్న భూ సంబంధిత సమస్యలను క్షుణ్ణంగా తెలుసుకోవడానికి, చట్టం అమలులో ఎదురయ్యే సవాళ్లను ముందుగానే గుర్తించడానికి ఈ ప్రాజెక్ట్ ఉపయోగపడుతుందని తెలిపారు. ఎంపిక చేసిన మండలాల్లో.. ఈ నెల 17వ తేదీ నుండి రెవెన్యూ అధికారులు ప్రతి రైతు నుండి స్వయంగా దరఖాస్తులను స్వీకరిస్తారు. ఈ దరఖాస్తులను కూలంకషంగా అధ్యయనం చేస్తారు. ఆ తర్వాత.. మే ఒకటో తేదీ నుండి ప్రతి జిల్లా నుండి ఒక మండలాన్ని ఎంపిక చేసి.. అక్కడ పైలట్ ప్రాజెక్టును ఒక అధ్యయనంగా చేపట్టి.. దాని ఫలితాలను విశ్లేషిస్తారు. ఈ ప్రక్రియ పూర్తయిన తర్వాత.. జూన్ ఒకటో తేదీ నుండి రాష్ట్ర వ్యాప్తంగా రెవెన్యూ సదస్సులు నిర్వహించనున్నారు. ఈ సదస్సుల ద్వారా అన్ని గ్రామాల్లోని భూ సమస్యలను గుర్తించి.. వాటి పరిష్కారానికి కృషి చేయనున్నారు.

ఈ నేపథ్యంలో.. భూమి రిజిస్ట్రేషన్ ప్రక్రియను సులభతరం చేయడం.. రిజిస్ట్రేషన్ చేసిన వెంటనే భూమికి సంబంధించిన పట్టాదారు పాసుపుస్తకం జారీ చేయడం.. భూమి క్రయ విక్రయాల వివరాలను తక్షణమే ఆన్‌లైన్‌లో మార్చడం వంటి అనేక ముఖ్యమైన అంశాలతో కూడిన భూ భారతి చట్టం మార్గదర్శకాలను ప్రభుత్వం మంగళవారం విడుదల చేసింది. ఈ మార్గదర్శకాలతో పాటు.. చట్టం అమలును అధికారికంగా ప్రకటిస్తూ రెవెన్యూ శాఖ ముఖ్య కార్యదర్శి నవీన్‌మిత్తల్ వేర్వేరుగా జీవో నం: 36, 39 లను జారీ చేశారు. జీవో 36 ప్రకారం.. భూ భారతి చట్టం ఏప్రిల్ 14, 2025 నుండి రాష్ట్రంలో అధికారికంగా అమల్లోకి వచ్చింది.




జీవో 39 ద్వారా చట్టం సమగ్ర మార్గదర్శకాలను విడుదల చేశారు. చట్టం అమల్లో ఉన్న ప్రతి ప్రాంతానికి ఈ నిబంధనలు వర్తిస్తాయి. భూ భారతి చట్టం కింద.. ప్రతి గ్రామంలో ఉన్న అన్ని రకాల భూములకు సంబంధించిన రికార్డుల తయారీ.. వాటిలో మార్పులు, వాటి నిర్వహణ జరుగుతుంది. ఈ రికార్డులన్నింటినీ ఎప్పటికప్పుడు భూ భారతి పోర్టల్‌లో ప్రజలందరికీ అందుబాటులో ఉంచుతారు. ఒకవేళ భూ రికార్డుల్లో ఏమైనా తప్పులు దొర్లినా లేదా హక్కుల రికార్డులో తమ వివరాలు లేకపోయినా.. సంబంధిత వ్యక్తులు ఈ చట్టం అమల్లోకి వచ్చిన ఒక సంవత్సరం లోపు నిర్దేశిత రుసుము చెల్లించి భూ భారతి పోర్టల్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు. వారు తమ దరఖాస్తుకు మద్దతుగా ప్రభుత్వం గతంలో జారీ చేసిన పాసుపుస్తకాలు, టైటిల్ డీడ్స్, పహాణీలు లేదా రిజిస్టర్ డాక్యుమెంట్లు, ఇతర సంబంధిత పత్రాలతో పాటు ఒక అఫిడవిట్‌ను కూడా జత చేయాల్సి ఉంటుంది.

## సూర్యాపేట జిల్లాలో విషాదం.. ఆటో బోల్తా..

సూర్యాపేట జిల్లాలో మిరప కూలీలతో వెళ్తున్న ఆటో బోల్తా పడటంతో మాదరబోయిన యాదమ్మ అనే మహిళ మృతి చెందింది. మరో పది మందికి తీవ్ర గాయాలయ్యాయి. కుక్క అడ్డు రావడంతో ఆటో అదుపుతప్పి పల్టీ కొట్టింది. యాదమ్మ మరణంతో ఆమె కుటుంబ సభ్యుల వేదన వర్ణనాతీతంగా మారింది. ఆమె భర్త, పిల్లల ఆర్తనాదాలు ఆ ప్రాంతాన్నంతా కలచివేస్తున్నాయి. ఆటోలో ఉన్న మిగతా పది మంది తీవ్రంగా గాయపడటంతో వారిని వెంటనే సూర్యాపేట జిల్లా ఏరియా ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.

పొద్దుపొద్దున్నే లేచి.. తమ పిల్లల ఆకలి తీర్చడానికి.. రేపటి రోజును నెట్టుకురావడానికి ఊరిలో పనులు వెతుక్కునే నిరుపేదలు వాళ్ళు. కొందరు పత్తి చేనుకు కూలికి వెళ్తుంటారు.. మరికొందరు మిరప తోటలో కాయలు కోసేందుకు పరుగులు తీస్తారు. తమ ఊళ్లో పని దొరికితే నడుచుకుంటూ వెళ్తారు.. కానీ వేరే ఊరికి వెళ్లాలంటే మాత్రం ఒక గుంపుగా చేరి.. ఆటోనో




లేక ట్రాక్టరో ఎక్కి వెళ్తుంటారు. రోజు కూలి చేస్తేనే కడుపు నిండే ఆ బతుకుల్లో.. ఊహించని విషాదం ఒక కుటుంబాన్ని కకావికలం చేసింది. సూర్యాపేట జిల్లాలో కూలి పనికి వెళ్తున్న ఆటో బోల్తా పడటంతో ఒక నిండు ప్రాణం గాలిలో కలిసిపోయింది.

మిరపకాయలు తెంపడానికి ఉదయాన్నే నవ్వుతూ వెళ్లిన ఆ తల్లి.. సాయంత్రానికి తిరిగిరాని లోకాలకు వెళ్లిపోవడంతో ఆ కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి. ఆ ఊరంతా ఒక్కసారిగా విషాద ఛాయలు అలుముకున్నాయి. సూర్యాపేట జిల్లా ఆత్మకూరు మండలం కోట పహాడ్ వద్ద మిరప కూలీలతో వెళ్తున్న ఆటో అదుపుతప్పి బోల్తా పడింది. టేకుమట్ల గ్రామానికి చెందిన కూలీలు బొప్పారంలో మిరపకాయలు తెంపడానికి ఆటోలో బయలుదేరారు.

కానీ.. కోటపాడు ఊరి సమీపంలోకి రాగానే.. హఠాత్తుగా ఒక కుక్క అడ్డు రావడంతో.. దానిని తప్పించబోయిన డ్రైవర్ ఒక్కసారిగా ఆటోను తిప్పాడు. క్షణాల్లో అదుపుతప్పిన ఆటో భయంకరంగా పల్టీలు కొట్టింది. ఆటోలో ఉన్న కూలీలందరికీ తీవ్ర గాయాలయ్యాయి. ఈ ప్రమాదంలో మాదరబోయిన యాదమ్మ అనే మహిళ తలకు బలమైన గాయం తగలడంతో అక్కడికక్కడే ప్రాణాలు విడిచింది. యాదమ్మ మరణంతో ఆమె కుటుంబ సభ్యుల వేదన వర్ణనాతీతంగా మారింది. ఆమె భర్త, పిల్లల ఆర్తనాదాలు ఆ ప్రాంతాన్నంతా కలచివేస్తున్నాయి. ఆటోలో ఉన్న మిగతా పది మంది తీవ్రంగా గాయపడటంతో వారిని వెంటనే సూర్యాపేట జిల్లా ఏరియా ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నా రు. వారిలో కొందరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలుస్తోంది. ఈ ప్రమాదానికి సంబంధించిన పూర్తి వివరాలు ఇంకా తెలియాల్సి ఉంది. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

# ఉస్మానియాలో ఇంత మంచి వైద్యమా..? డాక్టర్లను జన్మలో మరిచిపోలేం..

తెలంగాణ వైద్యారోగ్య రంగంలో గణనీయమైన వృద్ధిని సాధించింది. హైదరాబాద్ అయితే ప్రపంచానికి మెడికల్ హబ్‌గా మారింది. దేశ, విదేశాల నుంచి రోగులు నగరానికి వచ్చి ట్రీట్‌మెంట్ చేయించుకుంటున్నారు. అయితే ప్రైవేటు హాస్పిటల్స్‌లో అత్యాధునిక సౌకర్యాలు ఉన్నా.. ప్రభుత్వ ఆసుపత్రిల్లో సరైన సౌకర్యాలు ఉండవనే అపోహ ప్రజల్లో ఉంది. డాక్టర్ల నిర్లక్ష్యం, అపరిశుభ్రమైన పరిస్థితులు, సరైన నిర్వహణ లేకపోవటం, డాక్టర్ అపాయింట్‌మెంట్ కోసం, రిపోర్టుల కోసం ఎక్కువ గంటలు వేచి ఉండాల్సి వస్తోందనే ఫిర్యాదులు కూడా ఉన్నాయి. హైదరాబాద్ ఉస్మానియా హాస్పిటల్, గాంధీ వంటి ఆసుపత్రుల్లో రోగులకు సరైన వైద్య సేవలందవనే చెడ్డ పేరు ఉంది.అయితే ఎక్కడో ఓ చోట అలాంటి పరిస్థితులు ఉన్నా.. కొన్ని ప్రభుత్వ ఆసుపత్రుల్లో మాత్రం మెరుగైన వైద్య సేవలు అందుతున్నాయి. తాజాగా ఉస్మానియా ఆసుపత్రి, అక్కడ అందుతున్న వైద్య సేవలు, డాక్టర్ల పనితీరుపై రవితేజ అనే ఏపీ యువకుడు ఎమోషనల్ ట్వీట్ చేశారు. తమ బంధువుల యువకుడు అనారోగ్యానికి గురి కాగా.. సత్వరమే స్పందించి ఉస్మానియా ఆసుపత్రి డాక్టర్లు మెరుగైన వైద్య సేవలు అందించారని కొనియాడారు. పక్క రాష్ట్రం నుంచి వచ్చినా.. ఆలస్యం లేకుండా ట్రీట్‌మెంట్ అందించారన్నారు. అందుకు సంబంధించిన ట్వీట్ ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.

'ఉగాది రోజున హైదరాబాద్ నుంచి షిర్డీకి వెళ్లే ట్రైన్ రాత్రికి ఉందని.. హైదరాబాద్ చూద్దామని తిరుగుతూ ఉండగా రాయదుర్గ్ మెట్రో స్టేషన్‌లో మా అక్క కొడుక్కి ఒక్కసారిగా శ్వాస అందలేదు. ఏం చేయాలో తెలియని మేము కొండాపూర్ ఏరియా హాస్పిటల్‌కి వెళ్తే అక్కడి నుంచి ఉస్మానియా హాస్పిటల్‌కి రిఫర్ చేశారు, హాస్పిటల్‌లో డాక్టర్స్ త్వరగా స్పందించి, చేయించారు, పేగులో రంధ్రం ఉందని ఆపరేషన్ చేయాలని చాలా త్వరతగిన చేశారు. ప్రైవేట్ హాస్పిటల్ లాగే చూశారు. డాక్టర్స్ దయ వల్ల బ్రతికాడు. ఇంత మంచి వైద్యం అందించిన తెలంగాణ ప్రభుత్వానికి ప్రత్యేకమైన ధన్యవాదాలు.

ఎక్కడ కూడా పక్క రాష్ట్రం నుంచి వచ్చామని ట్రీట్‌మెంట్ ఆలస్యం చేయలేదు, వెంట వెంటనే టెస్టులు చేయించారు. రిజిస్ట్రేషన్ చేశారు. ఉస్మానియా జనరల్ హాస్పిటల్‌ను జన్మలో మరిచిపోలేం. ఎంత చెప్పిన తక్కువే అక్కడ డాక్టర్స్ గురించి. 108కి కాల్ చేయగానే నిమిషాలలో అంబులెన్స్ వచ్చింది. వెంటనే హాస్పిటల్‌కి తీసుకువెళ్ళకపోయి ఉంటే ఈరోజు పరిస్థితి వేరే లాగ ఉండేదేమో. డాక్టర్స్‌కి, అంబులెన్స్ డ్రైవర్, అక్కడ స్టాఫ్‌కి ఎలా కృతజ్ఞత చెప్పుకోవాలో కూడా తెలియడం లేదు.' అని ట్వీట్ చేశాడు.

ఈ ట్వీట్‌పై నెటిజన్లు తమ అభిప్రాయాన్ని కామెంట్లలో వెల్లడిస్తున్నారు. నిజంగా ఉస్మానియా హాస్పిటల్ డాక్టర్ల వైద్య సేవలు గొప్పవని అంటున్నారు. డాక్టర్లు స్పందించిన తీరుకు హ్యాట్సాప్ చెప్పాల్సిందం.

# వాహనదారులకు గుడ్‌న్యూస్..

**ఆ ప్రాంతంలో ట్రాఫిక్ రద్దీకి చెక్, త్వరలోనే..**

హైదరాబాద్ నగర వాహనదారులకు తీపి కబురు. త్వరలోనే రహ్మత్ నగర్ కూడలి ప్రాంతంలో ట్రాఫిక్ చిక్కులు తీరిపోనున్నాయి. ఈ మేరకు అధికారులు జంక్షన్ అభివృద్ధికి చర్యలు చేపట్టారు. రహదారి విస్తరణ కోసం తీసుకోవాల్సిన ఆస్తుల గుర్తింపు ప్రక్రియ పూర్తయింది. త్వరలోనే బాధితులకు పరిహారం ఇచ్చి పనులు ప్రారంభించాలని సర్కార్ భావిస్తోంది.

హైదరాబాద్ నగరవాసులను వేధిస్తున్న ప్రధాన సమస్య ట్రాఫిక్. కొన్ని ప్రాంతాల్లో అయితే సిగ్నల్ల వద్ద గంటల తరబడి వేచి చూడాల్సిన పరిస్థితి. ఈ నేపథ్యంలో రాష్ట్రప్రభుత్వం నగరంలో కొత్తగా ఫ్లైఓవర్లు, అండర్‌పాసులు, రహదారుల విస్తరణ, కొత్త రోడ్ల నిర్మాణ పనులు చేపట్టింది. ఇప్పటికే కొన్ని అందుబాటులోకి రాగా.. మరికొన్ని నిర్మాణ దశలో ఉన్నాయి. ఈ నేపథ్యంలో నగరవాసులకు సర్కార్ మరో శుభవార్త చెప్పింది. రహ్మత్‌నగర్ కూడలి ప్రాంతంలో ట్రాఫిక్ చిక్కులు తీరిపోనున్నాయి. కూడలి అభివృద్ధికి సర్కార్ సన్నాహాలు మొదలు పెట్టింది.



ప్రస్తుతం రహ్మత్ నగర్ కూడలి ప్రాంతం అత్యంత రద్దీగా ఉంటుంది. కార్మికనగర్, ఎస్పీఆర్‌హిల్స్ బస్తీ, మోతీనగర్, బోరబండ, హైటెక్ సిటీ,మాదాపూర్ వంటి ప్రాంతాలకు వెళ్లడానికి రహ్మత్ నగర్ కూడలి ఒక ముఖ్యమైన మార్గంగా ఉంది. దీని కారణంగా.. ఈ జంక్షన్‌లో నిత్యం వాహనాల రద్దీ ఉంటుంది. ఇక్కడ గ్రంథాలయం, హోటళ్లు, దుకాణాలు, ఒక మద్యం దుకాణం ఉండటం వల్ల బస్సుల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతోంది. ఉదయం, సాయంత్రం సమయాల్లో ట్రాఫిక్ పరిస్థితి మరింత దారుణంగా ఉంటుంది, తరచుగా ప్రమాదాలు జరుగుతున్నాయి. ఈ ప్రమాదాల్లో కొందరు ప్రాణాలు సైతం కోల్పోయారు. ఈ నేపథ్యంలో ట్రాఫిక్ రద్దీకి చెక్ పట్టేందుకు కూడలి అభివృద్ధికి రేవంత్ రెడ్డి ప్రభుత్వం సిద్ధమైంది.

రహదారి విస్తరణలో ఆస్తులు కోల్పోయే వారికి పరిహారం అందించేందుకు అధికారులు ఇప్పటికే పలుమార్లు సమావేశాలు నిర్వహించారు. ఆర్థిక ఇబ్బందుల దృష్ట్యా..పరిహారాన్ని చెక్కుల రూపంలో కాకుండా టీడీఆర్ (ట్రాన్స్ఫర్ ఆఫ్ డెవలప్‌మెంట్ రైట్స్) విధానంలో పొందేలా వారిని ఒప్పించే ప్రయత్నాలు చేస్తున్నారు. టీడీఆర్ వల్ల కలిగే అధిక ప్రయోజనాలను బాధితులకు వివరిస్తున్నారు. జంక్షన్ ఇంప్రూవ్‌మెంట్ ప్రాజెక్ట్‌లో భాగంగా ఆస్తులు కోల్పోయిన వారికి నగదు పరిహారం రెండు రెట్లు ఉంటే, టీడీఆర్ రూపంలో నాలుగు రెట్లు ఉంటుందని అధికారులు చెబుతున్నారు. ఇది చాలా లాభదాయకమని అధికారులు, రహదారి విస్తరణ నిపుణులు సమావేశాలు నిర్వహించి అవగాహన కల్పిస్తున్నారు. అధికారుల చర్యతో చాలా కాలంగా నిలిచిపోయిన రహదారి విస్తరణ ప్రక్రియలో ఇప్పుడు కొంత కదలిక కనిపిస్తోంది. త్వరలోనే బాధితులకు పరిహారం ఇచ్చి పనులు ప్రారంభిస్తామని అధికారులు చెబుతున్నారు. ఈ జంక్షన్ అభివృద్ధి జరిగితే ట్రాఫిక్ చిక్కులు తీరిపోనున్నాయి. ఆయా ప్రాంతాల్లో ఎటువంటి ఇబ్బందులు లేకుండా రాకపోకలు సాగించొచ్చు.




# విశ్వంభరకు స్పెషల్ అట్రాక్షన్‌గా రామరామ సాంగ్

టాలీవుడ్ స్టార్ యాక్టర్ చిరంజీవి కాంపౌండ్ నుంచి వస్తోన్న సోషియో ఫాంటసీ ప్రాజెక్ట్ విశ్వంభర బింబిసార ఫేం వశిష్ఠ మల్లిడి దర్శకత్వం వహిస్తున్నారు. ఈ మూవీలో త్రిష ఫీ మేల్ లీడ్ రోల్‌లో నటిస్తుండగా.. అమిగోస్ ఫేం ఆషికా రంగనాథ్, రమ్య పసుపులేటి, సురభి, ఈషా చావ్లా, ఆశ్రిత వేముగంటి నండూరి ఇతర కీలక పాత్రల్లో నటిస్తున్నారు. కాగా ఇటీవలే ఈ మూవీ నుంచి ఫస్ట్ సింగిల్ రమ రామను విడుదల చేశారని తెలిసిందే. ఈ పాటకు మ్యూజిక్ లవర్స్ నుంచి మంచి స్పందన వస్తోంది. ఈ పాట యూట్యూబ్‌లో నంబర్ 1 ప్లేస్‌లో -టె-ండింగ్ అవుతోంది. రామజోగయ్య శాస్త్రి రాసిన ఈ పాటను ఎంఎం కీరవాణి కంపోజ్ చేయగా.. శంకర్ మహదేవన్, ఐరా ఉడుపి, లిప్సికా భాష్యం పాడారు. రామ రామ సాంగ్ విశ్వంభరకు స్పెషల్ అట్రాక్షన్‌గా నిలుస్తుందనడంలో ఎలాంటి సందేహం లేదని తాజా వార్త చెప్పకనే చెబుతోంది. ఈ మూవీని యూవీ క్రియేషన్స్ బ్యానర్‌పై వంశీ, ప్రమోద్ విక్రమ్ తెరకెక్కిస్తుండగా.. ఇప్పటికే రిలీజ్ చేసిన విశ్వంభర -టైటిల్ లుక్, కాన్సెప్ట్ వీడియో మిలియన్ల సంఖ్యలో వ్యూస్ రాబడుతూ సినిమాపై సూపర్ హైప్ క్రియేట్ చేస్తున్నాయి. ఈ చిత్రాన్ని మే 9న విడుదల చేయనుండగా.. మేకర్స్ నుంచి స్పష్టత రావాల్సి ఉంది.







# కథను నమ్మితే...ఇక రంగంలోకి దిగిపోతా

నటుడు విజయ్ సేతుపతి స్పష్టీకరణ

విజయ్ సేతుపతి హీరోగా దర్శకుడు పూరి జగన్నాథ్ ఓ సినిమా రూపొందించనున్న విషయం తెలిసిందే. అయితే ఈ సినిమాను ప్రకటించినప్పటినుంచి రకరకాల కామెంట్స్ వినిపిస్తున్నాయి. పూరి ఫామ్‌లో లేరని ఆయన స్క్రిప్ట్‌ను ఎందుకు ఎంచుకున్నారంటూ విజయ్ సేతుపతిని ట్యాగ్ చేస్తూ కొందరు కామెంట్స్ చేస్తున్నారు. తాజాగా దీనిపై ఈ హీరో స్పందించారు. దీనికి తనదైన శైలిలో సమాధానమిచ్చారు.

పూరి జగన్నాథ్‌తో నేను చేయనున్న సినిమా షూటింగ్ జూన్‌లో ప్రారంభం అవుతుంది. గతంలోవారు చేసిన సినిమాల ఫలితాల ఆధారంగా దర్శకులను జడ్జ్ చేయను. స్క్రిప్ట్ నచ్చితే సినిమా చేస్తాను. పూరి చెప్పిన కథ నాకు చాలా నచ్చింది. అందుకే అంగీకరించాను. ఇలాంటి కథ ఇప్పటివరకూ చేయలేదు. నేను ఎప్పుడూ కొత్త వాటికి ప్రాధాన్యం ఇస్తాను. గతంలో చేసిన స్టోరీలు రిపీట్ కాకుండా చూసుకుంటాను. ఈ సినిమాలో టబు ఓ కీలక పాత్రలో కనిపించనున్నారు. ఆమె గొప్ప నటి. టాలెంటెడ్ కోస్టార్. గతంలో ఎప్పుడూ ఆమెతో కలిసి స్క్రీన్ పంచుకోలేదు. ఈ సినిమాలో ఆమెతో కలిసి నటించడం ఆనందంగా ఉంది. విజయ్ సేతుపతి: నేను ఇప్పటివరకూ చేసిన చిత్రాల్లో 'మహారాజ' నాకు ప్రత్యేకమైనది. అందులోని పాత్ర కష్టమైనది. పిల్లలపై జరుగుతోన్న అఘాయిత్యాలకు సంబంధించిన కొన్ని సన్నివేశాలు ఉన్నాయి. వాటిలో నటించేటప్పుడు వణికిపోయాను. 'సూపర్ డీలక్స్', 'ఉప్పెన'లోని పాత్రలు కూడా కష్టమైనవే. కానీ 'మహారాజ' నా హృదయాన్ని హత్తుకుంది. ఎందుకంటే నేను నిజజీవితంలోనూ ఒక కుమార్తెకు తండ్రినే కదా. నేను బలమైన సందేశం ఉన్న సినిమాలు ఎంచుకుంటాను. అదే నా బలం. పూర్తిగా వినోదాత్మక చిత్రాలలో నటించకూడదని కాదు.. వినోదంతో పాటు సందేశం కూడా ఉండాలి. పూరి సినిమాతో పాటు- మరో రెండు తమిళ ప్రాజెక్ట్‌లు చేస్తున్నాను. మిస్కిన్ దర్శకత్వంలో 'ట్రైన్' చిత్రంలో నటిస్తున్నాను. ఇది యాక్షన్ చిత్రం. దీనితో పాటు మరో మర్డర్ మిస్టరీలో నటిస్తున్నాను.

# కథ కోసం నానా తంటాలు పడతా




'కల్కి'లో ప్రతి సన్నివేశానికి బ్యాక్‌గ్రౌండ్‌లో ఎంతో వర్క్ చేశాం. తెరపై చూశాక అది ఫైటింగ్ సీన్ అంటారు. కానీ, దాని వెనక ఎంతో కష్టం ఉంటుందని దర్శకుడిగా తన అనుభవాలను పంచుకున్నారు నాగ్ అశ్విన్. తాజాగా కాలేజ్ స్టూడెంట్స్‌తో ముచ్చటించిన ఆయన ఇండస్ట్రీలో తన అనుభవాలను పంచుకున్నారు. వారితో కొన్ని ఆసక్తికర విషయాలను చెప్పారు. చేసే పని ఏదైనా వందశాతం కష్టపడాలి. షార్ట్ ఫిల్మ్, సినిమా ఏదైనా ఇదే చివరిది అని భావించి తీయాలి. నేను బుక్స్ బాగా చదువుతాను. సినిమాల కంటే పుస్తకాలు మనపై ఎక్కువ ప్రభావాన్ని చూపుతాయి. పరిశ్రమలో కొనసాగాలంటే పుస్తకాలు చదవడం కూడా ముఖ్యమే. మనం అనుకున్న కథను ప్రేక్షకులకు అర్థం అయ్యేలా రాయగలగాలి. ఒక సామాన్య కథను కూడా ఆసక్తిగా రాయాలి. ఆ సినిమా వెనక నా ఒక్కడి కష్టం మాత్రమే లేదు. అది ఒక టీమ్ కష్టం. టీమ్‌లోని అందరి సలహాలు వింటాను. చిన్నప్పటి నుంచి మహాభారతం గురించి తెలుసు. దాని ఆధారంగా సినిమా తీయాలంటే కొంచెం భయపడ్డానని చెప్పారు. నేను కొన్ని ప్రాజెక్ట్‌లకు ఎడిటర్‌గా కూడా వర్క్ చేశాను. సినిమా బాగా రావడానికి ఎడిటింగ్ ప్రధానం. మొదట స్టోరీ రాసుకుంటాను. అందులోని పాత్రల ఆధారంగా నటీనటులను ఎంపిక చేసుకుంటాను. కల్కిలో పాత్రలు రాసిన తర్వాత మొదట అమితాబ్ బచ్చన్‌ను, తర్వాత ప్రభాస్‌ను సెలక్ట్ చేసుకున్నాను. ది నేను డైరెక్ట్ చేస్తే బాగుండేది అని ఏ సినిమాకు అనిపించలేదు. కానీ, 'ఖలేజా 'డియర్ కామ్రేడ్' సినిమాలను నేను ఎడిట్ చేసి ఉంటే బాగుండేది అనిపించింది. నాకు కామెడీ సినిమాలు అంటే ఇష్టం. ముఖ్యంగా జంధ్యాల సినిమాలు నచ్చుతాయి. నేను ఏదైనా రాసుకున్న తర్వాత రెండు నెలలకు అదే ఐడియా వేరే సినిమా -ట్రైలర్‌లో కనిపిస్తుంది. దీంతో దాన్ని పక్కన పెట్టాల్సి వస్తుంది. 2008లో ఒక కథ రాసుకున్నాను. జ్ఞాపకాలు, కలలు ఈ రెండు అంశాలతో రాశాను. ఇదే కాన్సెప్ట్‌తో వచ్చిన హాలీవుడ్ సినిమా 'ఇన్‌సెప్షన్' ట్రైలర్ చూశాక వారం రోజులు డిప్రెషన్‌లోకి వెళ్లాను. ఎంతో కష్టపడి కొత్తగా ఒక కథను రాస్తే గుర్తించే వారికంటే.. గతంలో వచ్చిన లవ్‌స్టోరీనే మరోసారి తెరకెక్కిస్తే దాని గురించి మాట్లాడేవారు ఎక్కువమంది ఉంటారు. అందుకే ఎప్పుడూ కొత్తగా రాసుకోవాలి.

# ఎర్రబడిన రష్మిక కళ్లు.. ఎందుకంటే

నైట్ షూటింగ్స్ ను బాగా ఎంజాయ్ చేస్తున్న రష్మిక తాజాగా తన ఇన్‌స్టాగ్రమ్‌లో ఓ వీడియోను షేర్ చేసింది. ఆ వీడియోలో రష్మిక తన నైట్ షూట్స్ గురించి మాట్లాడింది.

కిర్రిక్ పార్టీ సినిమాతో హీరోయిన్ గా చిత్ర పరిశ్రమకు ఎంట్రీ ఇచ్చిన రష్మిక తక్కువ టైమ్ లోనే సౌత్ లో స్టార్ హీరోయిన్ అయిపోయింది. ఆల్మోస్ట్ సౌత్ లోని అగ్ర హీరోలందరితో సినిమాలు చేసిన రష్మిక ప్రస్తుతం బాలీవుడ్ లో సత్తా చాటాలని చూస్తోంది. యానిమల్ సినిమాతో బాలీవుడ్ లో బ్లాక్ బస్టర్ హిట్ ను అందుకున్న రష్మిక రీసెంట్ గా ఛావా సినిమాతో మరో సెన్సేషనల్ సక్సెస్ ను అందుకుంది. ఇటీవల బాలీవుడ్ స్టార్ హీరో సల్మాన్ ఖాన్ తో కలిసి సికందర్ చేసిన రష్మిక ఆ సినిమాతో డిజాస్టర్ ను అందుకుంది. సినీ ఇండస్ట్రీలో హిట్టూ ఫ్లాపులు కామన్ అనుకుని సికందర్ డిజాస్టర్ ను లైట్ తీసుకున్న రష్మిక ప్రస్తుతం థామా అనే సినిమాలో నటిస్తోంది. ఆ సినిమా కోసం రష్మిక నైట్ షూట్ చేసి బాగా అలసిపోతుంది. ఈ విషయాన్ని స్వయంగా రష్మికనే వెల్లడించింది. ఆయుష్మాన్ ఖురానాతో రష్మిక మందన్నా చేస్తున్న థామా సినిమా గత కొన్ని రోజులుగా నైట్ షూట్స్ జరుపుకుంటుంది. ఈ నైట్ షూట్స్ లో హీరోహీరోయిన్లపై సీన్స్ ను షూట్ చేస్తున్నట్టు సమాచారం. నైట్ షూటింగ్స్ ను బాగా ఎంజాయ్ చేస్తున్న రష్మిక తాజాగా తన ఇన్‌స్టాగ్రమ్‌లో ఓ వీడియోను షేర్ చేసింది. ఆ వీడియోలో రష్మిక తన నైట్ షూట్స్ గురించి మాట్లాడింది. రాత్రంతా నిద్ర లేక కళ్లు బాగా ఎర్రగా అయిపోయాయి. షూటింగ్ వల్ల బాగా అలసిపోయా. ఉదయాన్నే అందరికీ పాజిటివ్ వైబ్ ను క్రియేట్ చేయడం కోసం ఈ వీడియోని ఊరికే చేశానని అందరికీ గుడ్ మార్నింగ్. మీరు కూడా నాలానే హ్యాపీగా దేను మొదలుపెట్టాలని కోరుకుంటున్నా, లవ్ యూ ఆల్, ఏం జరిగినా బెస్ట్ ఇవ్వడానికి ట్రై చేయమని చెప్పింది రష్మిక. ఇక సినిమాల విషయానికొస్తే రష్మిక పలు భాషల్లో నటిస్తూ హీరోయిన్ గా ఎంతో బిజీగా ఉంది. బాలీవుడ్ లో థామా సినిమా చేస్తున్న రష్మిక ఆ సినిమాను సమ్మర్ కు పూర్తి చేయనుంది. దీపావళికి థామా రిలీజయ్యే ఛాన్సుంది. ఈ మూవీలో రష్మిక ఓ డిఫరెంట్ పాత్రలో కనిపిస్తుందని సమాచారం. ఇక తెలుగులో రష్మిక కుబేర సినిమాతో పాటూ గర్ల్‌ఫ్రెండ్, రెయిన్‌బో సినిమాల్లో కూడా నటిస్తోంది.



# అమిర్‌ను డైరెక్ట్ చేయనున్న వంశీపైడిపల్లి

కొంతకాలంగా వంశీ పైడిపల్లి బాలీవుడ్ ఎంటర్‌పై దృష్టి సారించాడు. అమిర్ ఖాన్ హీరోగా ఓ చిత్రాన్ని నిర్మించే క్రమంలో ఆయనకు స్టోరీ లైన్ చెప్పినట్లు తెలుస్తోంది. ఇప్పటికే తమిళనాడులో విజయ్‌తో ఓ సినిమాచేసిన వంశీ పైడిపల్లి ఇప్పుడు హిందీలోకి అడుగు పెట్టాలని చూస్తున్నారు. దిల్ రాజు ఈ సినిమాకు కూడా నిర్మాతగా వ్యవహరించబోతున్నట్టు-గా చెబుతున్నారు. ఇటీవల ఆయన ప్రొడ్యూస్ చేసిన పాన్ ఇండియా లెవెల్‌లో మరో క్రేజీ ప్రాజెక్టు పట్టాలెక్కేలా కనిపిస్తోంది. బాలీవుడ్ సూపర్‌స్టార్ ఆమిర్ ఖాన్ , టాలీవుడ్ డైరెక్టర్ వంశీ పైడిపల్లితో సినిమా వర్కవుట్ అయ్యేలా ఉందన్న టాక్ వినిపిస్తోంది. టాలీవుడ్ వర్గాల్లో వినిపిస్తున్న న్యూస్ ప్రకారం.. వంశీ చెప్పిన సింగిల్-లైన్ ప్లాట్ ఆమిర్‌ని ఫిదా చేసిందట. దీంతో పూర్తి స్క్రిప్ట్ కోసం ఆమిర్ ఆసక్తిగా ఎదురుచూస్తున్నాడని తెలుస్తోంది. వంశీ తన రైటర్స్ టీమ్‌తో స్క్రిప్ట్‌ని డెవలప్ చేస్తున్న స్టైల్ ఆమిర్‌కి బాగా నచ్చిందట. స్క్రిప్ట్ రెడీ అయిన వెంటనే మేకర్స్ ఆయనకు చెప్పబోతున్నట్టుగా తెలుస్తోంది. కొంతకాలంగా వంశీ పైడిపల్లితో పాన్ ఇండియా ట్రావెల్ చేస్తున్న దిల్ రాజు నే ఈ సినిమాకు కూడా నిర్మాతగా వ్యవహరించబోతున్నట్టుగా చెబుతున్నారు.

# కొత్త చిత్రాలతో సందడి



ఉగాదితో తెలుగువారందరికీ కొత్త సంవత్సరం ప్రారంభమైనట్టు- కేరళ, తమిళనాడు ప్రాంత వాసులకు ఏప్రిల్ 14తో నూతన సంవత్సరం మొదలైంది. ఈ విషును తారలంతా ఘనంగా సెలబ్రేట్ చేసారు. ఈ సందర్భంగా కోలీవుడ్, మాలీవుడ్ హీరోలు తమ రాబోయే చిత్రాలకు సంబంధించి అప్‌డేట్స్ షేర్ చేసుకున్నారు. అమరన్ తో సూపర్ హిట్ కొట్టిన శివ కార్తికేయన్ తాజాగా మురుగదాస్ డైరెక్షన్ లో చేస్తున్నసినిమా మదరాసి రిలీజ్ డేట్ కన్ఫర్మ్ చేసింది యూనిట్. సెప్టెంబర్ 5కే థియేటర్లలో బొమ్మ రాబోతుంది. మాలీవుడ్ స్టార్ యాక్టర్.. నివిన్ పౌలీ విషు సందర్భంగా ఓ సినిమాను స్టార్ట్ చేశాడు. బేబీ గర్ల్ అనే మూవీకి ఏప్రిల్ 14న కొబ్బరి కాయ కొట్టారు. ఫస్ట్ కుంచికో బొబన్ హీరోగా అనుకుంటే ఆయనకున్న కమిట్‌మెంట్స్ వల్ల డేట్ అడ్జస్ట్ చేయలేకపోవడంతో ఇప్పుడు ఈ ప్రాజెక్ట్ నివిన్ చెంతకు చేరింది. 2023లో మలయాళంలో వచ్చిన గరుడన్ ఫేం అరుణ్ వర్మ ఈ చిత్రానికి దర్శకుడు. ఫహాద్ ఫజిల్, కళ్యాణీ ప్రియదర్శన్ జంటగా నటిస్తోన్న మూవీ ఒడుం కుతిరా చదూం కుతిరా ఫస్ట్ లుక్ పోస్టర్ విషు సందర్భంగా రిలీజ్ చేశారు. రొమాంటిక్ కామెడీ జోనర్‌లో క్రేజీ వెడ్డింగ్ స్టోరీగా తెరకెక్కిస్తున్నాడు డైరెక్టర్ అల్తాఫ్ సలీమ్. అలాగే తెలుగులో ఈగ తరహాలో మలయాళంలో ÷-లపైతో సరికొత్త ప్రయోగం చేస్తున్నారు. లవ్లీ అనే -టైటిల్‌తో తెరకెక్కుతోన్న మూవీ నయా అప్డేట్ వచ్చింది. ఈ సినిమాను గతంలో ఏప్రిల్ 4న విడుదల చేయాలనుకోగా ఇప్పుడు మే 4కు పోస్ట్ పోన్ అయిందని తెలుపుతూ పోస్టర్ రిలీజ్ చేసారు.

# గుడ్ బ్యాడ్ అగ్లీలో ఇళయారాజా పాటలు రీమిక్స్

టాలీవుడ్ అగ్ర నిర్మాణ సంస్థ మైత్రీ మూవీ మేకర్స్ కు ప్రముఖ సంగీత దర్శకులు ఇళయరాజా నోటీసులు పంపారు. తెలుగులో అగ్రగామి సంస్థగా సినిమాలు రూపొందిస్తున్న మైత్రీ మూవీ మేకర్స్ గుడ్ బ్యాడ్ అగ్లీ సినిమాతో తమిళ సినిమా పరిశ్రమలో అడుగుపెట్టింది. కోలీవుడ్ స్టార్ హీరో అజిత్ కుమార్ హీరోగా యంగ్ డైరెక్టర్ ఆదిక్ దర్శకత్వంలో భారీ బడ్జెట్ పై ఏఇ÷ఖ సినిమాను నిర్మించారు. ఏప్రిల్ 10న వరల్డ్ వైడ్ గా రిలీజ్ అయిన ఈ సినిమా బ్లాక్ బస్టర్ హిట్ టాక్ తెచ్చుకుని రికార్డ్ స్థాయి కలెక్షన్స్ రాబడుతోంది. అయితే ఈ సినిమాలో కొన్ని సీన్స్ లో ఒకప్పటి తమిళ్ సినిమాలలోని ఇళయరాజా సంగీతం అందించిన సాంగ్స్ ను గుడ్ బ్యాడ్ అగ్లీలో వారిని రీమిక్స్ చేసి ఉపయోగించారు. ఆ సదరు సీన్స్ థియేటర్స్ లో ఫ్యాన్స్ ఆ సాంగ్స్ ఫుల్ ఎంజాయ్ చేస్తున్నారు. అందుకు సంబందించి వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ గా మారాయి. అయితే తన పాటను అనధికారికంగా వాడుకోవటం పై ఇళయరాజా ఆగ్రహం వ్యక్తం చేసారు. సినిమాలో తన పాటలు వాడడం పై నోటీ-సులు ఇచ్చారు ఇళయరాజా. నష్టపరిహారం కింద తనకు ఐదు కోట్ల రూపాయలు చెల్లించాలంటూ నిర్మాణ సంస్థ మైత్రీ మూవీ మేకర్స్ కు నోటీ-సులు పంపారు ఇళయరాజా. అదే విధంగా గుడ్ బ్యాడ్ అగ్లీలోని మూడు పాటలను వెంటనే నిలిపివేయాలని మరియు 7 రోజుల్లోగా చిత్ర బృందం బేషరతుగా క్షమాపణ చెప్పాలని ఇళయరాజా డిమాండ్ చేసారు.



Edited, Printed, Published and Owned by MALLE NAGI REDDY Printed at LAXMI PUBLICATIONS H.No. 28-891/9, Journalist Colony, Chinthapally X Road, Miryalagda, Dist: Nalgonda-508207, Telangana.and Published at H.no.. 28 - 891/9, Chinthapally Bypass X Road, Miryalagda, Dist: Nalgonda-508207, Telangana."Editor: MALLE NAGI REDDY. RNI NO. TELTEL/2022/83470. Cell: 9666924232. gmail Id: manasakshi.in@gmail.com.